Pubilshed from Kadapa

PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




కడప KADAPA | సంపుటి : 03 Vol.No : 03 | సంచిక : 12 Issue No : 12 | మంగళవారం Tuesday | అక్టోబర్ 6, 2026 6 OCTOBER 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakinkada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## సీమ అభివృద్ధి ఎవరాపినా..

# ఆగదు

- జల్ జీవన్ మిషన్‌తో 3.3 కోట్ల మందికి తాగునీరు
- రూ.30,136 కోట్లతో అమరజీవి జలధార పనులకు శ్రీకారం
- పైలాన్ ఆవిష్కరించి పనులు ప్రారంభించిన సీఎం, డిప్యూటీ సీఎం
- హార్టికల్చర్ హబ్ నుంచి ప్రపంచ మార్కెట్లకు సీమ బ్రాండ్‌తో ఫలాలు
- సీమకు రప్పారప్పా రాజకీయం కాదు.. అభివృద్ధి, సంక్షేమం కావాలి
- కేంద్రం-రాష్ట్రం-స్థానిక సంస్థల్లో కూటమి ట్రిపుల్ ఇంజన్ సర్కారే ఉండాలి
- పొద్దుటూరు బహిరంగ సభలో సీఎం చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,ప్రొద్దుటూరు : గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా జల్ జీవన్ మిషన్ 2.0 - అమరజీవి జలధార పనుల్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. కడప జిల్లా పొద్దుటూరు నియోజకవర్గం కొత్తపల్లిలో పైలాన్ ఆవిష్కరించిన నేతలు ప్రతి ఇంటికీ కుళాయి, ప్రతి కుటుంబానికి సురక్షిత తాగునీరు అందించేలా చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రూ.30,156 కోట్ల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నారు.

ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు 24,601 ఆవాసాలకు నీటి సరఫరాను విస్తరించనున్నారు. ఇందుకోసం 77,243 కిలోమీటర్ల పైపు లైన్ నెట్వర్క్ ను విస్తరించేలా పనులు చేపట్టనున్నారు. తద్వారా మొత్తం 61.60 లక్షల కుళాయి కనెక్షన్లకు మరింత మెరుగైన తాగు నీటి సరఫరా జరగనుంది.

2లో..



## కాంగో నదిలో పడవలు ఢీ..

### 30 మంది మృతి

కిన్షాసా: కాంగో నదిలో రెండు పడవలు ఢీకొన్న ఘటనలో కనీసం 30 మంది మృతి చెందారు. పలువురు గల్లంతయ్యారు. ఈ ఘటన ఈక్వటేర్ ప్రావిన్స్‌లోని న్గోంబే-లుకోలెలా ప్రాంతం సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.

ఉబాంగి నుంచి రాజధాని కిన్షాసాకు వెళ్తున్న పడవ, కిన్షాసా నుంచి లుకోలెలాకు వెళ్తున్న మరో పడవను ఢీకొట్టింది. ఢీకొన్న అనంతరం ఒక పడవ పూర్తిగా నీటిలో మునిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిగా పలువురి ఆచూకి గల్లంతైంది. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కాంగోలో పడవ ప్రమాదాలు

- మిగతా 2లో..

## పార్టీ కాదు.. ప్రజలే ముఖ్యం

- తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదు
- ప్రతి ఇంటికీ సురక్షిత నీరు.. ప్రతి గ్రామానికి నీటి భద్రతే అమరజీవి జలధార లక్ష్యం
- రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార'కు శ్రీకారం
- పులివెందులకు రూ.280 కోట్లుతో 299 గ్రామాల తాగు నీటి సమస్యకు పరిష్కారం
- 3.27 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందించేలా భారీ ప్రణాళిక
- గత ఏడు దశాబ్దాల్లో నిర్మించిన వసతులకు మించి ఈ ఐదేళ్లలోనే భారీ నీటి మౌలిక వసతులు
- రాయలసీమ నుంచి ఉద్దానం వరకు ప్రతి ప్రాంతానికీ సురక్షిత తాగునీరు
- ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్
- అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ప్రజాభూమి ప్రతినిధి, ప్రొద్దుటూరు : తాగు నీటి విషయంలో రాజకీయాలకు తావు లేదని, అభివృద్ధి విషయంలో ప్రాంతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజలందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వడమే కూటమి ప్రభుత్వ విధానమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ప్రజలు ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ పార్టీకి మద్దతు ఇచ్చినా వారి సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు.

- మిగతా 2లో..

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..



### సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు.

2లో

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

### ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ

- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు. వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు.

ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.కేసు నేపథ్యం ఇదే.. ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు.

2 పేజీలో..



- ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- 2029 నాటికి ప్రభుత్వ స్కూళ్లన్నింటిలో 4-స్టార్ మౌలిక సదుపాయాలు
- స్కిల్ డెవలప్‌మెంట్, స్కూళ్లలో మౌలిక సదుపాయాలపై మంత్రి లోకేష్ సమీక్ష

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట!

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నీ టూ-స్టార్‌కు అప్‌గ్రేడ్ చేయాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో సోమవారం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖలపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

2లో..

## మద్యం రవాణా స్కాంలో మాజీ మంత్రి కారుమూరికి సిట్ కస్టడీ



- మాజీ మంత్రి కారుమూరిని హైదరాబాద్ జైలు నుంచి విజయవాడ తరలింపు
- కుమారుడికి సబ్ కాంట్రాక్టు ఇప్పించి నిధులు స్వాహా చేశారని ఆరోపణలు
- కుమారుడు, కోడలి ఖాతాల్లోకి 85 శాతం నిధులు మళ్లినట్లు గతంలో ఈడీ గుర్తింపు
- ఈ నెల 9 వరకు కారుమూరిని ప్రశ్నించనున్న సిట్ అధికారులు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో కీలక ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. హైదరాబాద్ జైలులో ఉన్న ఆయన్ను సోమవారం విజయవాడకు తరలించారు. విజయవాడలో వైద్య పరీక్షలు పూర్తి చేసిన అనంతరం, ఈ నెల 9వ తేదీ వరకు జైలులో ఆయనను ప్రశ్నించనున్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి మరిన్ని కీలక వివరాలు రాబట్టడమే లక్ష్యంగా సిట్ అధికారులు కారుమూరిని కస్టడీలోకి తీసుకున్నారు.

2లో

## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..

### లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

- నాలుగు రోజుల వరుస నష్టాలకు తెరదించిన స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 472 పాయింట్లు, నిఫ్టీ 133 పాయింట్ల లాభంతో ముగింపు
- నిఫ్టీకి 22,600 స్థాయి వద్ద కీలక నిరోధం ఉందని చెప్పిన నిపుణులు
- కన్స్యూమర్, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లలో కొనుగోళ్ల జోరు
- బుధవారం ఆర్బీఐ పాలసీ నిర్ణయంపై ఇన్వెస్టర్ల దృష్టి



ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న నష్టాల పరంపరకు నేటి ట్రేడింగ్‌తో తెరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు తోడవ్వడం, ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఆసక్తి పెరగడంతో కీలక సూచీలు లాభాల బాట పట్టాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 472.77 పాయింట్లు (0.66%) లాభంతో 72,382.47 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 133.80 పాయింట్లు (0.6%) పెరిగి 22,555.75 వద్ద ముగిసింది.

- మిగతా 2లో..



### ఏపి హై కోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఐదుగురు జడ్జిలు

## బాధ్యతల స్వీకరణ

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్ హై కోర్టుకు శాశ్వత న్యాయమూర్తులుగా అదనపు న్యాయమూర్తులు జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్,జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ,జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులు బాధ్యతలు స్వీకరించారు.ఏపి హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ కుంచం మహేశ్వరరావు,జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్),జస్టిస్ చల్లా గుణ రంజన్,జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ,జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు.

2 పేజీలో..

# సీమ అభివృద్ధి ఎవరాపినా ఆగదు

మొత్తంగా ఈ పనులతో 3.3 కోట్ల మందికి సురక్షితమైన తాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 95 లక్షల కుటుంబాలకు గానూ ఇప్పటికే దాదాపు 62 లక్షల కుటుంబాలకు ఇంటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయని సీఎం తెలిపారు. జల్ జీవన్ మిషన్--2.0 కింద మరో 27 లక్షల కుటుంబాలకు తాగు నీటి సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇంటింటికీ తాగునీరు అందడం వల్ల ముఖ్యంగా మహిళల నీటి కష్టాలు తీరతాయని చంద్రబాబు పేర్కొన్నారు. నీటి కోసం వెచ్చించే శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయని.. స్వచ్ఛమైన నీటితో ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని వివరించారు. జల్ జీవన్ మిషన్ ప్రధాన ఉద్దేశం శాశ్వత నీటి వనరుల నుంచి ప్రజలకు తాగునీరు సరఫరా చేయడమేనని ముఖ్యమంత్రి అన్నారు. గతంలో ఈ పథకం అమలులో లోపాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. కేంద్రం నుంచి భారీగా నిధులు పొందిన రాష్ట్రాలతో పోలిస్తే గత ప్రభుత్వం ఏపీలో ఈ పథకానికి కేవలం రూ. 2,600 కోట్లు మాత్రమే వినియోగిం చిందని పేర్కొన్నారు. తాగు నీటితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సీఎం తెలిపారు. పల్లె పండుగ--3.0 ద్వారా రూ.11,085 కోట్లతో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు, పంట కుంటలు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కోసం రానున్న కాలంలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు.

**రాష్ట్రానికి-రాయలసీమకు జల భద్రత :** తాగునీటి అవసరాలతో పాటు సాగునీరు, పారిశ్రామిక అవసరాలు తీర్చేలా నీటి నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించిందని చంద్రబాబు తెలిపారు. రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం ద్వారా తెలుగుతల్లికి జలహారతి ఇచ్చామని చెప్పారు. రాబోయే మూడేళ్లలో రూ.35 వేలకోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. తేదీలతో సహా ప్రాజెక్టుల క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు కరవు సమస్య ఉండదన్నారు. కరవు పరిస్థితుల్లోనూ 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిందని చెప్పారు. కనీసం 200 టీఎంసీల గోదావరి వరద జలాలను వినియోగించుకుంటే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. హంద్రీ--నీవా ఫేజ్--1ను పూర్తి చేసి రాయలసీమలో రిజర్వాయర్లను నింపామని, వెలిగొండ ఫేజ్--1 ద్వారా నల్లమల సాగర్‌కు నీరు తీసుకెళ్లామని వివరించారు. పోలవరం ప్రాజెక్టును రానున్న గోదావరి పుష్కరాలకు ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. రాయలసీమ దశ, దిశ మార్చేలా రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ హబ్‌తో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, మార్కెటింగ్ సౌకర్యాలు పెరుగుతాయని చెప్పారు. స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్, గ్రీన్ ఎనర్జీ, గోల్డ్ మైనింగ్ వంటి రంగాల్లో ప్రాజెక్టులు రానున్నాయని వెల్లడించారు. సినిమాల్లో ఒకప్పుడు రాయలసీమను ముఠా కక్షలకు ప్రతీకగా చూపించేవారని...ఇకపై శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు మేడ్ ఇన్ రాయలసీమ అని చెప్పుకునే రోజులు వస్తాయన్నారు. ఇక్కడ పండే ఫలాలు ప్రపంచ మార్కెట్లకు రాయలసీమ బ్రాండ్‌తో ఎగుమతి అవుతాయని సీఎం అన్నారు.

**ప్రతి కుటుంబానికి భరోసా :** పేదల సాధికారత, వ్యక్తిగత ఆదాయాల పెంపు, గ్రామాలు--పట్టణాల అభివృద్ధి, నాణ్యమైన జీవితం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు తెలిపారు. 2029 నాటికి ప్రతి కుటుంబానికి ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో 19 లక్షల ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పేదలకు శాశ్వత హక్కులు కల్పించేలా ఇళ్ల పట్టాలు ఇచ్చామని, విశాఖ, విజయవాడ, మంగళగిరిలో 60 వేల మందికి రూ.52 వేల కోట్ల విలువైన ఆస్తులు అందించామని వివరించారు. ప్రతి కుటుంబానికి భరోసా.. ప్రతి వర్గానికి అండ.. ప్రతి ప్రాంతానికి అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల్లో రోడ్లు, వీధి దీపాలు, తాగునీరు వంటి కనీస వసతులు కూడా లేకుండా పోయాయని సీఎం అన్నారు. రోడ్ల విషయంలో నాడు-నేడు బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. పల్లెలకు రహదారుల కల్పనలో పవన్ కల్యాణ్ తనదైన ముద్ర చూపిస్తున్నారని ప్రశంసించారు. 13,326 గ్రామాల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించి రికార్డు సృష్టించామని సీఎం తెలిపారు. 15వ ఆర్థిక సంఘం గ్రాంట్ల ద్వారా రూ.4,136 కోట్లకు పైగా నిధులు వచ్చాయని చెప్పారు. పంట కుంటలు, గ్రామాలకు రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలతో అభివృద్ధి వేగం పుంజుకుందని వివరించారు.

**దొంగ పనులే గొడ్డలి పార్టీ సిద్ధాంతం :** 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోనూ ఆ పార్టీకి చెంపదెబ్బ కొట్టారన్నారు. వివేకా హత్య కేసులో అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిందని, రూ.40 కోట్ల సుపారీ అంశం బయటకు వచ్చిందని అన్నారు. మద్యం కుంభకోణంలో వేల కోట్ల దోపిడీ జరిగిందని ఆరోపించారు. అందులోనూ అంతిమ లబ్ధిదారుగా అన్ని వేళ్లూ గొడ్డలి పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని అన్నారు. దీనికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని ... వీటిపై వాస్తవాలు మాట్లాడకుండా ఫేక్ ప్రచారంతోనే దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు.గ్రూప్ వన్ సర్వీసు పరీక్షలు రాస్తే జవాబు పత్రాలను అటెండర్లు, ఎలక్ట్రీషన్లతో దిద్దించారని..ఇసుకలోనూ దోపిడీ చేశారు. ఈ అక్రమాలు అన్నిటికీ సమాధానం చెప్పాలని సీఎం సవాలు విసిరారు. నేరాలు ఘోరాలు చేసి ప్రజల్ని మోసం చేయడానికి ఫేక్ ప్రచారం చేస్తారని ఎద్దేవా చేశారు. .గొడ్డలి పార్టీ తోక తిప్పితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఓ సిద్ధాంతం అంటూలేని గొడ్డలి పార్టీ కుట్రలు , ఫేక్ ప్రచారమే అజెండా అని సీఎం ఆక్షేపించారు. నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేయటం వారి డీఎన్ఏ లోనే ఉందన్నారు. వివేకా హత్య నుంచి మద్యం కుంభకోణం వరకూ, సింగయ్యను కారుకింద తొక్కించటం నుంచి మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ కేసు తప్పించటం వరకూ అన్నీ దొంగ పనులే చేశారని ఎద్దేవా చేశారు. బలవంతపు మతమార్పిడులు, హిందువులను క్రిష్టియన్లుగా మార్చటం లాంటి చర్యలు చేస్తున్నారని.. ఇలాంటి వన్నీ ఆ పార్టీ సిద్ధాంతంలో భాగమేనని అన్నారు. రాయలసీమలో కనీసం కడపకు ఏం చేశారో చెప్పగలరా అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

**స్థానిక సంస్థల్లోనూ కూటమి ట్రిపుల్ ఇంజన్ సర్కార్ :** అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కావాలని కోరడం సరికాదని చంద్రబాబు అన్నారు. ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదని, ప్రజలు ఇచ్చే అధికారమని గుర్తుంచుకోవాలని సూచించారు. 2019లో టీడీపీకి 23 సీట్లు వచ్చినప్పుడు ఐదు సీట్లు లాగేస్తే ప్రతిపక్ష హోదా ఉండదని ఎగతాళి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. తాను కూడా రాయలసీమ బిడ్డనేనని, ఈ ప్రాంతాన్ని తిరుగులేని అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. సీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని.. రాయలసీమకు రప్పారప్పా రాజకీయాలు కావాలా? అని ప్రజలను ప్రశ్నించారు. కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక సంస్థల్లో కూటమి ఉంటే ట్రిపుల్ ఇంజన్ సర్కారు ఉన్నట్టేనని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశం, రాష్ట్రం బాగుంటేనే ప్రజలంతా బాగుంటారని చెప్పారు. అభివృద్ధి-సంక్షేమం-సుపరిపాలనతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అరాచకం వద్దు.. అభివృద్ధి కావాలి. సంక్షోభం వద్దు.. సంక్షేమం కావాలి. రాయలసీమకు శాంతి, నీళ్లు, పరిశ్రమలు, సుపరిపాలన, ఉపాధే కావాలని సీఎం వ్యాఖ్యానించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## సంపాదకీయం

# సామాన్యులపై ధరల మోత!?

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదైంది. ఈసారి భారత్?లోకి నైరుతి ఆగమనం ఆలస్యమైంది. భారత వాతావరణ శాఖ మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని అంచనా వేసినప్పటికీ ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. జూన్ 1వ తేదీన కూడా ప్రవేశించలేదు. నాలుగు రోజులు ఆలస్యంగా కేరళలోకి ప్రవేశిం చాయి. కానీ ఆశించినంతంగా వర్షాలు కురవలేదు. ఈ లోటు వర్షపాతంతో నీటి ఎద్దడి ఎక్కవగా ఉండే ప్రమాదం ఉంది. మరోవైపు వర్షాభావ పరిస్థితులతో వ్యవసా యం సజావుగా సాగక వ్యవసాయాధారిత సరుకులపై తీవ్ర ప్రభావం చెపే ప్రమాదం లేకపోలేదు. తద్వారా సామాన్యులపై ధరల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. ఆహార సంక్షోభం ఏర్పడే పరిస్థితులు కనబడు తున్నాయి. ఈ మధ్య న్యూయార్క్ ఏషియా సొసైటీ వేదిక మీద భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ రానున్న ఆహార సంక్షోభం గురించి చేసిన హెచ్చరికలు ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తున్నాయి.. ఆయన చేసిన హెచ్చరిక కొత్తగా పుట్టుకు వచ్చింది కాదు. కొన్నాళ్లుగా దానిపై దేశంలో చర్చ నలుగుతూనే ఉన్నది. గోడదెబ్బ, చెంపదెబ్బ అన్నట్టుగా అంతర్జాతీయ సమస్యలు ఓ వైపు, పర్యావరణ క్షీణత మరోవైపు నుంచి తరుముతున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఇరాన్‌పై అమెరికా యుద్ధం, అంతర్జాతీయంగా చమురు, ఎరువుల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా విధిస్తున్న పరిహార ఆంక్షలు దీనికి ఆజ్యం పోస్తున్నాయి. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ఇంధన ధరల అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కుదిపేస్తున్నాయి. ఈ సంక్షోభం భారత్ మీద ఎంత ప్రభావం చూపుతున్నదో నిర్ణయించేది మన దేశీయ సంసిద్ధత, విధానాల పటిష్టత, రాజకీయ విజ్ఞత మాత్రమే. దిగుమతులపై అధికంగా ఆధారపడటం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధాన బలహీనత. ఇంధనం, ఎరువులు, ముడిసరుకుల విషయంలో విదేశీ మార్కెట్లపై ఆధారపడటం వల్ల అంతర్జాతీయ ధరలు పెరిగితే దేశీయంగా ఆ భారం మోయక తప్పదు. మరోవైపు సబ్సిడీలు పెంచాల్సి రావడం సహజం, ఆర్థిక లోటు పెరుగుదల, పరిమిత ఆదాయ వనరులు ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ సామర్థ్యానికి పరీక్షలుగా మారాయి. ఇక ఎల్ నినో ప్రభావం ఈ సవాళ్లకు మరొక అదనపు ముప్పును జోడిస్తున్నది. సాధారణంగా ఎల్ నినో వల్ల వర్షపాతం తగ్గిపోయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతాయి. దీనివల్ల పంటలు దెబ్బతిని ఆహార కొరత ఏర్పడుతుంది. మహారాష్ట్రలో ఇప్పటికే కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మన రాష్ట్రంలో ఈ ఏడాది మొత్తంగా చూస్తే వర్షపాతం సాధారణ స్థాయిలో ఉన్నట్టు చెప్తున్నప్పటికీ, 18 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఇటీవలి వర్షపాతం గణాంకాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టులోనే సుమారు 38 శాతం వరకు వర్షాభావం నమోదవడం, మొత్తం మాన్సూన్ కూడా సాధారణ స్థాయికి తగ్గిపోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన వర్షాభావంలో భాగమే ఇది. దేశం మొత్తం గత దశాబ్దంలోనే కనిష్ఠ వర్షపాతం నమోదవడం ఈ సమస్యకు స్పష్టమైన సూచన. నాగార్జునసాగర్ వంటి కీలక జలాశయాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో నిండలేదు. ప్రవాహాలు అస్థిరంగా ఉండటం వల్ల భవిష్యత్ నీటి లభ్యతపై స్పష్టత లేదు. ముఖ్యంగా సెప్టెంబర్అక్టోబర్‌లో వచ్చే ప్రవాహాలపై ఆధారపడే పరిస్థితి గతంలో ఉన్నా, ఇప్పుడు వర్షాల అస్థిరత కారణంగా ఆ నమ్మకం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నది. దక్షిణ భారత రాష్ట్రాల రిజర్వాయర్లు కేవలం సుమారు 50 శాతం సామర్థ్యంతోనే ఉండటం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పడావుపెట్టి, పెండింగ్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల సాగునీరు తగిన స్థాయిలో అందుబాటులోకి రావడం లేదు. భూగర్భ నీటిమట్టాలు భారీగా పడిపోతున్నాయి. మరోవైపు పంట పెట్టుబడుల సమస్య వేధిస్తున్నది. ఇవన్నీ వెరసి సాగును సంకటంలో పడేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఆహార కొరత లేకపోయినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల పెరుగుదల సమస్య మాత్రం తీవ్రంగానే ఉంటుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. బహిరంగ మార్కెట్లో ఈసరికే రూ.70 దాటిన బియ్యం ధరలు సెంచరీ కొడతాయనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఉల్లిగడ్డల ధరలు కూడా కిలో రూ.60 దాటిపోయాయి. ఇక కూరగాయలు, ఇతర సరుకుల ధరలు సామాన్యులకు మోయరాని భారంగా పరిణమిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఆహార సమస్య తీవ్రరూపం దాల్చవచ్చని విదేశాంగమంత్రి చేసిన హెచ్చరిక ప్రాముఖ్యం సంతరించుకున్నది. ధరల సమస్య స్థానంలో తీవ్రమైన ఆహార కొరత ఎదురుకాకుండా చూడటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుసవాల్‌గా ఉంటుంది. తక్షణం వ్యవసాయరంగ సమస్యలపై అవి సమన్వయంతో దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. ఏది ఏమైనా ఈసారి ఎల్‌నినో సృష్టించిన ఈ పెను విపత్తును ముందుగా గ్రహించి ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ గండం నుండి గట్టెక్కే పరిస్థితులు లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట!

సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఇన్‌ఫ్రాకు సంబంధించి ఈ విద్యా సంవత్సరంలో జీరో-స్టార్ పాఠశాలలన్నింటినీ వన్-స్టార్‌కు చేరేలా అభివృద్ధి చేయాలన్నారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలను 4-స్టార్‌కు చేర్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్‌కు చేర్చాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని సూచించారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 లీప్ స్కూళ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాల్సిందిగా కోరారు. పాఠశాల మౌలిక సదుపాయాల శాఖ కమిషనర్ రంజిత్ బాషా స్పందిస్తూ... ప్రస్తుతం రాష్ట్రంలో వన్-స్టార్ 1,685, టూ-స్టార్ 15,618, త్రీ-స్టార్‌లో 19,099, ఫోర్-స్టార్‌లో 7,172 పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. అకడమిక్‌కు సంబంధించిన సంస్కరణలు పూర్తయినందున అధికారులు, ఉపాధ్యాయులంతా ఇక పూర్తిగా అభ్యసన ఫలితాలపైనే దృష్టి సారించాలని కోరారు.

**స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి :** కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధీనంలోని ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం (పీఎంకేవీవై) ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. రాష్ట్రంలో ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ (పీఎంఐఎస్), ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీం (పీఎంఎన్ఏఎస్) వంటి పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి నిరుద్యోగ యువతీయువకులను నైపుణ్యం పోర్టల్‌లోకి తీసుకువచ్చి, ఏఐ విద్య ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలని సూచించారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి భాషల్లో శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, మౌలిక సదుపాయాలు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి పాల్గొన్నారు.

# అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

# ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు.తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# కాంగో నదిలో పడవలు ఢీ..

తరచూ జరుగుతున్నాయి. రాత్రివేళ ప్రయాణాలు, పడవల్లో అధిక సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించడం, భద్రతా ప్రమాణాల లోపం, మౌలిక సదుపాయాల కొరతే ఇందుకు ప్రధాన కారణాలుగా అధికారులు పేర్కొంటున్నారు. గత జూలైలో కాసాయి ప్రావిన్స్‌లో విద్యార్థులతో వెళ్తున్న చెక్క పడవ మునిగిన ఘటనలో కనీసం 20 మంది మృతి చెందారు.

# ఏపి హై కోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఐదుగురు జడ్జిలు బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర హై కోర్టులో ఐదుగురు శాశ్వత న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయగా ఈ5గురు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం జరిగింది. ఏపీ హైకోర్టులో సేవలందిస్తున్న ఇతర గౌరవనీయ న్యాయ మూర్తులందరూ ఈ వేడుకకు హాజరై తమ సహచర న్యాయమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,బార్ కౌన్సిల్ ప్రతినిధులు,హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ న్యాయ వాదులు,న్యాయాధికారులు,రిజిస్ట్రార్లు,న్యాయశాఖ అధికారులు,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కాదు.. ప్రజలే ముఖ్యం



ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగు నీరు, ప్రతి గ్రామానికి నీటి భద్రత కల్పించడమే 'అమరజీవి జలధార' లక్ష్యమని తెలిపారు. సోమవారం కడప జిల్లా ప్రొద్దుటూరులో నిర్వహించిన జల్ జీవన్ మిషన్ - అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి తో కలిసి రూ.30,156 కోట్ల విలువైన తాగునీటి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "శ్రీరామచంద్రుని పాదస్పర్శతో పునీతమైన నేల. మహాత్మా గాంధీ నడయాడిన నేల. తెలుగు సాహిత్యాన్ని తన అక్షరాలతో సుసంపన్నం చేసిన సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులకు జన్మనిచ్చిన నేల ప్రొద్దుటూరు. బంగారం, వస్త్ర వ్యాపారంలో మినీ ముంబై గా, దసరా ఉత్సవాల్లో రెండో మైసూరు గా ప్రొద్దుటూరుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. రాష్ట్రంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.30,156 కోట్లతో 50,315 పనులను శ్రీకారం చుడుతున్నాం. 24,601 ఆవాసాల్లో ఇప్పటికే ఉన్న 61.60 లక్షల కుళాయి కనెక్షన్ల సామర్థ్యాన్ని పెంచి స్థిరీకరించడంతో పాటు, మరో 27.36 లక్షల కొత్త కుళాయి కనెక్షన్లను అందిస్తున్నాం. మొత్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగు నీరు అందేలా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నాం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్' జల్ జీవన్ మిషన్‌కు గత ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. 2019-24 మధ్య కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు దాదాపు రూ.26 వేల కోట్లు అందించినప్పటికీ, గత ఐదేళ్లలో రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి, అక్కడక్కడ పైపులైన్లు, చిన్నచిన్న పనులు చేసి వదిలేశారు. 2024తో పథకం గడువు ముగుస్తుందని, నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి వస్తుందని, ప్రజల తాగునీటి కష్టాలు ఎప్పటికీ తీరవని తెలిసినా కూడా పట్టించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, జల్ జీవన్ మిషన్‌ను కొనసాగించేందుకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నేను - ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ని కలిసి విజ్ఞప్తి చేశాము. అలాగే, కేంద్ర జలశక్తి మంత్రివర్యులు సి.ఆర్. పాటిల్ , కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో జలజీవన్ మిషన్ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, వెంటనే పనులు ప్రారంభించాం. ఇప్పటికే రూ.4,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశామని "పవన్ కళ్యాణ్ తెలిపారు.

# నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్..



మార్కెట్ సాంకేతిక అంశాలను విశ్లేషిస్తే, నిఫ్టీ ట్రేడింగ్ సమయంలో 22,580-22,600 పాయింట్ల కీలక స్థాయిని పరీక్షించినప్పటికీ, ముగింపు సమయానికి ఆ స్థాయి దిగువనే నిలిచింది. నిఫ్టీ ఈ నిరోధాన్ని అధిగమిస్తే 22,800 పాయింట్ల వరకు కోలుకునే అవకాశం ఉందని, లేనిపక్షంలో 22,400 స్థాయి వద్ద మద్దతు లభించవచ్చని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.నేటి ట్రేడింగ్‌లో ఐటీసీ, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ వంటి షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. రంగాల వారీగా పరిశీలిస్తే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఎఫ్ఎంసీజీ సూచీలు రాణించాయి. మరోవైపు, హెల్త్‌కేర్, ఫార్మా రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభాల్లోనే ముగియడం గమనార్హం.అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తక్షణమే పెంచకపోవచ్చనే అంచనాలతో అంతర్జాతీయ మార్కెట్లలో సెంటిమెంట్ మెరుగుపడింది. దీని ప్రభావం దేశీయ మార్కెట్లపై కూడా సానుకూలంగా కనిపించింది. అయితే, బుధవారం ఆర్బీఐ పాలసీ సమీక్ష జరగనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 96.30 వద్ద బలహీనంగా ట్రేడ్ అయింది. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించాలని, మార్కెట్ పతనమైనప్పుడు నాణ్యమైన షేర్లలో పెట్టుబడులు పెట్టడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

# మద్యం రవాణా స్కాంలో మాజీ మంత్రి కారుమూరికి సిట్ కస్టడీ

మొదటి పేజీ తరువాయి

ఈ కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేపట్టింది. మంత్రిగా తన అధికారాన్ని దుర్వినియోగం చేసి కారుమూరి నాగేశ్వరరావు, మద్యం రవాణా సబ్ కాంట్రాక్టును తన కుమారుడు కారుమూరి సునీల్‌కు ఇప్పించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. దీనికోసం 'సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్' అనే ఒక ముసుగు సంస్థను ఏర్పాటు చేసి, 'సిగ్మా లాజిస్టిక్స్'తో ఒప్పందం కుదిర్చింది కూడా నాగేశ్వరరావేనని ఈడీ తేల్చింది. ఈ కుంభకోణం ద్వారా అక్రమంగా సంపాదించిన సొమ్ములో ఏకంగా 85 శాతం ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అయినట్లు ఈడీ ఆధారాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఈ నిధులను విజయవాడ, తణుకు నియోజకవర్గాల్లోని కారుమూరి క్యాంపు కార్యాలయాల నిర్వహణ, వాహనాలకు డీజిల్, ఇతర ప్రయాణ ఖర్చులకు వినియోగించినట్లు కూడా గుర్తించింది. ఈడీ దర్యాప్తులో వెల్లడైన అంశాలపై మరింత లోతుగా విచారణ జరిపేందుకు సిట్ అధికారులు ఇప్పుడు కారుమూరిని ప్రశ్నించనున్నారు.

# మీకోసం అర్జీలపై సత్వరమే స్పందించాలి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజి




మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదే శించారు. ప్రజల నుంచి అందుతున్న అర్జీల ను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సకాలంలో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేయాలని సూచించారు.మచిలీపట్నంలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. డీఆర్వో కే. శ్రీధర్‌రెడ్డి, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ పి. నీలకంఠేశ్వరరెడ్డి, డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు.ప్రతి అర్జీదారుడి సమస్యను కలెక్టర్ ఓపికగా విని, సమస్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు, పరిష్కార స్థితిని అర్జీదారులకు తెలియజేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో డాక్టర్ ఆనంద్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ సాయిబాబు, ఎల్‌డీఎం సి. రవీంద్రారెడ్డి, డీపీవో ఎం. ధనలక్ష్మి, సర్వే ఏడీ లక్ష్మణరావు, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్‌బాబు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, పంచాయతీరాజ్ ఎస్ఈ పీవీ రమణారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమశేఖరరావు, డ్వామా పీడీ ఎన్. శివప్రసాద్ యాదవ్, హౌసింగ్ పీడీ వెంకట్రావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఉపాధి హామీ నిధులపై విచారణకు డిమాండ్

## రూ..81.90 లక్షలు డ్రా చేశారని ఆరోపణ.. కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజాభూమి ప్రతినిధి మారేడుమిల్లి మారేడుమిల్లి మండలంలో ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నడిగట్ల రమేష్‌బాబు కోరారు. ఈ మేరకు సోమవారం రంపచోడవరంలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ సురపాటి ప్రశాంత్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. మారేడుమిల్లి మండలం పీడమగ్రి కూడలి నుంచి గుంద్రాతి గ్రామం వరకు చేపట్టాల్సిన రహదారి, సీసీ రోడ్డు పనుల్లో పూర్తిస్థాయిలో పనులు జరగకుండానే రూ.81.90 లక్షల నిధులు డ్రా చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు, గుత్తేదారుపై ఫిర్యాదు చేశారు.నాలుగు వర్క్ కోడ్‌ల ద్వారా రూ.81.90 లక్షలు డ్రా చేసినట్లు ఆధారాలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో సంబంధిత అధికారుల ఆదేశాల మేరకు జరిగిన విచారణలోనూ నిధుల డ్రా అంశం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. అయితే డ్రా చేసిన మొత్తానికి, క్షేత్రస్థాయిలో జరిగిన పనులకు పొంతన లేదని పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రమేష్‌బాబు కోరారు.

# సేవాసేతు అభియాన్ సద్వినియోగం చేసుకోవాలి

## అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ప్రజా భూమి ప్రతినిధి అవనిగడ్డ సోలార్ విద్యుత్తు వినియోగం పెంచడమే లక్ష్యంగా సింగిల్ డెస్క్ విధానంలో ప్రభుత్వం చేపట్టిన సేవాసేతు అభియాన్ సద్వినియోగం చేసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. సోమవారం అవనిగడ్డలో ఎమ్మెల్యే తమ కార్యాల యం లో సేవాసేతు అభియాన్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ నెల 6,7,8 తేదీల్లో అవనిగడ్డ, నాగా యలంక, కోడూరు మండలాల విద్యుత్ వినియోగదారుల కోసం అవనిగడ్డ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో, చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల విద్యుత్ వినియోగదారుల కోసం చల్లపల్లిలోని చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో సేవాసేతు అభియాన్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారుల కోసం పీఎం సూర్య ఘర్ – సోలార్ విద్యుత్తు వినియోగంపై అవగాహన, దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేసే ఉద్దేశంతో ఈ వేదిక ద్వారా విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్య ఘర్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండి వినియోగదారులకు సహకరిస్తారని తెలిపారు. వీరి తో పాటు పలు బ్యాంకుల అధికారులు కూడా ఈ మూడు రోజులు సదస్సులో పాల్గొని వినియోగదారులకు అవసరమైన రుణ సదుపాయాలు కూడా కల్పిస్తారని తెలిపారు. సింగిల్ డెస్క్ విధానంలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందించే సబ్సిడీతో సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకొని తమ విద్యుత్తు ఖర్చులు తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చల్లపల్లి ఏడీఈ పేర్ని రవికుమార్, ఘంటసాల ఏఈ పిరియా రవికుమార్ పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీలది కీలక పాత్ర : విక్కుర్తి రాంబాబు



ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ చల్లపల్లి మండలం నడకు దురు గ్రామ పంచాయతీ శివారు నాదెళ్లవారిపాలెం గ్రామంలో సోమవారం అంగన్వాడీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రజా సేవలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న అంగన్వాడీ ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సోదరుడు విక్కుర్తి రాంబాబు హాజరయ్యారు. తొలుత గ్రామంలోని వనవలమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం విక్కుర్తి రాంబాబు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా అంగన్వాడీ కేంద్రాలు ప్రజలకు వివిధ సేవలను అందిస్తున్నాయని తెలిపారు. బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడంలో అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు.అనంతరం ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాళ్లను విక్కుర్తి రాంబాబు సందర్శించి, అక్కడ ప్రదర్శించిన పౌష్టికాహారం తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్థులు విక్కుర్తి రాంబాబును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన అంగన్వాడీ సిబ్బందిని సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, వివిధ హోదాల్లోని ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





# రాధా రంగా మిత్రమండలి మహిళా కమిటీ నియామకం

## రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు వెల్లడించారు




విజయవాడ, ప్రజాభూమి ప్రతినిధి : ఉమ్మడి కృష్ణాజిల్లా (ఎన్‌టీఆర్ జిల్లా) పశ్చిమ నియోజకవర్గంలో రాధా రంగా మిత్రమండలి మహిళా కమిటీ నియామక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాధా రంగా మిత్రమండలి ఆంధ్రప్రదేశ్–తెలంగాణ రాష్ట్రాల అధ్యక్షుడు, జనసేన పార్టీ నాయకుడు బుల్లెట్ ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరై నూతనంగా నియమితులైన 11 మంది మహిళా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజే శారు. కార్యక్రమానికి ముందు రంగా, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు నిర్వాహకులు, నాయకులు ఘ నం గా నివాళులర్పించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షురాలు ఆకారపు, విజయకుమారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బుల్లెట్ ధర్మారావును దృశ్యాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.నూతన కమిటీ అధ్యక్షురాలిగా ఆకారపు విజయకుమారి, ఉపాధ్యక్షురాలిగా ఇంజమూరి ఉష, ప్రధాన కార్యదర్శిగా జిల్లాపల్లి శిరీష, ట్రెజరర్‌గా నగరికంటి షాలోమి, జాయింట్ సెక్రటరీలుగా ఆకారపు భవాని, చాపలమడుగు నాగమణి, కందుకూరి రమణ, యర్రా లక్ష్మి, నాగరత్నమ్మ, ఉప్పర లక్ష్మి, యర్రా శిరోమణి నియమితులయ్యారు. అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ కమిటీని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా బుల్లెట్ ధర్మారావు మాట్లాడుతూ రంగా ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పేద ప్రజలకు అండగా నిలవాలని మహిళా కమిటీ సభ్యులకు పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్‌కు అండగా నిలిచి, ఆయన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.కార్యక్రమంలో కుంభ వెంకటేశ్వరరావు, మల్లాడి రాజేష్, పగిడిపల్లి రాజేశ్వరి, నారంశెట్టి కూర్మారావు, పేటేటి నాంచారయ్య, కరణం దివాకర్, గడ్డిగోపుల నరేష్, ఎరుపల్లి కనకరావు, చలపాక సురేష్, ఎల్ఐసీ రాంబాబు, మట్టా దత్తుడు, తోట బుజ్జి నాయుడు, వన్నెంరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.కుల, మతాలకు అతీతంగా రంగా అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# టీబీ డిపార్ట్మెంట్ కినూతన డి ఎం & హెచ్ ఓ

## మర్యాద కపూర్వకంగా కలిసిన టీబీ డిపార్ట్మెంట్ యూనియన్ నాయకులు




గుంటూరు సిటీ( ప్రజాభూమి ) సోమవారంనాడు సాయంత్రం నూతనంగా వచ్చిన డిఎం & హెచ్ ఓ డా.యమ్ పద్మావతి ని గుంటూరు జిల్లా టిబీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా యూనియన్ అధ్యక్షుడు కొలికపూడి రాంబాబు యూనియన్ సభ్యులు చాందిని, బషీర్ అహ్మద్, నాగజ్యోతి రాజశేఖర్, దమ్ము స్వరూప, కౌశిక్, రవికుమార్ తదితరులు పాల్గొని హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసినారు.

# సర్వజన వైద్యశాల పర్యవేక్షణ అధికారిగా డా. జి. పద్మశ్రీ



మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి: మచిలీపట్నం సర్వజన వైద్యశాల నూతన పర్యవేక్షణ అధికారిగా డా. జి. పద్మశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని అన్నారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అందుబాటు లో ఉన్న వసతులను మరింత మెరుగుపరచడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా కృషి చేస్తానన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి సిబ్బంది అందరూ సహకరించాలని డా. జి. పద్మశ్రీ కోరారు.

# పశ్చిమలో వైసిపి క్షేత్రస్థాయి పర్యటన షురూ

❖కూటమి పాలనలో ప్రజా సమస్యల తిరోగమనం:మాజీ మంత్రి వెలంపల్లి ❖స్థానిక పోరుకు సిద్ధం, ప్రజా సమస్యలపై యుద్ధం'లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ధ్వజం



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "స్థానిక పోరుకు సిద్ధం – ప్రజా సమస్యలపై యుద్ధం" కార్యక్రమాన్ని మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ వెలంపల్లి శ్రీనివాసరావు సోమవారం ఉదయం స్వాతి థియేటర్ వద్ద (పాత 40, నూతన 34వ డివిజన్) ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ముఖ్య నాయకులతో కలిసి డివిజన్ పరిధిలో పర్యటిస్తూ స్థానిక ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆంజనేయ రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. పర్యటన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనను తాను 'వాటర్ మ్యాన్' అని గొప్పలు చెప్పుకుంటున్నారే తప్ప, నగరంలో ప్రజలకు కనీసం తాగడానికి గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేకపోతున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు నీటి కొరత రాకూడదని వాటర్ ట్యాంకులు నిర్మించి సక్రమంగా నీటి సరఫరా చేశామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన నిర్వహణ (మెయింటెనెన్స్) లేకపోవడం, పైపుల లీకేజీలను పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నగరంలో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోయిందని, కనీసం మూడు రోజులకొకసారి కూడా చెత్త తీసుకెళ్లే నాథుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారని వెలంపల్లి తెలిపారు.



స్థానిక ఎమ్మెల్యే కార్పొరేట్ తరహాలో భారీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారే తప్ప, ఆ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న డ్రైన్లు మురుగుతో నిండిపోయి కనీస మెయింటెనెన్స్ లేక దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గతంలో తాము రోడ్లు, డ్రైనేజీలు, పార్కులను అభివృద్ధి చేసి అందిస్తే, ఇప్పుడున్న పాలకులు వాటి నిర్వహణను కూడా గాలికొదిలేశారని దుయ్యబట్టారు.విజయవాడ నగర ప్రజలు కడుతున్న పన్నుల సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం తన ఖజానాకు మళ్లించుకుంటూ నగరపాలక సంస్థను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతోందని ఆరోపించారు. గతంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో 010 ద్వారా ఉద్యోగులకు జీతా లు ఇస్తూ అభివృద్ధికి అండగా నిలిస్తే, నేడు ఆ భారాన్ని కార్పొరేషన్‌పై నెట్టడం దుర్మార్గమన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తేనే స్థానిక నిధులు స్థానికంగా ఖర్చవుతాయని, ప్రజల హక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా అర్హులైన వృద్ధులకు ఒక్క కొత్త పెన్షన్ కూడా మంజూరు చేయలేదని వెలంపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, గతంలో జగనన్న అందించిన చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలను నిలిపివేశారని ఆరోపించారు. పిల్లల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేశారని, పేదల సంజీవని అయిన 'ఆరోగ్యశ్రీ'ని పూర్తిగా నిర్వీర్యం చేసి ఆస్పత్రుల్లో వైద్యం అందకుండా చేశారని ధ్వజమెత్తారు. దీనివల్ల ప్రజలు సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌వోసీల కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.విజయవాడ నగరంతో కూడిన రాజధాని ఉంటేనే ప్రజలు అంగీకరిస్తారని, విజయవాడను నిర్లక్ష్యం చేసి అమరావతిని అభివృద్ధి చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమని వెలంపల్లి హెచ్చరించారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండి పోరాడుతుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్ స్థానాల్లో ఫ్యాన్ గుర్తు అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



# ప్రజాభూమి

## ఏలూరు, పశ్చిమగోదావరి

4

మంగళవారం 6 అక్టోబరు 2026


## రాట్నాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న రెడ్డి అప్పలనాయుడు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ రాట్నాలమ్మ అమ్మవారిని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోన్-2 చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు సోమవారం దర్శించుకున్నారు.అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనం పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో,శాంతి సౌభాగ్యాలతో జీవించాలని, రాట్నాలమ్మ అమ్మవారి దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.కూటమి ప్రభుత్వం సస్యశ్యామలంగా పాలించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రెడ్డి గౌరీశంకర్, దోసపర్తి రాజు, జనసేన రవి పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం కోసం రిలే నిరాహార దీక్షలు

**ఈ నెల 9 వరకు కొనసాగింపు.. ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: ఏలూరు బార్ అసోసియేషన్**




ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

రాష్ట్రంలో న్యాయవాదులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యం నశించాలంటూ న్యాయవాదులు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు మాట్లాడుతూ.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు.ఈ విషయంపై త్వరలోనే న్యాయశాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.ఈ నెల 9వ తేదీ వరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేసే వరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నిమ్మల జ్యోతి కుమార్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా న్యాయవాదులపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.ఈ దాడులను అరికట్టే విధంగా న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.రిలే నిరాహార దీక్షలో న్యాయవాదులు ఇ. వెంకటేశ్వరరావు, ఎం. కృష్ణారావు, పి.ఎ. విజయనంద్, కె. కృష్ణ కిషోర్ అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## వీఆర్ఏల జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎంపిక



ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.

ఏపీ వీఆర్ఏ ల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వీఆర్ఏ ల జాయింట్ యాక్షన్ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో జిల్లా అధ్యక్షులుగా తలారి జయరాజు ని ఎనుకున్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా బుడిపిటి రాంబాబు ,జిల్లా కార్యదర్శి గా ప్రేమ్ చంద్ ,జిల్లా ట్రెజరీ కింద సాకుపల్లి సాయి బాబు ని ఎన్నుకోవడం జరిగింది. ఏలూరు మండల పరిషత్తు కార్యా లయంలో రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగినది. పశ్చిమగోదావరి జిల్లా కమిటీ మరియు ఏలూరు జిల్లా విఆర్ఓ సంఘం అధ్యక్షులు అయిన సాయిల వెంకటేశ్వరావు, విఆర్ఓ నాయకులు నంబురీ జోషి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా వీఆర్ఏ జాయింట్ కమిటీ ప్రెసిడెంట్ సెక్రటరీ కోశాధికారి ఉపాధ్యక్షులు అందరు కూడా పాలుపంచుకొని ఈ ఎన్నికను నిర్వహించడం జరిగింది.

## ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా వైస్ ఛైర్మన్‌గా మానెం బసవరాజు




ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టివి మెకానిక్స్ యూనియన్ తృతీయ కార్యవర్గ సమావేశం విజయవాడ లోని ప్రెస్ క్లబ్ భవనమును నందు రాష్ట్ర అధ్యక్షులు నరసిహర రాజు అధ్యక్షతన సమావేశం జరిగినది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ అనుబంధ కుటుంబ సంక్షేమ ట్రస్ట్ బోర్డ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగాఎన్నుకోబడినవి. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గా ధర్మవరపు రవి విశాఖపట్నం, వైస్ ఛైర్మన్ గా మానెం బసవరాజు పాలకొల్లు, సెక్రటరీగా బహుద్దీన్ కడప మరియు తొమ్మిది మంది తో కార్యవర్గం ఏర్పాటు చేయడమైనది అని తెలియజేశారు. బసవరాజు మాట్లాడుతూ ఈ కుటుంబ సంక్షేమ పథకంలో సంఘ స్టేట్ ఐడి ఉన్న ప్రతి ఒక్కరు జాయిన్ అవ్వవచ్చునని జాయిన్ ఐన ప్రతి సభ్యునికి వారి అనంతరం నామినికి 50,000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని గత రెండు సంవత్సరాల నుండి ఈ పథకం కొనసాగుతుందని ఈ పథకం లో ఎక్కువ సంఖ్యలో జాయిన్ చేసి అందరికీ మంచి జరిగేలా కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పచ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు బండి దుర్గా ప్రసాద్, జమితార చంద్ర శేఖర్,చెరుకూరి దుర్గా ప్రసాద్, వి శ్రీనివాసరావు,బి నాగేశ్వరరావు, మరియు రాష్ట్ర అన్ని జిల్లాల నుండి అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు అని తెలియజేశారు.

## సిలిండర్లపై రూ.300 సబ్సిడీ

- సామాన్యులకు కేంద్రం మరో తీపికబురు.
- నేరుగా అకౌంట్లోకి.



ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదలకు గ్యాస్ సిలిండర్లపై రూ.300 సబ్సిడీని అందిస్తోన్న విషయం తెలిసిందే. 2016 మేలో ప్రధాని మోదీ పథకాన్ని ప్రారంభించగా ఇప్పటివరకు 10.57 కోట్ల మంది మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్ అందించారు. సాధారణ ఎల్పీజీ కనెక్షన్ తీసుకోవాలంటే సెక్యూరిటీ డిపాజిట్, సిలిండర్ కోసం ఇతర ఛార్జీలు వసూలు చేస్తారు. కేంద్రం ఉజ్వల్ యోజన పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ స్టవ్, సిలిండర్లు అందిస్తోంది. 2025-26లో 42 కోట్ల గ్యాస్ రీఫిల్స్‌కు సబ్సిడీ అందించారు. తాజాగా ఈ స్కీమ్‌పై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో కూడా రూ.300 సబ్సిడీ అందించనున్నట్లు ప్రకటించింది. దీంతో పేదలకు ఇది శుభవార్తగా చెప్పవచ్చు.

**5 కిలోల సిలిండర్లకు కూడా సబ్సిడీ**

5 కిలోల సిలిండర్లకు సంబంధించి దామాషా పద్దతిలో సబ్సిడీ అందించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కట్టెలు, బొగ్గు, పిడకల లాంటి వాటిపై పేదలు ఆధారపడకుండా మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఉచిత గ్యాస్ కనెక్షన్‌తో పాటు సిలిండర్లపై రూ.300 సబ్సిడీ అందిస్తోంది. 2016 మే1న యూపీలోని బలియాలో ఈ స్కీమ్ మోదీ స్వయంగా ప్రారంభించారు. 2020 మార్చి నాటికి 8 కోట్ల ఎల్పీజీ కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ఆ లక్ష్యానికి కేంద్రం చేరుకుంది. ఇక ఉజ్వల 2.0 కింద 1.6 కోట్ల కనెక్షన్లను అందించాలని నిర్ణయం తీసుకుంది. 2022 డిసెంబర్‌కు ఈ లక్ష్యం కూడా పూర్తి చేశారు. ఇప్పటివరకు ఈ స్కీమ్ ద్వారా 9.6 కోట్ల కనెక్షన్లను ఉచితంగా పేదలకు అందించారు.

**మరో 25 లక్షల కనెక్షన్ల మంజూరుకు ఆమోదం**

తాజాగా ఉజ్వల్ యోజన పథకం ద్వారా మరో 25 లక్షల కనెక్షన్లను అందించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ పథకంలోని లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్‌తో పాటు స్టవ్, సిలిండర్ అందిస్తున్నారు. తొలి సిలిండర్ ఉచితంగా ఇస్తుండగా.. ఆ తర్వాత ప్రతీ సిలిండర్ రీఫిల్లింగ్‌పై రూ.300 సబ్సిడీ అందిస్తోంది. ఉజ్వల్ యోజన వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ పథకంలో లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చు. మీకు అవసరమైన గ్యాస్ సరఫరా సంస్థను ఎంచుకోవచ్చు. రేషన్ కార్డు కలిగి ఉండాలి. అర్హులకు 18 ఏళ్లు నిండి ఉండాలి. ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు అందించాలి. ఇక డిస్ట్రిబ్యూటర్ వద్ద కూడా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటివరకు కోట్లాదిమంది కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు. రాబోయే రోజుల్లో మరింతమందికి ఈ ప్రయోజనాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో రానున్న రోజుల్లో లబ్ధిదారుల సంఖ్య పెరగనుందని చెప్పవచ్చు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి దీపక్ నెక్షన్ యండి అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం 32 లక్షల విరాళం



ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాలో ప్రతిష్ఠాత్మకంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం కింద చేపట్టిన స్మార్ట్ కిచెన్ కార్యక్రమానికి సామాజిక బాధ్యతలో భాగంగా దీపక్ నెక్షన్ యండి ఏ.వి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రూ 32 లక్షలు విరాళ చెక్కును జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు మరియు సంబంధిత వర్గాలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలకు కార్పొరేటు సంస్థలు తమ సి ఎస్ ఆర్ నిధులు ద్వారా సహకరించడం శుభపరిణామం అన్నారు. జిల్లాలో దెందులూరులో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం కింద స్మార్టు కిచెన్ కార్యక్రమం ద్వారా అవసరమైన మౌళిక సదుపాయాలను మరింత మెరుగుపరచడం, వంటశాలలు నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించడం జరుగుతుందని తెలిపారు. పరిశుభ్రతతో కూడిన వంటలు ప్రక్రియను ప్రోత్సహించడం, అలాగే నాణ్యమైన ఆహారాన్ని అందించేలా అవసరమైన సౌకర్యాలను అభివృద్ధి చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వనున్నామని తెలిపారు.స్మార్టు కిచెన్ వంటి ప్రజోపయోగ కార్యక్రమాలు అమలుకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రైవేటు సంస్థలు, పారిశ్రామిక వర్గాలు, దాతలు మరియు వివిధ సంస్థలు సి ఎస్ ఆర్ ద్వారా భాగస్వాములు కావడం వల్ల కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరుగుతాయని పేర్కొన్నారు. సమాజానికి తిరిగి సేవ చేయాలనే బాధ్యతతో దీపక్ నెక్స్ట్ జెన్ సంస్థ అందించిన రూ 32 లక్షలు సహకారం ఈ కార్యక్రమానికి మరింత ఊతమివ్వనుందని అన్నారు. ఈ సందర్భంగా సి ఎస్ ఆర్ నిధులను ప్రజోపయోగ కార్యక్రమాలకు అందిస్తూ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతున్న దీపక్ నెక్స్ట్ జెన్ సంస్థను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక ప్రయోజన కార్యక్రమాలకు కార్పొరేటు సంస్థలు సహకారం మరింత కొనసాగాలని, మరిన్ని కార్పొరేటటు సంస్థలు ముందుకు రావాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఇంచార్జి జిల్లా రెవిన్యూ అధికారి యం. ముక్కంటి, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టరు యల్.దేవకీదేవి, దీపక్ నెక్షన్ డైరెక్టరు శ్రీ చైతన్య , జిల్లా సిఎస్ఆర్ ఇంచార్జి, జిల్లా స్కిల్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యన్.జి తేంద్రబాబు, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంటు ఏడి వెంకటప్పయ్య, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పాన్ ఐఐటీ సదస్సులో ఎన్ఆర్ఐ క్వాంటమ్ ప్రాజెక్ట్ హవా

**ప్రపంచ విజేత త్రినేత్ర బృంద ప్రాజెక్టునకు ప్రముఖుల ప్రశంసలు**

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

విజయవాడలో శనివారం నిర్వహించిన పాన్ ఐఐటీ సదస్సులో డా. ఆర్.వి.ఆర్. ఎన్ఆర్ఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన ప్రదర్శన శాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల వాషింగ్టన్‌లో నిర్వహించిన వైజర్-వాంగార్డ్ పరిశ్రమ సవాలు-2026లో ప్రపంచ విజేతగా నిలిచిన ఎన్ఆర్ఐ విశ్వవిద్యాలయం గణాంక శాస్త్ర విభాగానికి చెందిన త్రినేత్ర బృందం రూపొందించిన 'క్వాంటమ్ వర్క్‌ఫోర్స్ ఆప్టిమైజేషన్' ప్రాజెక్టును ప్రదర్శించారు. ప్రాజెక్టును క్యూబిట్ ఫోర్స్ వ్యవస్థాపకుడు, భారతదేశంలో క్వాంటమ్ కంప్యూటర్ రూపకర్త డా. ఎల్. వెంకట సుబ్రహ్మణ్యం, అమరావతి క్వాంటమ్ వ్యాలీ ఎండీ సి.వి. శ్రీధర్, క్యూబిటెక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పృథ్వీ, ఐఐటీ మద్రాస్



సంచాలకుడు వి. కామకోటి, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు సందర్శించి అభినందించారు.

## డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకు కళా సేవ పురస్కారం అంద జేత



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

తాడేపల్లిగూడెంలోని బి.వి.ఆర్ కళా కేంద్రం నందు నెలవారి సంగీత నృత్య సాహితీ సాంస్కృతిక సమహారం కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది . ఈ కార్యక్రమంలో చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సమాజానికి చేస్తున్న విశేష సేవలను గుర్తించి ట్రస్ట ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ చవాకుల సూర్య నరేష్ బాబుకు కళా సేవ పురస్కారం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బి.వి.ఆర్ కళా క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు , లయన్ కుదుళ్ళ నారాయణరావు , కుమారి నురుకుర్తి యశస్వి, బిజెపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ మీడియా ప్రతినిధి నరిసే సోమేశ్వరావు , ఎంఈఓ కె.వి రామకృష్ణ , వంగా నరసింహారావు , గుండా రామకృష్ణ , చవాకుల సత్యనారాయణ మూర్తి , గూడాల హరిబాబు , తాళాబత్తుల వెంకటేశ్వరరావు , పెచ్చెట్టి ఫణి సింహ , రాయి సూరిబాబు , ధోని సత్యనారాయణ , తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు చెంతకు వెళ్ళి అర్జీలను స్వీకరించి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

ఏలూరు, జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ ( మీ కోసం) కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, ఇంచార్జి జిల్లా రెవిన్యూ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు యల్.దేవకీదేవి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్లు, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుపై ప్రత్యేక శ్రద్ద వహించాలని సూచించారు. ప్రజాసమస్యలు పరిష్కారంపై



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందని, అర్జీదారులు సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కారం చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న అంశాలుపై ప్రత్యేక దృష్టిని సారించి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో అధికారులు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకుండా పరిష్కార మార్గం చూపించాల్సిన బాధ్యత ఆయా శాఖలు అధికారులుపై ఉందని స్పష్టం చేశారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఎట్టి పరిస్థితుల్లో రీఓపెన్ కాకూడదని తెలిపారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి మీ శాఖ పరిధిలోనిది కానట్లయితే నిర్ణీత గడుపు ముగిసే వరకు వేచి ఉండకుండా, సంబంధిత శాఖకు వెంటనే పంపాలని ఆదేశించారు. కాలయాపన, నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు జిల్లా అధికారులు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, డివిజన్, మండల సర్వేయర్లు, జిల్లా కలెక్టరేటు సూపర్డెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఐతో ప్రపంచ మానవాళికి పొంచి వున్న పెను ముప్పు

- సత్వరమే మేలుకోకపోతే సర్వనాశనం తప్ప దంట్టున్న నిపుణులు
- అంతుచిక్కని చైనా, అమెరికా వ్యూహం
- ఇప్పటికే 25 శాతం యువత ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్న దుస్థితి





ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ) వ్యవస్థ రానున్న కాలంలో ప్రపంచ మానవాళికి పెనుముప్పుగా మారే ప్రమాదం ఉందని సాంకేతిక నిపుణులు, మేధావులు హెచ్చరిస్తున్నారు. మొదటి దశ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో సత్వరమే నిర్దిష్ట వ్యవధిలో లక్ష్యాలను పూర్తి చేస్తుంది.. రెండవ దశ ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్. ఈ దశలో లో మనిషిలా ఆలోచించడం, మనిషి చేయాలేని కొన్ని సమస్యలను చాక చక్యం గా పరిష్కరించడం జరుగుతుంది. ఇక మూడవ దశ ఆర్టిఫిషియల్ సూపర్ ఇంటెలిజెన్స్. ఈ దశలో సైన్సు,టెక్నాలజీ మానవుని మేధస్సుకు మించిపోయి ఉంటాయి. ఈ దశలో ఎ ఐ చేసే పనులు మానవుని మేధస్సు కంటే వెయ్యి రెట్లు స్పీడ్‌తో పనిచేస్తాయి. మనిషి చెప్పిన ఆదేశాలను కూడా లెక్కచేయని పరిస్థితి ఉండి ఎదురు తిరిగి పని చేసేలా ప్రవర్తించిన ఆశ్చర్యపడక్కలేదని అంటున్నారు. గూగుల్ కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ మాట్లాడుతూ రాబోయే ఐదు,ఆరు సంవత్సరాల్లో మనుషులు చేసే పనులన్నీ ఏఐ ద్వారా రోబోట్లు చేసేస్తాయని, ఒక మనుషులు చేయాలనుకునే పనులు ఒక ఆప్షన్ మాత్రమేనని ఇప్పటికే హెచ్చరించిన విషయం తెలిసిందే. అదే విధంగా ఇటీవల కాలంలో గూగుల్ కంపెనీ సైంటిస్ట్ ఏఐ రాబోయే కాలం లో మనుషుల్ని చంపేస్తుందని అందువల్ల ఈ కంపెనీలో చేయడం తనకి ఇష్టం లేదని రాజీనామా చేసిన విషయం కూడా తెలిసిందే.

**మానవాళి ప్రాణాలకు ముప్పు వాటిల్లేదిలా :**

ఏఐ సూపర్ ఇంటెలిజెన్స్ తో మానవాళి మనుగడకు ముప్పు తప్పదని సాంకేతిక ని పపును లు ఇప్పటికే హెచ్చరించి ఉన్నారు. రోబో సినిమాలో చూపిన మాదిరిగా ఏ ఐ సూపర్ ఇంటెలిజెన్స్ మేదస్సుతో మనుషులను తుదమెట్టంచవచ్చునని చెబుతున్నారు. అటువంటి పరిస్థితి వస్తే న్యూక్లియర్ బాంబులు, ఇప్పుడు సమకూరుస్తున్న మిషన్లు, యుద్ధ సామాగ్రి, వెపన్లు ఎందుకు పనికిరాని పరిస్థితి నెలకొంటుందని అంటున్నారు.

**ఉపాధి, ఉద్యోగాలు పోయే దిలా :**

కంప్యూటర్ సిస్టమ్స్ మేధస్సు ద్వారా లెక్కలు తయారు చేయడం, రోబోట్ల ద్వారా మనుషులు చేసే బరువు పనులు సైతం ఏ ఐ సూపర్ ఇంటెలిజెన్స్ రూపొందించడంతో ఇక మనుషులతో పనే ఉండదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే 25% యువతకు ఉపాధి లేకుండా పోయిందని, పనులు లేక ఖాళీగా ఉండాల్సి వస్తోందని అంటున్నారు. దీంతోపాటు ఏటా దేశవ్యాప్తంగా వచ్చే డాక్టర్లు, ఇంజనీర్లు, గ్రాడ్యుయేట్ లు లక్షలాదిమంది ఇప్పటికే ఖాళీగా ఉన్నప్పటికీ, ఇక రోబోట్లు సైన్యంలోనూ, డాక్టర్లు ఇంజనీర్లు, పనులు రంగంలోకి కూడా దింపితే ఇక మొత్తానికి ప్రజలందరికీ ఉపాధి కరువై, తిండి లేక, దేశం మొత్తం సంక్షోభంలో పడిపోతుందని నిపుణులు అంటున్నారు. ఇప్పటికే ఏ ఐ దెబ్బకు ఐటి కంపెనీలు లక్షలాది మంది సాఫ్ట్వేర్ ఇంజనీర్లను ఇంటికి పంపేశారు. ఇక సూపర్ ఏఐ వస్తే పరిస్థితి ఊహించుకోలేమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అమరావతిలో 60 రకాల మెడికల్ ల్యాబ్ టెస్టులు ఏఐతో నిర్వహించడం చూస్తుంటే ఎంతోమంది లక్షలాదిగా ఈ టెస్ట్ లు చేసి జీవితం కొనసాగించే వారి ఉద్యోగాలు పోయి పరిస్థితి దుర్భరంగా మారుతుందని అంటున్నారు. జపాన్లో కూడా ఇప్పటికే ఏఐ మిషన్ ద్వారా ఈ ల్యాబ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.. దీనివల్ల లక్షలాది కుటుంబాలు రోడ్డున పడతాయని అంటున్నారు.

**చైనా, అమెరికా దేశాలన్ని కట్టడి చేయాలి:**

ఒక వైపున చైనా దేశం ఏడాదికి 10, 000 రోబోట్లను తయారు చేసే ఓ ఫ్యాక్టరీని తయారు చేయడం చూస్తుంటే దేశాలకు ముప్పు తెచ్చే విధంగా సైన్యంలో చేరు స్తారా లేక స్వప్రయోజనాలకు ఉపయోగించుకుంటారనేది అంతు పట్టని పరిస్థితి నెలకొంది. ఇక తాజాగా చూస్తే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో అడుగు ముందుకేసి ఏకంగా సూపర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దశను మరింత అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తామని బహిరంగంగా ప్రకటించడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మానవాళికి ముప్పు తెచ్చే ఏఐ సూపర్ ఇంటెలిజెన్సీ విభాగాన్ని ఇంతటితోనైనా నిలుపుదల చేసేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాలని సైంటిస్టులు, మేధావులు కోరుతున్నారు.

ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

మంగళవారం 6 అక్టోబరు 2026

# కోట్లాది రూపాయలతో గ్రామాల అభివృద్ధి

- పల్లె పండుగలో భాగంగా ఆత్రేయపురంలో రూ.3.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.
- సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అంగన్వాడీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట**

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, కోట్లాది రూపాయల నిధులతో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం గ్రామంలో రూ.3.50 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలు నిర్లక్ష్యానికి గురై ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో గ్రామాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఆత్రేయపురం గ్రామంలో రూ.3.50 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా వీధుల్లో సీసీ రోడ్లు, పక్కా డ్రైనేజీ వ్యవస్థ, చిన్నారుల కోసం నూతన అంగన్వాడీ భవనం వంటి మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వ్యవసాయ రంగాలకు అవసరమైన వసతులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**రైతులకు వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి**

ఆత్రేయపురంలో కస్టమ్ హైరింగ్ సెంటర్



(సీహెచ్‌సీ) ద్వారా రైతులకు అందుబాటు ధరల్లో వ్యవసాయ యంత్ర పరికరాలను వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా ట్రాక్టర్‌తో పాటు పలు వ్యవసాయ పరికరాలను ప్రారంభించారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకుని సాగు ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. కొత్తపేట నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పిస్తున్నామని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), ఆకుల రామకృష్ణ, మార్కెట్ యార్డు చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు, కరుటూరి నరసింహారావు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కుసంపూడి రామకృష్ణరాజు, మాజీ సర్పంచ్ గెడ్డం సుధా, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

- ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.
- వాహనదారుల భద్రతే లక్ష్యంగా మరిన్ని చర్యలు: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

**ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట**

రావులపాలెం జంక్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌తో వాహనదారులకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు ప్రమాదాల నివారణకు అవకాశం ఏర్పడిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారితో కలిసి ఆయన సోమవారం ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చన్నారు. రావులపాలెం జంక్షన్‌లో



గతంలో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వాహనదారులు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నియంత్రణకు అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జంక్షన్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్న దుకాణాలు, భవనాలను తొలగించి రాకపోకలకు మార్గం సుగమం చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు అవసరాన్ని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సిఐ రమేష్ తన దృష్టికి తీసుకువచ్చారని, వారి సూచనల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు కృషి చేసిన పోలీసు అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. సిగ్నల్స్ ఏర్పాటుకు సహకరించి స్పాన్సర్ చేసిన అక్షరా థియేటర్స్ యజమాని తాడి నాగమోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాహనదారులంతా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని, వేగ నియంత్రణతో పాటు రహదారి భద్రతా నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. భవిష్యత్తులో రావులపాలెం పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సర్వీస్ రోడ్లు, డ్రైన్లు, డివైడర్లు ఏర్పాటు చేయడంతో పాటు సర్వీస్ రోడ్ల విస్తరణకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని బండారు సత్యానందరావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కొత్తపేట మార్కెట్ యార్డు చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు, ఆకుల రామకృష్ణ, కె.వి. సత్యనారాయణరెడ్డి, చిలువూరి సతీష్‌రాజు, పాలూరి సత్యానందం, మేడపాటి కాసురెడ్డి, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, తాడి నాగమోహన్ రెడ్డితో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో శోభనాపురం జడ్పీ విద్యార్థి సత్తా

**ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి**

ఏలూరు సి.ఆర్.రెడ్డి కళాశాలలో శనివారం నిర్వహించిన 36వ సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో శోభనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చిత్రోజు సాయి శంకర్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సాయి శంకర్‌ను మండల టీడీపీ అధ్యక్షుడు నక్కన బోయిన వేణు, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ దాసరి రామ్ ప్రసాద్, నలజాల హరిబాబు అభినందించారు. అలాగే కోచ్ ఎస్.కె. సుభానీ తిరువూరులో జరిగిన 13వ రాష్ట్రస్థాయి బరువులెత్తే క్రీడల పోటీల్లో ఛాతీ బరువులెత్తే విభాగంలో ద్వితీయ స్థానం సాధించి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా సుభానీని ప్రధానోపాధ్యాయురాలు యామినీ కృష్ణ ప్రియ, ఎంఈఓ–1 సత్యనారాయణ, ఎంఈఓ–2 కె. ఆనంద్‌కుమార్ అభినందించారు.

# అనకాపల్లి ఎస్‌బీ డీఎస్పీగా వి.బాబ్జీరావు

## జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ

**ప్రజా భూమి ప్రతినిధి–అనకాపల్లి**

అనకాపల్లి జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) నూతన డీఎస్పీగా వి.బాబ్జీరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్‌ను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 1995 ఎస్సై బ్యాచ్‌కు చెందిన వి.బాబ్జీరావు గతంలో సీఐడీ విభాగంలో సీఐగా విధులు నిర్వహిస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందారు. అనంతరం ప్రభుత్వం ఆయనను అనకాపల్లి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించింది. బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఎస్పీ తుహిన్ సిన్హాకు పూల మొక్కను అందజేశారు. గతంలో అనకాపల్లి ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన బాబ్జీరావు ప్రజలు, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.



శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలో అనుభవం కలిగిన ఆయన ఎస్‌బీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టడంపై పోలీసు అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో స్పెషల్ బ్రాంచ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, సంఘటనలకు సంబంధించి ముందస్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించి పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో ఎస్‌బీ విభాగం ముఖ్యమైన బాధ్యత నిర్వహిస్తుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంతో పాటు సమాచార నెట్‌వర్క్‌ను మరింత పటిష్ఠం చేసి, జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్‌బీ అధికారులను ఎస్పీ సూచించారు. నూతన బాధ్యతలు చేపట్టిన వి.బాబ్జీరావు తన అనుభవాన్ని ఉపయోగించి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ జిల్లా పోలీసు శాఖ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు, స్పెషల్ బ్రాంచ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

## కలెక్టర్: ఆర్.మహేష్ కుమార్

**ప్రజాభూమి ప్రతినిధి–అమలాపురం**

పీ.జీ.ఆర్.ఎస్. కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్ లో జరిగిన జిల్లా స్థాయి పీ.జీ.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్.. జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియ దేవీ, డీఆర్వో వి.సుబ్బారావు, ఎస్డీసీ డి.అచ్చుతాకుమారి, డీఆర్డీఏ పీడీ డి.రాంబాబు, డ్వామా పీడీ జీఎస్.రామ్ గోపాల్, సమగ్ర శిక్ష ఏపీడీ మమ్మి, జిల్లా స్వర్ణ గ్రామ వార్డు అధికారి వి.విజయలక్ష్మి తదితరులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరించారు. భూరికార్డు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, భూ ఆక్రమణలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పారిశుద్ధ్యం, మురికి కాలువలకు పుడికతీత, ఇంటిస్థలం, గృహం, పింఛను, సదరం సర్టిఫికెట్, రోడ్లు మంజురు వంటి అంశాలపై మొత్తం – 198 అర్జీలు అందాయి. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వివిధ శాఖల్లో నమోదైన ప్రజా సమస్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించి, సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ అర్జీలన్నిటిని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో కూడిన పరిష్కర నివేదికలు అర్జీదారులకు అందివ్వాలన్నారు. పరిష్కరించిన అర్జీల వివరాలను సక్రమంగా ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలి జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ ఫిర్యాదుల కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్, మీకోసం ఆన్ లైన్ పోర్టల్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని, అలాగే అర్జీల పరిష్కార పురోగతిని



నేరుగా తెలుసుకోవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల తమ సమస్యలపై తమ పరిధిలోని డివిజన్, మండల, స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయ స్థాయిలలో కూడా సమర్పించవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెం డెంట్‌లు ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విదేశీయుల బస వివరాలు 24 గంటల్లోగా డిజిటల్‌గా నమోదు చేయాలి

- నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా
- ఎస్పీ తుహిన్ సిన్హా

**ప్రజాభూమి ప్రతినిధి–అనకాపల్లి**

అనకాపల్లి జిల్లా పరిధిలో విద్య, వైద్యం, పర్యాటకం, వ్యాపారం, ఉపాధి తదితర కారణాలతో వచ్చే విదేశీయులకు వసతి కల్పించే యాజమాన్యాలు, వ్యక్తులు వారి రాక, నిష్క్రమణ వివరాలను తప్పనిసరిగా డిజిటల్ విధానంలో నమోదు చేయాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ నిబంధనల ప్రకారం హోటళ్లు, రిసార్టులు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లు, హోమ్‌స్టేలు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు, పేయింగ్ గెస్ట్ వసతులు, ప్రైవేట్ అద్దె ఇళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, మతపరమైన సంస్థలు తదితర అన్ని వసతి కేంద్రాలకు ఈ నిబంధనలు వర్తిస్తాయని ఎస్పీ స్పష్టం చేశారు. విదేశీయులు వసతికి చేరిన సమయం నుంచి 24 గంటల్లోగా Form-C ద్వారా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. వారు వసతి నుంచి వెళ్లే సమయంలో నిష్క్రమణ వివరాలను కూడా అప్‌డేట్ చేయాలని, అతిథుల రికార్డులను కనీసం ఒక సంవత్సరం పాటు భద్రపరచాలని తెలిపారు. విదేశీయులతో పాటు OCI కార్డుదారులు, నేపాల్, భూటాన్ దేశస్థులు బస చేసినా వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. వివరాలు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించిన వ్యక్తులు, ప్రైవేట్ లేదా వాణిజ్యేతర వసతుల నిర్వాహకులకు కనీసం రూ.50 వేల జరి



మానాతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు అవకాశం ఉందన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలు, హోటళ్లకు కనీసం రూ.లక్ష నుంచి జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. చెల్లుబాటు అయ్యే వీసా, పాస్‌పోర్ట్ లేకుండా విదేశీయులకు ఆశ్రయం కల్పించడం లేదా నకిలీ పత్రాలకు సహకరించడం వంటి చర్యలకు 2 నుంచి 7 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. విదేశీయులు భారత చట్టాలను గౌరవించాలని, వీసా గడువు ముగిసిన తర్వాత దేశంలో ఉండరాదని, సరైన అనుమతులు లేకుండా ఉద్యోగం లేదా వ్యాపారం చేయరాదని సూచించారు. అలాగే OCI కార్డుదారులకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. జాతీయ భద్రత దృష్ట్యా తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా నివసిస్తున్న విదేశీయులు ఎవరైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, డయల్ 112 లేదా జిల్లా పోలీస్ కార్యాలయానికి సమాచారం అందించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. Form-C నమోదు, ఇతర వివరాల కోసం అధికారిక FRRO పోర్టల్‌ను వినియోగించాలని సూచించారు.

## ముందస్తు పరీక్షలతో చిన్నారుల ఎదుగుదల సమస్యల గుర్తింపు



**ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి**

పోత వరపాడు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ పర్యవేక్షకురాలు గుర్రం రాగమయి ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్, పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగమయి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారుల ఎదుగుదలలో తలెత్తే సమస్యలను ముందుగానే గుర్తించేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులకు అవసరమైన పోషకాహారం అందించడంతో పాటు వారి ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల మహిళా అధ్యక్షురాలు అన్నే విజయరాణి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని లబ్ధిదారులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లింగవరపు వెంకటేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు అందిస్తున్న సేవలను అభినందించి సన్మానించారు.

## పేద బ్రాహ్మణుడికి కంటి వైద్యానికి రూ.17 వేల ఆర్థిక సహాయం



**ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు**

క్షీరా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సేవలందిస్తున్న పేద బ్రాహ్మణుడికి కంటి వైద్యం కోసం రూ.17 వేల ఆర్థిక సహాయం అందించారు. వనిత క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో చేపడుతున్న హెల్త్ డొనేషన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం దేవాలయ ప్రాంగణంలో ఈ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించారు. కంటి వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సదరు బ్రాహ్మణుడు వనిత క్లబ్ సభ్యులను సహాయం కోరగా, క్లబ్ సభ్యులు స్పందించి సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ విషయాన్ని గవర్నర్ పెనుమాక రామ్మోహన్ రావు గారి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన వైద్యానికి అవసరమైన మొత్తం రూ.17 వేల ఆర్థిక సహాయాన్ని అందించేందుకు దాతగా ముందుకు వచ్చారు. అవసరంలో ఉన్న వ్యక్తికి విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి వైద్య సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన గవర్నర్ పెనుమాక రామ్మోహన్ రావుకు వనిత క్లబ్ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ పెనుమాక రామ్మోహన్ రావు, వనిత క్లబ్ అధ్యక్షురాలు దేవరపు కాంచనమాల, కార్యదర్శి సిద్దిరెడ్డి శైలజారాణి, తోట గాయత్రి మరియు అసిస్టెంట్ గవర్నర్ జక్కంపూడి మదన్, రావూరి అప్పారావు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## కోటపాడులో సేవాసంకల్ప అభియాన్ కార్యక్రమం.



**ప్రజా భూమి ప్రతినిధి–చాట్రాయి.**

చాట్రాయి మండలంలోని కోటపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చాట్రాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్, బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఓ బిల్లనేని ఉదయ రాజేశ్వరరావు, బొట్టు రామచంద్రరావు టిడిపి నాయకులు, టిడిపి నాయకులు, మందలపు జగదీష్, ఎంపీహెచ్‌ఈఓ శ్రీధర్, హెచ్ వి సబిత , రాజశేఖర్ , హెచ్ పి ఎస్ ప్రకాష్, రత్న కుమారిల, ఏఎన్ఎం జయ ప్రభాకర్, ఎంపీహెచ్ఏఎం దార్ల సురేష్ బాబు, ఆశా వర్కర్స్, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువతకు నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉపాధి అవకాశాలు

**–ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా**

**ప్రజా భూమి ప్రతినిధి–ప్రత్తిపాడు (కాకినాడ)**



యువతలో నైపుణ్యాలను పెంపొందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో రూ.5.30 కోట్ల రాజ్యసభ నిధులతో నిర్మించనున్న స్కిల్స్–స్టార్టప్స్–భారత్ హబ్ భవన నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. స్కిల్ ఇండియా–నైపుణ్య భారత్, కుశల్ భారత్ కార్యక్రమాల ద్వారా యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించి, వారి భవిష్యత్తుకు మెరుగైన బాటలు వేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

## ఈదర పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయుల సన్మానం

**ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి**



ఈదర ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1980–81 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తమ జీవితాల్లో ఉపాధ్యాయులు నేర్పిన విద్య, క్రమశిక్షణే పునాదిగా నిలిచాయని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో బత్తుల సాంబిరెడ్డి, దొండపాటి ఎలీషా, రామిశెట్టి సూర్యప్రకాశరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. జహీరుద్దీన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6
మంగళవారం 06 అక్టోబరు 2026

## పీజీఆర్ఎస్ దరఖాస్తులను నాణ్యతతో, పరిష్కరించాలి

**పీజీఆర్ఎస్‌కు 473 అర్జీదారులు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించే ప్రతి దరఖాస్తును అత్యంత నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవన్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, కిరణ్మయి, వెంకట నారాయణ, రమేష్ రెడ్డి ఆయా శాఖల జిల్లా అధికారులు, అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార నివేదిక కార్యక్రమం నిర్వహిస్తుందని ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాల పరిమితిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రతి దరఖాస్తును నిశితంగా పరిశీలించి, పారదర్శకతతో, అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జిలపై నిర్లక్ష్యం చేయకుండా బాధితుల ఆర్జీలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 278 రెవెన్యూ, 195 సాధారణ అర్జీలు మొత్తం 473 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలన్నింటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## నేడు పప్పు సెనగ విత్తన రిజిస్ట్రేషన్, పంపిణీ

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరుమండలంలో రబీ! సీజన్ కు సంబంధించి 35శాతం సబ్సిడీపై పప్పుశనగ విత్తన రిజిస్ట్రేషన్, పంపిణీ ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించబడుతుందని ఏపీఓ కాత్యాయని తెలిపారు. వప్పుశనగ విత్తనం క్వింటాలు పూర్తి ధర రూ.9 వేలు కాగా సబ్సిడీ రూ.3150పోను రైతు చెల్లించాల్సిన వాటాగా రూ.5850 నిర్ధారించినట్లు తెలియజేయడమైనది. పుట్లూరు మండలానికి 5800 క్వింటాళ్ల పప్పుశనగ విత్తనాలను కేటాయించడం జరిగిందని ఆమె తెలిపారు. విత్తనం కొవాల్సిన రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, ఫోన్‌ను తప్పనిసరిగా తీసుకురావాలని, రైతుసేవా కేంద్రాల వద్ద పప్పుశనగ పంపిణీ చేస్తారని తెలియజేయడమైనది .

## జిల్లా పోలీస్ కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం



అనంతపురం డీఎస్పీ కరుణాకర్ రావు, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసరావు, ఆధ్వర్యంలో 90 వినతుల స్వీకరణ జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు సోమవారం అనంతపురం లోని జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ప్రజల ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసరావు, అనంతపురం డీఎస్పీ కరుణాకర్ రావులు పాల్గొని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 90 పిటీషన్లు నమోదయ్యాయి. ఇందులో కుటుంబ తగాదాలు, సివిల్ వివాదాలు, ఆర్థిక మోసాలు మరియు సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రధానంగా ఉన్నాయి. ?ఈ సందర్భంగా డీఎస్పీలు మాట్లాడుతూ ఎస్పీ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల సమస్యలకు వేగవంతమైన, పారదర్శకమైన పరిష్కారం చూపడమే లక్ష్యంగా పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అందిన ప్రతి వినతిపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. అర్జీలపై వెంటనే స్పందించి, నిర్ణీత గడువులోగా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఇస్కాన్ సంస్థ సహకారంతో విచ్చేసిన పిటీషనర్లు, వారి సహాయకులకు ఉచితంగా భోజనం ఏర్పాటు చేయించారు.

## గడ్డంనాగేపల్లి దుర్గమ్మ గుడికి బంగారు తాళిబొట్టు అందజేత

ప్రజా భూమి నార్పల



మండలంలోని గడ్డంనాగేపల్లి గ్రామం లోని దుర్గమ్మ గుడికి మోరి రెడ్డి హెచ్‌ఎం భక్తిశ్రద్ధలతో 600 మిల్లీగ్రాముల బంగారు తాళిబొట్టును అందజేశారు. అమ్మవారికి బంగారు తాళిబొట్టుతో పాటు చీరను కూడా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో దుర్గమ్మ తల్లి ఆలయానికి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోరి రెడ్డి హెచ్‌ఎంను ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యరగొర్ల నాగన్న, గుడి పూజారి హనుమంతులు, సత్యమూర్తి, శివయ్య, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్లూరు మండల కేంద్రములో వరుణ యాగం నిర్వహించాలి

### దేవాదాయ శాఖకు విజ్ఞపి చేసిన అనంతపురం జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యుడు రాగేని రామంజి యాదవ్

ప్రజాభూమి, పుట్లూరు.



పుట్లూరు మండలం కేంద్రంలో వరణ యాగం దేవాదాయ శాఖ అధికారులు నిర్వహించాలని అనంతపురం బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాగేని రామం జి యాదవ్ విజ్ఞప్తి చేశారు, ఎల్ నినో ప్రభావం వర్షాలు కురవపోవడంతో పంటలు సాగు చేయడానికి నీరు, విత్తనాలు వేయుడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారు అదేవిధంగా తాగడానికి కూడా ప్రజలకు ఇబ్బందికరమే, ఈ పరిస్థితుల్లో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి మరియు మండల ప్రజలు అందురు సుఖ సంతోషాలతో పాటు సంక్షేమంగా ఉండాలని ,పుట్లూరు మండలంలో దేవాదాయ శాఖ అధికారులు చొరవ తీసుకుని స్థానిక దేవాలయంలో వరణ యాగం నిర్వహించాలి అని అనంతపురం బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాగేని రామం జి యాదవ్ కోరడమైనది. వర్షాలు కురిస్తే రైతులు శనగ పంట వేసుకోవడం జరుగుతుందని, వర్షాలు పడటం వలన భూగర్భ జలాలు పెరగడంతో బోరుబావిలో నీరు వస్తుంది కావున దేవాదాయ శాఖ అధికారులు తప్పకుండా వరుణ యాగం జరిపించాలని ఆయన కోరారు.

# పేరు రైతులది ఫలితం ప్రైవేటుది, ఇదే బాబు మార్క్ వ్యవసాయం!

### ఉద్యాన హబ్బు, రిలయన్స్ కు డబ్బు! కొండను త్రవ్వి ఎలుకను పట్టడమే! - ప్రజాధనం పచ్చ గద్దల పాలు!

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం




వై విశ్వేశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే, వైయస్‌ఆర్సీపీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్చార్జి మాట్లాడుతూ పూర్వం ఒకడు పది జెసిబిలు, చుట్టూ 100 మంది భద్రతా సిబ్బందిని పెట్టి గుంత తవ్వుతుంటే ప్రజలందరూ ఆశ్చర్యంగా ఏమి జరుగుతున్నదని అడిగితే ఎలుకను పడుతున్నాను అన్నాడట. ప్రపంచ ఉద్యాన కేంద్రం పేరుతో చంద్రబాబు నాయుడు చేస్తున్న హడావుడి కూడా అలాంటిదే. రాయలసీమ ప్రజలు ఉద్యాన పంటలు చూడనట్లు, వాటిని గురించి ఏమీ తెలియనట్లు, ఈ రోజే కొత్తగా ఉద్యాన పంటలను కనుగొని ప్రారంభిస్తున్నట్లుగా చంద్రబాబు బిల్డప్పులు ఇస్తూ, రాయలసీమ వ్యాప్తంగా బస్సులను దారి మళ్లించి ప్రయాణికులకు ఇబ్బంది పెట్టి, ప్రజలను మదనపల్లి జిల్లా బికేపల్లికి తరలించి హంగామా చేశాడు. ఇంతకీ ఈ హబ్ ఏమిటి? ఎందుకు? అని ఆరా తీస్తే ఈ హబ్బు ను గంపగుత్తగా రిలయన్స్ సంస్థకు కట్టబెట్టి డబ్బుగా మార్చుకోవడానికే నని ఈ ప్రాజెక్టు ప్రారంభ సభలో వక్తల ప్రసంగాలను బట్టి తెలుస్తున్నది. ఈ సందర్భంగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్ బి) తరహాలోనే మదనపల్లిలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఎ)ను మదనపల్లిలో 100 ఎకరాలలో నిర్మించి, దాని నిర్వహణ బాధ్యతలను రిలయన్స్ సంస్థకు అప్పగించి, దాని ద్వారా డిజిటల్ అగ్రికల్చర్, ప్రెసిషన్ ఫార్మింగ్, క్రాప్ మానిటరింగ్, స్మార్ట్ ఇరిగేషన్, మార్కెట్ ఇంటెలిజెన్స్, వంటి ఆధునిక పద్ధతులు, రైతులకు సాంకేతిక సలహాలు, మార్గదర్శకత్వం చేస్తారట. ఈ స్కూల్లో చేరే వారి అర్హతలు, వారి ఆర్థిక పరిస్థితులు ఎంత ఉన్నతంగా ఉండాలో హైదరాబాదులో ఉన్న ఐ ఎస్ బి ని గురించి తెలిసిన వారికి అర్థమవుతుంది. ఇందులో సాధారణ రైతు బిడ్డలు చేరడానికి లేదు. ఈ ప్రాజెక్టులో ప్రభుత్వం చెబుతున్నది పది జిల్లాలు, 33 మండలాలు, 5869 గ్రామాలు, అదనంగా 6 లక్షల హెక్టార్ల ఉద్యాన సాగు, 9.60లక్షల మంది రైతులకు లబ్ధి. ఇందులో ఉద్యాన పంట ఉత్పత్తి, కోత, గ్రేడింగు, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్ సెంటర్లు, ప్రాసెసింగ్ సెంటర్లు, బ్రాండింగ్. వీటికి ప్రాజెక్టు నిధులలో 90 శాతం నిధులు మిగిలిన 10 శాతం నిధులు మాత్రమే ఉద్యానానికి ఖర్చు చేస్తారు. 2026-27 లో 12.066 కోట్లు,72 క్లస్టర్లు. 2027-28 లో 15,036 కోట్లు, 67 క్లస్టర్లు. 2028-29 13,250 కోట్లు 62 క్లస్టర్లలో ఖర్చు చేస్తారు. ఇప్పటికే ఈ పది జిల్లాలలో ఉన్న ఉద్యాన పంటల విస్తీర్ణం 20.77 లక్షల ఎకరాలు, 22 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతున్నది. ఈ ప్రాజెక్టు ద్వారా 9 లక్షల ఎకరాలలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతారట, అంటే ఇప్పుడు రాయలసీమలో ఉన్న ఉద్యాన పంటలకే సూక్ష్మ సేద్యం ప్రకారం సాగు నీటి అవసరం సుమారు 40 టీఎంసీలు. ఈ ప్రాజెక్టుకు అదనంగా మరో 15 టిఎంసిలు అవసరం మొత్తంగా రాయలసీమ ఉద్యాన హబ్ కు 55టీయంసీల నీరు అవసరం. నేటి రాయలసీమ సాగునీటి పరిస్థితి తెలియనిది కాదు. భూగర్భ జలాలు వంద మీటర్ల లోతుకు వెళ్లిపోయాయని ఒకవైపు ప్రభుత్వమే చెబుతున్నది. ఫలితంగా రాయలసీమలో ఇప్పుడున్న ఉద్యానవలాలే ఎండిపోతున్నాయి. కొంతమంది బలవంతంగా తొలగించుకుంటున్నారు.

ఒకవేళ భూగర్భ జనాలు ఉన్నాయి, అనుకున్నా, ఈ మొత్తం ప్రాజెక్టుకి 25 టీఎంసీలు భూగర్భ జలాలు వినియోగించుకున్నా మనుకుంటే. మిగిలిన 30 టిఎంసిల నీళ్లు ఎక్కడ నుండి తెస్తారు? అంటే తిరిగి ఈ ఉద్యాన హబ్ నీళ్లు లేని హబ్బుగా మారుతుంది. ఉదాహరణకు అనంతపురం జిల్లాను తీసుకుంటే జిల్లాలో 32 మండలాలు 338 రైతు సేవా కేంద్రాలు 41 క్లస్టర్లు, 38,845 మంది రైతులకు మూడు సంవత్సరములలో 2,252.31 కోట్లు 89,039 వేల హెక్టార్లు అంటే 2,22,597.50 లక్షల ఎకరాలకు పెంచడానికి 369.94 కోట్లు ఖర్చు చేస్తారు. దీనితో పాటు మిగిలిన వసతుల కోసం ప్రతి సంవత్సరం మొత్తంగా 750 కోట్లు ఖర్చు చేస్తారు. పంట కోత అనంతరం నిర్వహణ ఖర్చులు యాంత్రీకరణ 57 కోట్లు, క్లీన్ ప్లాంటింగ్ మెటీరియల్, నర్సరీ సర్టిఫికేషన్ 11.63 కోట్లు హోల్సేల్ మార్కెట్లు రిటైల్ ఔట్లెట్లతో సహా మౌలిక సదుపాయాలు 51.20 కోట్లు, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు 1.56 కోట్లు ఉధ్యాన శాఖలో సాంకేతిక విజ్ఞానం క్షేత్రస్థాయి ప్రదర్శనకు 101.07 కోట్లు ఆధునిక పద్ధతులు రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి 41 కోట్లు అవగాహన కార్యక్రమాలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కు 10.25 కోట్లు, మొత్తంగా 273.71 కోట్లు అంటే జిల్లాలో మౌలిక సదుపాయాలకు 273.71 కోట్లు,విస్తీర్ణం పెంచడానికి 369. 94 కోట్లు మొత్తం 643.65 కోట్లు ఖర్చు చేస్తారు. ఇది మాత్రమే క్షేత్రస్థాయిలో ఉద్యానవనాలకు ఖర్చు పెడతారు. మిగిలిన 160 8.66 కోట్లు మధ్యవర్తులు, ప్రైవేట్ సంస్థలకే కట్టబెడతారు. ఇకపోతే ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే ఉన్న ఉద్యాన పంటలకే నీళ్లు లేక ఎండిపోవడం వల్ల రైతుల తీవ్రంగా నష్టపోతున్నారు. గత 30 సంవత్సరముల క్రితమే కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యల్ప వర్షపాతం కలిగి, కేవలం మెట్ట సేద్యంపై ఆధారపడి రైతుల ఆత్మహత్యలు, కూలీల వలసలు విపరీతంగా ఉండి, ఎడారిగా మారుతున్న అనంతపురం జిల్లాను ఆదుకోవడంలో భాగంగా దేశంలోనే పేరెన్నికగన్న అగ్రికల్చర్ సైంటిస్ట్ అయ్యప్పన్ నాయకత్వంలో కమిటీ ఏర్పాటు చేసి, అనంతపురం జిల్లాలో అణువణువు శోధించి, రైతులు, కూలీలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కూలంకషంగా చర్చించి ప్రాజెక్టు అనంతను రూపొందించారు. తరువాత వచ్చిన ప్రభుత్వాలు దానిని అటకెక్కించాయి. అనంతపురం జిల్లా వర్షపాతం 530 మిల్లీమీటర్లు మాత్రమే. ఇక్కడ సాగునీటి వనరులు ఒకటి తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ ఎల్ సి) దీని కింద ఉన్న సాగు విస్తీర్ణం రెండు లక్షల పదివేల ఎకరాల దీనికి నీరు చాలక రైతులు ప్రతి సంవత్సరం బీల్లు పెడుతున్నారు. రెండవది హంద్రీ-నీవా దీని కింద మూడు లక్షల ఇరవై ఆరువేల ఎకరాల సాగు, సుమారు 20 లక్షల మందికి తాగు నీరు. కృష్ణ వరద కాలౌ 40 రోజులు, రోజుకు ఒక టీఎంసీ నీరు మల్యాల దగ్గర పంపిణీ చేస్తే తప్ప 40 రోజుల్లో 40 టీం తెచ్చుకోలేని పరిస్థితి. ప్రస్తుతం కాలువ సామర్థ్యం నాలుగు రోజులకు ఒక టీఎంసీ మాత్రమే వస్తాయి. అంటే 40 రోజుల్లో అది టీఎంసీలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో పది టీఎంసీలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఒకవేళ 40 టీఎంసీలు వచ్చినా దాని కింద ఉన్న సాగు, త్రాగడానికి సగానికి కూడా సరిపోవు. ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో అదనంగా నీరు తెచ్చుకోకుండా ఏ విధంగా ఈ ఉద్యాన హబ్బును కాపాడుతారు. ప్రస్తుతం ఉన్న ఉద్యాన పంటలకే గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపై పారేస్తున్న సందర్భంలో కొత్తగా విస్తీర్ణం పెంచడం వల్ల వచ్చే అదన పంటకు గిట్టుబాటు ధర ప్రభుత్వమే కల్పిస్తుందని హామీ ఈ ప్రాజెక్టులో ఎక్కడా లేదు. రైతులు నష్టపోకుండా పంటల సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెస్తామని ఈ ప్రాజెక్టులో చెప్పి ఉన్నారు అలాంటి పరిజ్ఞానమే అందుబాటులో ఉంటే నేడు జిల్లాలో విస్తృతంగా ఉన్న ఉద్యాన వనాలను రైతులు తొలగించు కుంటుంటే ప్రభుత్వం చూస్తూ ఎందుకు ఊరుకున్నది? పోనీ ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఏమైనా ఇస్తుందా అని ఎదురు చూస్తే, నిర్మలా సీతారామన్ మాటల ప్రకారం, ఇందులో ప్రభుత్వ వాటా ఏదైతే 40 వేల కోట్లు ఉందో అది ప్రపంచ బ్యాంకు నుంచి అప్పు ఇప్పిస్తామని చావు కబురు చల్లగా చెప్పారు. అంటే మరో 40,000 కోట్లు ఈ రాష్ట్ర ప్రజల మీద భారం వేయబోతున్నారు. ఈ భారాన్ని వడ్డీతో సహా రాష్ట్ర ప్రజలందరూ భరించాలి, లాభాలు, లంచాలు మాత్రం ప్రభుత్వ పెద్దలకు చెందాలి. కావున ఈ కార్యక్రమానికి సంబంధించి లోటుపాట్లను, క్లస్టర్ వారిగా రైతులు, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలతో చర్చలు జరిపి, ముందుకు పోవాలి, లేకుంటే ప్రజాధనం పచ్చ గద్దలపాలే. కరువు పై ప్రభుత్వం నిర్లక్ష్యం! ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని ముందుగా తెలిసినా ఈ ప్రభుత్వం మొద్దు నిద్రపోతూ, ఇప్పటివరకు ఎలాంటి కరువు సహాయక చర్యలు చేపట్టకపోవడం వల్ల రైతులు, కూలీలు గ్రామాలు వదిలిపెట్టి వలసలు వెళ్ళిపోతున్నారు. నీటి నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల తాగడానికి నీళ్ల లేని దుస్థితిని తీసుకొచ్చి పెట్టారు. ఇది ఒక రకంగా కృత్రిమ నీటి కరువు అనే చెప్పాలి. ఈ కష్టకాలంలో నల్లరేగడి భూములలో రైతులు పప్పు సెనగ వేయడం కోసం విత్తనం నూరు శాతం సబ్సిడీతో సరఫరా చేయాల్సింది పోయి కేవలం 34 శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పి అది కూడా ఇంతవరకు ఇవ్వకపోవడం, పండ్ల తోటలు ఎండిపోతున్న సందర్భంగా వాటిని బతికించుకోవడానికి నీళ్ల ట్యాంకర్లకు రైతులు వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారు, కనీసం ఆ ఖర్చును అయినా భరిస్తామని హామీ ఇవ్వడం లేదు. కూలీలు వలసలు పోకుండా వి బి జి రామ్ జి ద్వారా పనులను కల్పించాలి. పశువులకు మేత లేక కబేలాలకు అమ్మేస్తున్నారు, గతంలో ఇవ్వాల్సిన ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇంతవరకు ఇవ్వలేదు, రైతు భరోసా కింద సంవత్సరానికి 20,000 ఇస్తామని చెప్పి రెండు సంవత్సరములు ఎగ్గొట్టారు. గతంలో వైసిపి ప్రభుత్వం చెల్లించిన క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం భారాన్ని కూడా రైతులపై మోపారు. కావున వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టి రైతుల ఆత్మహత్యలు, వలసలను ఆపి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.వి రమణ, రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి, తరిమెల గోకుల్ రెడ్డి వైఎస్ ఆర్ సి పి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మధుసూదన్ రెడ్డి వైఎస్‌ఆర్సిపి రైతు సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అలంకరాయునిపేటలో ఎంపీ అంబికా నిధులతో బస్ షెల్టర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం





అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం లోని అలంకరాయునిపేటలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అమితా లక్ష్మీనారాయణ పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ దళవాయి రమా దేవి, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎడిసిసి చైర్మన్ కేశవరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సింగనమల నియోజకవర్గ అభివృద్ధికి నిధులతో పాటు ప్రభుత్వ సహకారంతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. బాలికల గురుకుల పాఠశాలలో రూ.5 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో పాటు, గూగూడు ప్రాంతంలో భక్తులు, ప్రజలకు ఉపయోగపడేలా ప్రత్యేక వాటర్ ప్లాంట్‌ను నిర్మించాం. అలాగే గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నా వంతు కృషి చేస్తున్నాను. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్వగ్రామమైన అలంకరాయునిపేటలో ఎంపీ అంబికా నిధులతో బస్ షెల్టర్, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. అనంతపురం జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా మదనపల్లిలో హార్టికల్చర్ హబ్, ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు కృషి చేయడం, పుట్టపర్తిలో జెట్ విమానాల తయారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం, తాడిపత్రి నుంచి లక్ష టన్నుల అరటిని ఇతర గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేసే దిశగా అవకాశాలను కల్పించడం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నాం. కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధిని క్షేత్రస్థాయిలో చేసి చూపిస్తోంది. అనంతపురం జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమన్వయంతో మరింత బాధ్యతగా పనిచేస్తాం.

## పిడుగు పడి విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి

ప్రజాభూమి, పుట్లూరు.



సోమవారం సాయంత్రం సమయంలో, పుట్లూరు మండల పరిధిలోని గాండ్లపాడు గ్రామ శివారులో వర్షం కురుస్తున్న సమయంలో, కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న చరణ్, వయస్సు 35 సంవత్సరాలు, ఎస్సీ మాల తన సమీప బంధువు దేవనందుతో కలిసి తాడిపత్రి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వర్షం అధికంగా పడటంతో వాహనాన్ని నిలిపి చెట్టు కిందకు వెళ్లారు. ఈ సమయంలో అకస్మాత్తుగా పిడుగు పడగా, చరణ్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్ పేలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడు 2019 సంవత్సరం నుండి కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈరోజు విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. మృతుడికి వివాహం జరిగింది. ఇంకా సంతానం లేదు.

## అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని శాంతినగర్ అంగనవాడి కేంద్రంలో అంగన్వాడి కార్యకర్త తాసిన్ అధ్వరంలో సోమవారం పోషణ మాసో త్సవం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పోషణ మాసోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యురాలు ఈ.భాగ్యలక్ష్మి గౌడ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత కోసం పోషకాహారాన్ని అందిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు మానసికంగా, శారీరకంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఏఎన్ఎం, ఆశ వర్కర్ల సేవలు అమూల్యమని పేర్కొన్నారు. అంగన్వాడి కార్యకర్త తాసిన్, ఏఎన్ఎం సౌభాగ్య, ఆశ వర్కర్ జలజ, అంగన్వాడి సహాయకురాలు నాగమణి తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులురాలికి ఘన సన్మానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణానికి చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు పమిడి కాలువ శ్రీవాణికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించింది. ఈ సందర్భంగా సోమవారం హిందూపురం కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ పూలతోట శివకుమార్, సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల ఐక్యవేదిక సభ్యులు దయానంద్ , విశ్రాంతి ఏఎస్ఐ నారాయణ, విశ్రాంతి ఎస్ఐ లోకేష్, మల్లేష్, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, నాగార్జున, ఎల్. వీరన్న, ఎస్.ఆర్ విజయలక్ష్మి, రినొల్డ్ పాఠశాల కరస్పాండెంట్ ముస్తఫా, రామలక్ష్మమ్మ, రమాదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## దళిత కాలనీల సమస్యలు పరిష్కరించాలి

**తహసీల్దార్‌కు ఎస్సీ సెల్ నాయకుల వినతి**

ప్రజా భూమి నార్పల



మండలంలోని దళిత కాలనీల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ప్రభుదాస్ కోరారు. ఈ మేరకు సోమవారం మండల తహసీల్దార్ అరుణకుమారికి ఎస్సీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.సిద్ధరాచర్ల గ్రామంలోని దళిత కాలనీలో వీధిలైట్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్డీటీ పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభం కిందికి జారిపోవడంతో విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయని, పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. తక్షణమే ఆ విద్యుత్ స్తంభాన్ని మార్చాలని కోరారు.అదేవిధంగా నార్పల మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో గత మూడు నెలలుగా వీధిలైట్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుదాస్ తెలిపారు. రాత్రి వేళల్లో విషపురుగులు సంచరిస్తుండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి వీధిలైట్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మీనుగు రామాంజనేయులు, మండల ఎస్సీ సెల్ నాయకులు వేదాంతం మోహన్, కడపల జయకృష్ణ, బూసి రామాంజనేయులు, పేట పెద్దిరాజులు, మీసాల రామకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
మంగళవారం 06 అక్టోబరు 2026

# గ్రామీణ ఆరోగ్యానికి కేంద్ర పథకాలే కొండంత అండ

## -: కే.ఎన్.కొట్టాలలో వైభవంగా అంగన్‌వాడీ ఉత్సవాలు

ప్రజాభూమి పోరుమామిళ్ల :
కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అండతోనే దేశంలో ఆరోగ్యవంతమైన, పటిష్టమైన 'సుపోషిత భారత్' నిర్మాణం సాధ్యమవుతుందని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రజా ప్రస్థానం, సంస్కరణల సుపరిపాలనను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' లో భాగంగా బుధవారం కాశినాయన మండలం కే.ఎన్.కొట్టాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. బీజేపీ కాశినాయన మండల అధ్యక్షుడు బిజీవేముల నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎదురు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా సాగింది. మహిళా శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో జరిగిన అంగన్వాడి ఉత్సవాల వేడుకలకు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్టి శ్రీనివాసులు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంగన్‌వాడీ ఉత్సవాల బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుసిరెడ్డి మనోహర్ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్లు చంద్రకళ ,హరిప్రియ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని వారు అధికారికంగా ప్రారంభించారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల, బాలల సంక్షేమానికి, వారి ఆరోగ్య సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడటంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమైనదని వారు కొనియాడారు. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని మరియు సంక్షేమ పథకాలను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.

**ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన- సదస్సు:**
అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పౌష్టికాహార ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న నాణ్యమైన గుడ్లు, పాలు, బాలామృతం కిట్లు, చిరుధాన్యాల (మిల్లెట్స్) విశిష్టతను అధికారులు, నేతలు లబ్ధిదారులకు క్షుణ్ణంగా వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు రక్తహీనత (ఎనీమియా) బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులకు సకాలంలో వ్యాక్సినేషన్ (టీకాలు) వేయించాల్సిన ఆవశ్యకతను తల్లులకు గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'పోషణ్ అభియాన్', 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' వంటి పథకాలు గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తున్నాయని నేతలు కొనియాడారు. అనంతరం సమాజం కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆశా కార్యకర్తలను నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధీర్, బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎదురు నాగార్జున రెడ్డి, బిజెపి మండల ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, బిజెపి మండల కార్యదర్శులు ప్రతాప్ రెడ్డి, కొక్కంటి పవన్, ఎదురు చెన్నారెడ్డి, గర్భిణీలు బాలింతలు అంగన్వాడీ టీచర్లు ఆయాలు ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం

## - మర్యాదపూర్వకంగా కలిసిన జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్

ప్రజాభూమి, వేంపల్లె



రాష్ట్రవ్యాప్తంగా రూ.30,156 కోట్ల విలువైన జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు కడప జిల్లా ప్రొద్దుటూరుకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (డిప్యూటీ సీఎం), జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్‌కు పులివెందుల నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్ ఘన స్వాగతం పలికారు. ప్రొద్దుటూరులో పవన్ కళ్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న జల్ జీవన్ మిషన్--అమరజీవి జలధార ప్రాజెక్టులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఈ ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు జనసేన పార్టీ శ్రేణులు పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు.

# ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలకు 13 వరకు గడువు

## - బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎల్ఐబీ కోర్సుల్లో ప్రవేశాలు

ప్రజాభూమి, వేంపల్లె
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 13వ తేదీ వరకు గడువు ఉందని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ, కోఆర్డినేటర్ నాగేంద్ర తెలిపారు. 2026--27 విద్యా సంవత్సరానికి బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎల్ఐబీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ లేదా మూడేళ్ల డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని, వయోపరిమితి లేదని తెలిపారు. బీఏలో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బీఎస్సీలో ఎంపీసీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీకాంలో కంప్యూటర్స్, బీఎల్ఐబీలో లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94919 47599, 94940 81882 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

# ప్రొద్దుటూరు సభకు బయల్దేరిన టీడీపీ శ్రేణులు

## బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన మాజీ జెడ్పీటీసీ లతారెడ్డి

ప్రజాభూమి, పులివెందుల



ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ విచ్చేస్తున్న సందర్భంగా పులివెందుల నుంచి భారీగా కార్యక ర్తలు తరలివెళ్లారు. పులివెందుల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద పులివెందుల మండలం, మున్సిపాలిటీకి చెందిన బస్సులను మాజీ జెడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లతారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు మార్గమధ్యలో ఎక్కడబడితే అక్కడ దిగకుండా క్రమశిక్ష ణతో సభకు వెళ్లి, సభ ముగిసిన వెంటనే సురక్షితంగా తిరిగి గ్రామాలకు చేరుకోవాలని సూచించారు. దారి పొడవునా భోజన ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

# స్థానిక ఎన్నికలకు వైఎస్సార్సీపీ భయపడుతోంది

## - సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఆ పార్టీ దివాలాకోరుతనానికి నిదర్శనం: కొమర వెంకట నరసయ్య

ప్రజాభూమి, ఒంటిమిట్ట: స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనే సత్తా లేకనే వైఎస్సార్సీపీ పంచాయతీ వార్డుల విభజన అంశాన్ని తెరపైకి తెచ్చి, ఆ పార్టీ నాయకుడు లేళ్ల అప్పిరెడ్డితో సుప్రీంకోర్టులో రిట్



పిటిషన్ దాఖలు చేయించిందని రాష్ట్ర మాజీ డైరెక్టర్, నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు కొమర వెంకట నరసయ్య విమర్శించారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా రోజుకో అంశంతో న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ వైఎస్సార్సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు ప్రజల ప్రధాన సమస్యలను పరిష్కరిస్తున్న కూటమి ప్రభుత్వం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. కృష్ణా జలాలను పులివెందుల వరకు తీసుకెళ్లడంతో పాటు కుప్పం ప్రాంతానికి నీటిని అందించే దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెబుతూ పలు హామీలు ఇస్తున్నప్పటికీ, వాటి ప్రభావం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని నరసయ్య అన్నారు. రాజంపేటకు జిల్లా కేంద్రం సాధించడంలో, మెడికల్ కాలేజీ ఏర్పాటులో గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఇప్పుడు ప్రజలను ఏ ముఖంతో ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికలు ఏ విధంగా నిర్వహించారో, అదే విధంగా కూటమి ప్రభుత్వం కూడా స్థానిక సంస్థల ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. టీడీపీలో ఏకపక్ష ధోరణికి తావులేకుండా పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకుని ముందుకు సాగితే ఎన్నికల్లో మరింత అనుకూల ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఆ దిశగా పార్టీ అధిష్టానం తగిన చర్యలు తీసుకోవాలని కొమర వెంకట నరసయ్య కోరారు.

# కసనూరు మెడికల్ క్యాంప్ ను సందర్శించిన బీటెక్ రవి

## వైద్య సేవలపై వైద్యులతో ఆరా.. ప్రజలతో మమేకం

ప్రజాభూమి, పులివెందుల



కసనూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ ఉ మెడికల్ క్యాంప్ ను పులివెందుల టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బందితో మాట్లాడి క్యాంప్ లో అందిస్తున్న వైద్య సేవలు, పరీక్షలు, సదుపాయాల గురించి ఆరా తీశారు. క్యాంప్ కు వచ్చిన ప్రజలను కలిసి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, హైదరాబాద్ సహకారంతో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నామని బీటెక్ రవి తెలిపారు. క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడం ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు ఈ స్క్రీనింగ్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సింహాద్రిపురంలో నేడు, రేపు ఇదే తరహా క్యాంప్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన యనమల సుధాకర్

## పోరుమామిళ్ల పలు సమస్యలపై ముఖ్యమంత్రికి వివరించిన సుధాకర్

ప్రజా భూమి పోరుమామిళ్ల :



ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యనమల సుధాకర్ పోరుమామిళ్ల ప్రాంతానికి సంబంధించిన పలు ముఖ్యమైన సమస్యలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పోరుమామిళ్ల పట్టణం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ప్రజలకు సంబంధించిన పలు సమస్యలపై ముఖ్యమంత్రితో యనమల సుధాకర్ చర్చించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పోరుమామిళ్ల ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సానుకూలంగా స్పందించినట్లు యనమల సుధాకర్ తెలిపారు.

# మిట్ట మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

ప్రజాభూమి, పులివెందుల



పులివెందుల పట్టణంలోని గుంత బజారు సమీపంలో ఉన్న ప్రసిద్ధ, పురాతన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుండే ఆలయ ప్రధాన అర్చకులు రుద్రస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, భస్మాభిషేకం, సహస్రనామ అష్టోత్తర శతనామావళి, బిల్వార్చన, లింగాష్టకం, మహా మంగళ హారతులు వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజూ ఆలయంలో ధూప, దీప, నైవేద్యాలతో విశేష పూజలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారని అన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2008 బ్యాచ్ బోధనా సిబ్బందికి ఘన సన్మానం

## - 18 ఏళ్ల సేవలను గుర్తించిన ఆర్కే వ్యాలీ డైరెక్టర్ జి. విజయ ప్రకాష్

ప్రజాభూమి, వేంపల్లె




ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్జీయూకేటీ--ఆర్కే వ్యాలీలో 2008లో నియమితులై నిరంతరం సేవలందిస్తున్న 32 మంది బోధనా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సోమవారం ఆర్కే వ్యాలీ కంప్యూటర్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 2008 బ్యాచ్ బోధనా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ జి. విజయ ప్రకాష్ మాట్లాడుతూ.. 18 ఏళ్లుగా సంస్థ అభివృద్ధికి అంకితభావంతో సేవలందిస్తున్న బోధనా సిబ్బంది కృషిని అభినందించారు. వారి సేవలు విశ్వవిద్యాలయ ప్రగతిలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు. ఆర్కే వ్యాలీని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల స్థాయికి అభివృద్ధి చేసేందుకు ప్రతి అధ్యాపకుడు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. సీహెచ్. రత్నకుమారి, డీన్ అకడమిక్స్ డా. ఎస్. మహబూబ్ జిలానీ, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ బి. దీపిక బాల, క్యాంపస్ మెయింటెనెన్స్ ఆఫీసర్ వి. బాల ఓబయ్య, ఈబీఎస్ కోఆర్డినేటర్ బిన్నీ పాల్గొని 2008 బ్యాచ్ బోధనా సిబ్బందిని అభినందించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఘన స్వాగతం పలికిన అతికారి క్రిష్ణ

ప్రజాభూమి, సిద్దవటం: రాష్ట్రవ్యాప్తంగా రూ.30,156 కోట్ల విలువైన జల్ జీవన్ మిషన్ --



అమరజీవి జలధార ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు కడప జిల్లా ప్రొద్దుటూరుకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ గారికి సిద్దవటం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ ఘన స్వాగతం పలికారు. ప్రొద్దుటూరుకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను అతికారి కృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికి, కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార ప్రాజెక్టులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారితో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జల్ జీవన్ మిషన్ -- అమరజీవి జలధార ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అతికారి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు జనసేన శ్రేణులు పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి ఈ ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తాయని అన్నారు.

# తాగునీటి ట్యాంక్ చుట్టూ ముళ్లపొదలు

## -పరిశుభ్రతపై వంతాటిపల్లి ఎస్సీ కాలనీ వాసుల ఆవేదన

ప్రజాభూమి, సిద్దవటం:



మండలంలోని వంతాటిపల్లి గ్రామం ఎస్సీ కాలనీలోని తాగునీటి ట్యాంక్ చుట్టూ ముళ్లపొదలు, పాచి పేరుకుపోయి అపరిశుభ్రంగా మారడంతో పాటు విషపురుగులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి ట్యాంక్ పరిసరాలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన ముళ్ల చెట్లు, అపరిశుభ్రత కారణంగా తాగునీటి విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై వంతాటిపల్లి పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ రజియాను వివరణ కోరగా, తాగునీటి ట్యాంక్ ప్రాంతాన్ని పరిశీలించామని తెలిపారు. ట్యాంక్ చుట్టూ ఉన్న ముళ్ల చెట్లు, అపరిశుభ్రతను పూర్తిగా తొలగించి, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందేలా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

# రంగసముద్రం మాజీ సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రంగసముద్రం స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కాకర్ల సుబ్బరాయుడు



ప్రజాభూమి పోరుమామిళ్ల :
రంగసముద్రం విద్యా కమిటీ చైర్మన్ కాకర్ల సుబ్బరాయుడు తమ గ్రామ పెద్దలతో కలిసి రంగసముద్రం మాజీ సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్ రెడ్డిని మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ మీ మద్దతుతోను రంగసముద్రం గ్రామ పెద్దల సహకారంతోనూ తాను ఈ పదవికి ఎన్నుకోబడ్డానని అందుకు మీకు గ్రామ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మిమ్మల్ని కలిశానని తెలియజేశారు. చిత్తా రవి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రంగసముద్రం గ్రామ పెద్దలందరూ కూడా సమిష్టిగా సుబ్బరాయుడుని చైర్మన్గా సూచించారని రాబోయే రోజులలో పాఠశాల అభివృద్ధి కోసం సుబ్బరాయుడు చేపట్టబోయే ప్రతి పనిలో తమ సహకారం ఉంటుందని తెలియజేస్తూ ఆయనను శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, వైయస్సార్సీపి యువ నాయకులు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, సాయి నారాయణ రెడ్డి, రఘునాథరెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి, శ్రీరామ్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి,చెన్నారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజా రెడ్డి, తులసి సురేష్, ప్రసన్న, ఆదర్శ రైతు బాలిరెడ్డి తదితర వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల దసరా శరన్నవరాత్రుల మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ...



ప్రజాభూమి పోరుమామిళ్ల :
పోరుమామిళ్ల పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్ర మహోత్సవ కార్యక్ర మముల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ పోరుమామిళ్ల ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ అనంతభొట్ల కృష్ణ కౌశిక్ శర్మ, అర్చకులు శ్రీ అనంతభొట్ల సుబ్బరామశర్మ చేతుల మీదుగా దసరా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ చేయడం జరిగినది. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మోటపోతుల శివకుమార్ మాట్లాడుతూ పోరుమామిళ్ల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి దసరా బ్రహ్మోత్సవాలు.. అక్టోబర్ 11 ఆదివారం నుండి 22 గురువారం వరకు పోరుమామిళ్ల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగును. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు విశ్వనాధుల ప్రసాదు, సెక్రటరీ మాలేపాటి నారాయణ, కోశాధికారి మిట్ట సుధాకర్, గౌరవ సలహాదారులు తులసి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు తులసి సుధాకర్, ఉప కార్యదర్శులు కొత్తూరు సుబ్బరాజా, తిరివీధి వెంకట శ్రీహరి కుమార్, ఓరిగంటి రమేష్ బాబు గారు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు కలువ శేఖర్, ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల తరుణ్ వంశీ, కోశాధికారి దిండుకుర్తి లక్ష్మయ్య మరియు మహిళా మండలి అధ్యక్షురాలు పలుకూరి రాధా, ప్రధాన కార్యదర్శి పెసల సుప్రజ, కోశాధికారి బుధవరపు రమాదేవి, ఉప కోశాధికారి శ్రీరామ్ శ్రీదేవి మరియు ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా మండలి కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినదని మోటపోతుల శివకుమార్ తెలిపారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

మంగళవారం 06 అక్టోబరు 2026

## శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజా భూమి ప్రతినిధి తిరుమల



తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు మరో వారం రోజుల గడువు మాత్రమే ఉన్న నేపథ్యంలో టీటీడీ ఈవో ముద్దాడ రవి చంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వివిధ విభాగాల ఏర్పాట్లపై సోమవారం అన్నమయ్య భవన్‌లో సమీక్ష నిర్వహించా రు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడు, టీటీడీ జేఈవోలు డాక్టర్ శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు జరిగిన తొమ్మిది రోజుల సాలకట్ల బ్రహ్మోత్సవాలను భక్తులకు అనుకూలంగా, ప్రశాంత వాతావరణంలో శ్రీవారి దర్శనం కల్పించేలా పటిష్టమైన ఏర్పాట్లతో విజయవం తంగా నిర్వహించామని తెలిపారు. ఇందుకు అన్ని విభాగాలు, పోలీసు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం ప్రధాన కారణమని, ఇదే సమన్వయ స్ఫూర్తిని నవరాత్రి బ్రహ్మోత్సవాల్లోనూ కొనసాగించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో వరుస సెలవులు, పెరటాసి మాసం నేపథ్యంలో గతంతో పోలిస్తే సుమారు 25 నుంచి 30 శాతం అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు ఈవో తెలిపారు. ఈ మేరకు పెరిగే భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించి, ఏ అంశాలు సక్రమంగా అమలయ్యాయి, భక్తులకు ఏ ఏర్పాట్లు మరింత అనుకూలం గా నిలిచాయి, ఎక్కడైనా చిన్నచిన్న లోటుపాట్లు ఉన్నాయా, వాటిని ఎలా సరిదిద్దుకోవాలనే అంశాలపై చర్చించినట్లు ఈవో తెలిపారు. గుర్తించిన లోటుపాట్లను నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ లాజిస్టిక్స్, అన్నప్రసాదం, వైద్య ఆరోగ్యం, పారిశుధ్యం, రవాణా తదితర అన్ని విభాగాల్లో అవసరమైన ఏర్పాట్లు ఇప్పటికే చేపట్టినట్లు తెలిపారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకుని, వాహన సేవలను వీక్షిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పొందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఈవో సూచించారు. భక్తులందరూ తిరుమలకు విచ్చేసి ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకుని, వాహన సేవల్లో పాల్గొని మంచి ఆధ్యాత్మిక అనుభూతిని పొందాలని టీటీడీ ఈవో కోరారు. ఈ సమావేశంలో అన్నప్రసాదం, పారిశుధ్యం, శ్రీవారి సేవకులు, వైద్య సేవలు, రవాణా, పుష్పాలంకరణలు, విద్యుత్ అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎస్వీబీసీ ప్రసారాలు, టీటీడీ విజిలెన్స్, పోలీసుల భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. టీటీడీలోని వివిధ విభాగాల ఉన్నతాధికా రులు, పోలీసు, ఏపీఎస్ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. (సీఆర్) మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుపతి జిల్లాకు చెందిన గ్రామీణ విలేఖరుల కోసం రెండు రోజుల పాటు నిర్వహించిన పునశ్చరణ తరగతులు ముగిసిన అనంతరం ఆయన తిరుమలకు విచ్చేసి శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

## రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



పూడి--రేణిగుంట రైల్వే స్టేషన్ల మధ్య మైలాపూర్ ఫుడ్ కంపెనీ సమీపంలో రైలు పట్టాల పక్కన సుమారు75ఏళ్ల వృద్ధుడిమృతదేహం లభ్యమైంది. గుర్తుతెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు రైల్వేపోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై తెల్లని పంచ, తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్ట్, తెల్లని కండువా ఉన్నాయి. మెడలో ఎరుపు రంగు దారం, రుద్రాక్ష ధరించి ఉన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రేణిగుంట రైల్వే జీఆర్పీ ఎస్ఐ మధుసూదన్‌రావును సంప్రదించాలని పోలీసులు కోరారు. మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

## శ్వాస మీద ధ్యాస ఉంచండి :కైలాస్ గురూజీ

### ఘనంగా కైలాస్ గురుజి జన్మదిన వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం శ్వాస మీద ధ్యాస ఉంచాలని ప్రాణయోగ ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాస్ గురూజీ అన్నారు ఆదివారం కొత్త కండ్రిగ సమీపం లోని ప్రాణ యోగ ఆశ్రమంలో గురూజీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా గురూజీకి పుష్ప గుచ్ఛాలను అందించి దుస్సాలవలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాయమంత ఆరోగ్యంగా జీవించడమే కాక జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చుని సూచించారు ఆశ్రమం ఆధ్వర్యంలో పేదలకు విద్యార్థులకు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు ఈ నేపథ్యంలోనే టిడిపి సీనియర్ నాయకుడు వార్తల శివ యాదవ్ ఆశ్రమ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

## తమిళనాడు నుంచి నడకయాత్ర..
## గోవింద స్వాములకు ఆత్మీయ అన్నసేవ



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం తిరుమల శ్రీవారి దర్శనం కోసం తమిళనాడు రాష్ట్రం నుంచి కాలినడకన బయలుదేరిన గోవింద స్వాములకు రామచంద్రపురం మండల కేంద్రంలో భక్తులు ఆత్మీయంగా అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని వినాయక స్వామి ఆలయం ఎదుట శనివారం పలువురు భక్తులు అన్నసేవ నిర్వహించారు. కాలినడకన తిరుమల బాట పట్టిన భక్తులకు భోజనం అందించడం ద్వారా తమ వంతు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నదానం నిర్వహించిన భక్తులు తెలిపారు. స్వామివారి దర్శనం కోసం దీక్షతో, భక్తిశ్రద్ధలతో సాగుతున్న యాత్రికులకు అన్నదానం చేయడం ద్వారా భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా గోవింద స్వాములు అన్నదానం చేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.



## నులిపురుగులు, క్షయ వ్యాధిపై ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో అవగాహన.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

తిరుపతి నగరంలోని నెహ్రూ నగర్‌లో గల ఉర్దూ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల వ్యాధులు మరియు క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ మరియు క్షయ వ్యాధుల అధికారి డాక్టర్ శైలజ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్వైజర్ కామరాజు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కామరాజు మాట్లాడుతూ నులిపురుగుల వ్యాధులు పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి తగ్గడం, కడుపు నొప్పి, బలహీనత వంటి సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లను శుభ్రంగా మరియు చిన్నగా ఉంచుకోవడం, శుభ్రమైన ఆహారం మరియు సురక్షితమైన తాగునీటిని వినియోగించడం ద్వారా నులి పురుగుల వ్యాధులను నివారించవచ్చుని వివరించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా అందించే డీవార్మింగ్ మాత్రలను ఆరోగ్య సిబ్బంది సూచనల మేరకు తీసుకోవాలని సూచించారు.

క్షయ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు దగ్గు లేదా తుమ్ము వచ్చినప్పుడు రుమాలు/మాస్క్ ఉపయోగించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం,ఇళ్లలో గాలి,వెలుతురు ప్రసరించేలా చూసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని, తమ కుటుంబ సభ్యులు మరియు పరిసర ప్రాంత ప్రజలకు కూడా ఆరోగ్య విషయాలను తెలియజేయాలని హెల్త్ సూపర్వైజర్ కామరాజు కోరారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ముజీబ్, పాఠశాల ఉపాధ్యాయులు,ఏఎన్ఎం సరిత, ఆశాకార్యకర్త,టిబీ సూపర్వైజర్ కళాప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు



ప్రజా సమస్యలను వేగంగా, పారదర్శకంగా, నిబంధనల మేరకు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని పిజిఅర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ఎస్ )రెవెన్యూ క్లినిక్ కార్యక్రమా లకు సంబంధించిన అర్జీలను ప్రజల నుండి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్,డి ఆర్ ఓ కె.మోహన్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేష్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసుల నాయుడు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యూ క్లినిక్‌లో వచ్చినఅర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అర్జీలను నాణ్యతగా పరిష్కరించడం పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదు అర్జీని పరిశీలించి సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలఅధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారం పై నిత్యం పర్యవేక్షణ చర్యలు తీసుకోవాలని డివిజన్ స్థాయి అధికారులు కూడా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలప్రకారం గడువులోగా సమస్యలను పరిష్క రించాలని సూచించారు. అలాగే భూసమస్యల పైప్రత్యేక దృష్టినిసారించాలని, రీసర్వేపూర్తయినగ్రామాల్లో సరిహద్దు వివాదాలు రికార్డుల్లోని తప్పులు, విస్తీర్ణ వత్యాసాలు తదితర అంశాలపైవచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తేచర్యలుతప్పవని జాగ్రత్తగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ1100 టోల్ ఫ్రీ సేవ ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత బాధ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతి అర్జీదారులతో నేరుగా మాట్లాడిన తర్వాతే నివేదిక సమర్పించాలని మాట్లాడిన తేదీ సమయాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలోమండలస్థాయి అధికారులు ఖచ్చితంగాప్రజాసమస్యల పరిష్కార వేదికకార్యక్రమంలో హాజరుకావాలని పెండింగ్ లో ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ప్రజల్లో 1100 సేవలపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో కూడిన 273అర్జీలు వచ్చాయి. ఇందులో 236రెవెన్యూ క్లినిక్ సంబంధించినవి కాగా ఇతర అర్జీలు 37 దాకా ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను వినతల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి- ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

### - రూ.158 లక్షల విలువైన పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు





ప్రజలకు మంచి చేసే కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులకు ఏకపక్షంగా విజయాన్ని కట్టబెట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పిలుపునిచ్చారు. పల్లె పండుగ 3.0లో భాగంగా సోమవారం గుడిపాల మండల పరిధిలో మొత్తం రూ.158 లక్షల విలువైన తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు ప్రారంభించగా, ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనంతగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, తారు రోడ్లు వేసామని, కాలువల నిర్మించామని, బస్సు సౌకర్యాలు కల్పించామని చెప్పారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు మంచి సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తున్నారని.. ఇలాంటి మంచి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజలు తెలిపిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. పర్యటనలో భాగంగా మొదటగా బొమ్మసముద్రం కాలనీలో రూ.2.5 లక్షలతో నిర్మించిన తాగునీటి ప్లాంటును ప్రారంభించారు. అనంతరం బొమ్మసముద్రం ఉన్నత పాఠశాలలో రూ.15 లక్షలతో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. సందర్భంగా పాఠశాలలో క్రీడా మైదానం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రూ.50 లక్షలతో కుప్పిగానిపల్లి నుంచి బొజ్జల వారిపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం రూ.45 లక్షలతో 197 రామాపురం రోడ్డు నుంచి బుచ్చన్న కండిగ బీటీ రోడ్డును ప్రారంభించారు. మధ్యాహ్నం 197 రామాపురం రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.17 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును,నారగల్లు గ్రామపంచాయతీ పరిధిలో రఘునాథపురంలో రూ.29.47 లక్షలతో సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శిరీష, తహశీల్దారు శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బానాయుడు, నాయకులు ధనసింగ్, బాలసుబ్రమణ్యం యాదవ్, సీకె లావణ్య, ఎ.పీటర్, సుమతి, దీపశ్రీ అనిల్, శరత్, హేమాద్రి నాయుడు, స్థానిక కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 378 అర్జీలు

### రెవెన్యూ శాఖకు అధిక సంఖ్యలో అందిన అర్జీలు . . సమస్యల పరిష్కారం పై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలి -:జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి





ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కు వచ్చిన అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీల ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీజిఆర్ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, శివశంకర్ నాయక్, నాగార్జున, రామాంజణమ్మ లతో కలసి జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు :

రెవెన్యూ-238, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -13, హోమ్-21, పంచాయత్ రాజ్-37, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ -- 3, రిజిస్ట్రేషన్ ఒ స్టాంప్స్ -- 1, ఎస్ ఎస్ ఎల్ ఆర్ -12, రూరల్ డెవలప్మెంట్ -- 4, గ్రామ/వార్డు సచివాలయం -- 2, విద్యుత్ శాఖ -4, ఆర్టీసీ -1, సివిల్ సప్లైస్ -- 4, తుడా -- 1, ఫ్యామిలీ వెల్ఫేర్ - - 4, స్కూల్ ఎడ్యుకేషన్ -- 5, ఇరిగేషన్ -4, అటవీ శాఖ -- 2, రవాణా శాఖ -- 1, బి సి వెల్ఫేర్ -- 2, ఇండస్ట్రీస్ -- 1, కొ ఆపరేటివ్ సొసైటి -- 1, మైక్రో ఇరిగేషన్ -- 1, ఐ సి డి ఎస్ -- 3, సెకండరీ హెల్త్ -- 1, టూరిజం -1, రుయా ఆసుపత్రి -- 1, వ్యవసాయ శాఖ -1, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు -- 1, ఆర్ అండ్ బి- 2, హౌసింగ్ -- 2, ఆర్ డబ్ల్యు ఎస్ - 2, గనులు శాఖ -- 1, కళాశాల విద్య -- 1 వెరసి మొత్తం 378 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖ కు అధిక శాతం అర్జీలు అందాయని, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలన్నారు. వీటితో పాటు అందిన మిగిలిన అర్జీల పై దృష్టిపెట్టి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరైన వివిధ శాఖల అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

## జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

ఈనెల 10, 11వ తేదీల్లో సూళ్లూరుపేట వేదికగా జరిగే సిఐటియు అనుబంధ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సోమవారం మహాసభల గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీల పట్ల కూటమి ప్రభుత్వం సవతి ప్రేమ చూపిస్తోందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు చేయడంలో మీనామేషాలు లెక్కిస్తోందని మండిపడ్డారు. రిటైర్మెంట్ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలనీ, పదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలనీ, ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ నేతలు రాజేశ్వరి, రేవతి, శ్యామల, మునికుమారి, స్వరూపారాణి, సిటీయు జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, జీ బాలసుబ్రమణ్యం, అంగేరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాలపై ఈగల్ టీం ప్రత్యేక నిఘా.. రద్దీ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు



- రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి.
- మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వపై క్షుణ్ణమైన నిఘా.
- చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు.
- మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం కోరుతున్న జిల్లా పోలీస్ శాఖ.





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, సరఫరా మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టే లక్ష్యంతో లిజిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపిఎస్., పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఎక్కడైనా మాదకద్రవ్యాలకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వాటిపై తక్షణమే స్పందించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు ఈగల్ టీం ఇన్స్పెక్టర్ డి. నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్ సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ముఖ్య కూడళ్లు మరియు ఇతర సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు మరియు కదలికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా నివారించడం, మత్తు పదార్థాల అక్రమ రవాణా గొలుసును గుర్తించి అడ్డుకోవడం, విక్రయదారులు మరియు సరఫరాదారులపై నిఘా పెంచడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా పోలీస్ శాఖ తెలిపింది. మాదకద్రవ్యాల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిరంతర నిఘా, తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, నిల్వ, సరఫరా, పంపిణీ లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చీఐూూ చట్టం, 1985 మరియు వర్తించే ఇతర చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. తనిఖీల్లో మాదకద్రవ్యాలు పట్టుబడిన సందర్భంలో వాటిని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తుల పాత్ర, మాదకద్రవ్యాల రకం మరియు పరిమాణం తదితర అంశాల ఆధారంగా చట్ట ప్రకారం దర్యాప్తు చేపడతారు. మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించే వ్యక్తులపై కూడా చట్టపరమైన నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం విషయంలో ఎవరినీ ఉపేక్షించబోమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

- ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి.

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని జిల్లా పోలీస్ శాఖ కోరింది. అనుమానాస్పద కార్యకలాపాలను గమనించినప్పుడు ప్రజలు స్వయంగా జోక్యం చేసుకోకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించింది.

హెల్ప్‌లైన్ నంబర్లు:

112 -- అత్యవసర పోలీస్ సేవలు
1972 -- ఈగల్ యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్
1933 -- నార్కోటిక్స్ హెల్ప్‌లైన్.

మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు మరియు అన్ని వర్గాల సమిష్టి సహకారంతోనే మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించగలమని జిల్లా పోలీసులు పేర్కొన్నారు.

## ఎస్వీ.బీ.సీ. ఉద్యోగుల సంక్షేమ ధ్యేయం..

### చైర్మన్ శ్రీధర్ వర్మ



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి

టీటీడీ ఎస్వీ.బీ.సీ. పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయమని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ చైర్మన్ శ్రీధర్ వర్మ అన్నారు. సోమవారం శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ కార్యాలయం నందు ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ నందు పనిచేస్తున్న ఉద్యోగుల, జీతాలు ఇంక్రిమెంట్ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ దృష్టికి ఉద్యోగుల సమస్యలను తీసుకుని వెళ్లడంతో పాటు అలాగే టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అడిషనల్ ఈ.వో. వెంకయ్య చౌదరి, టీటీడీ ఎస్వీ.బీ.సీ. సీఈవో శరత్, టీటీడీ జేఈవో ప్రభల గోపీచంద్ ( విద్య వైద్య) వారితో సుదీర్ఘంగా చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం జరిగిందని వివరించారు. గతంలో ఆగిపోయిన జీతాలు ఇంక్రిమెంట్ వచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసినందుకు వారికికృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చైర్మన్ శ్రీధర్ వర్మ పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ ఉద్యోగులు ఛానల్ ను మరింత అభివృద్ధి చేసేందుకు అందరం సంఘటితంగా కృషి చేస్తామన్నారు. శ్రీవారి సేవలను విశ్వవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఎస్వీ భక్తి ఛానల్ ఉద్యోగులు చైర్మన్ శ్రీధర్ వర్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్కిమ్స్ కళాశాలలో ఎంబీఏ ఉ ఎంసీఏ తరగతుల ప్రారంభం

### -ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తీశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (స్కిమ్స్ ) కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ ఉ ఎంసీఏ తరగతుల ప్రారంభోత్సవం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమముతో పాటు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ మరియు సిల్వర్ మెడల్ సాధించి భారతదేశానికే గర్వకారణంగా నిలిచిన నాయుడుపేటకు చెందిన 19 ఏళ్ల యువకుడు తిరుమూరుగణేష్ మణిరత్నంకి అభినందనలు తెలియజేస్తూ ఆయన తండ్రిగారైన తిరుమీరు హరి ప్రసాద్ ని స్కిమ్స్ కళాశాలలో విద్యార్థులు మరియు కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. హరి ప్రసాద్ మాట్లాడుతూ పట్టుదలతో దేశం గర్వపడేలా మా అబ్బాయి ఏషియన్ గేమ్స్ లో గోల్డ్ మరియు సిల్వర్ మెడల్ సాధించిన ఆనందంగా ఉన్నదని తెలియజేశారు, ఈరోజు సాయంత్రం తిరుపతి ఎయిర్పోర్ట్ కు విచ్చేయుచున్నాడని తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ ఎం రఘురాం రెడ్డి మాట్లాడుతూ వృత్తి విద్య కోర్సులైన ఎంబీఏ-ఎంసీఏ కోర్సులు నైపుణ్యతతో పూర్తి చేస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలియజేశారు. కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్నందున ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలియజేశారు. అతిథులు కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ. శ్రీకుమార్ మాట్లాడుతూ సబ్జెక్టుపై పట్టుతో శ్రద్ధతో చదివితే తప్ప ఈ పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలు సాధించలేరని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గీతాదేవి మాట్లాడుతూ ఎంబీఏ ఉ ఎంసీఏ కోర్సుల ప్రాముఖ్యత, విద్యార్థుల భవిష్యత్ అవకాశాలు, అలాగే స్కిమ్స్ కళాశాల మిషన్, విజన్, కోడ్ ఆఫ్ కాండక్ట్ గురించి వివరించారు. అనంతరం డాక్టర్ దొరై రాజ్ జీఎం హెచ్ ఆర్ ఈసీఎల్ రచించిన కాలేజ్ టు కార్పొరేట్ పుస్తకాన్ని విద్యార్థిని విద్యార్థులు అందరికీ ఉచితముగా ఇవ్వడం జరిగింది. అనంతరం కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ సెల్, ప్లే గ్రౌండ్ తదితర భౌతిక సౌకర్యాలతో పాటు కోర్సు కరికులం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నూతనంగా ప్రవేశం పొందిన ఎంబీఏ ఉ ఎంసీఏ విద్యార్థులు స్కిమ్స్ క్యాంపస్‌లోని వివిధ విభాగాలను సందర్శించి, కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు మరియు విద్యా విధానంపై అవగాహన పొందారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను మరియు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించడమైనది వచ్చేసా చివరిగా జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

## జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో విజేత కుప్పం బాదూరు విద్యార్థిని పి వేదశ్రీ




ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రాపురం

సేవా సంకల్ప చిత్రలేఖన పోటీల్లో కుప్పం బాదూరం ఎంపీఎస్ పాఠశాలకు చెందిన పి వేదశ్రీ ప్రతిభ కనపరచారని జిల్లాస్థాయి ద్వితీయ స్థానంలో విజేతగా నిలిచి, అవార్డు దక్కించుకుందని ఎంఈఓ మార్కండేయ నాయుడు అన్నారు. సోమవారం అవార్డును, ప్రశంసా పత్రాన్ని కుప్పం బాదూరు ఎంపీపీ స్కూల్ ఆవరణంలో విద్యార్థిని పి వేదశ్రీకి అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మార్కండేయ నాయుడు మాట్లాడుతూ గత శనివారం తిరుచానూరు జడ్పీహెచ్ఎస్‌లో జరిగిన జిల్లాస్థాయి చిత్రలేఖన పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానం సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిత్రలేఖన పోటీలకు విద్యార్థిని పి వేదశ్రీ ఎంపికైందని తెలిపారు. త్వరలో అమరావతిలో జరిగే చిత్రలేఖన పోటీలలో విద్యార్థిని వేదశ్రీ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అవార్డు కూడా దక్కించుకుంటుందని ఆయన ఆశా భావం వ్యక్తం చేశారు.



## ఘనంగా సలీం జన్మదిన వేడుకలు - షబ్బీర్ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం..

### సేవా కార్యక్రమంతో జన్మదిన వేడుకలు -సామాజిక సేవలో ముందుండే సలీంను అభినందించిన పలువురు నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి తొట్టంబేడు

మండలం తొట్టంబేడు పంచాయతీ రామచంద్రపురం గ్రామానికి చెందిన షబ్బీర్ ఆధ్వర్యంలో యువ ముస్లిం నాయకులు సలీం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సలీం జన్మదినాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం గ్రామానికి చెందిన షబీర్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమం పలువురి ప్రశంసలు అందుకుంది. పుట్టినరోజు వేడుకలను కేవలం ఆర్భాటాలకు పరిమితం చేయకుండా, అన్నదానం వంటి సేవా కార్యక్రమంతో నిర్వహించడం ద్వారా సలీం పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు.సలీం యువతను కలుపుకొని ముందుకు సాగుతూ, అందరితో ఆప్యాయంగా మెలిగే నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని పలువురు పేర్కొన్నారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, అవసరమైన సందర్భాల్లో తన వంతు సహకారం అందించడం సలీం ప్రత్యేకతఅని పలువురు కొనియాడారు. సామరస్యం, సోదరభావం, సేవా దృక్పథానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న సలీం మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

సలీం జన్మదినం సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమం మానవత్వానికి ప్రతీకగా నిలిచిందని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. సలీం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూసల వీధి అబ్బు, మోహన్, మస్తాన్, జాఫర్, ఆశీం, చాన్ భాషా, సుధ, మస్తాన్, వాజిద్, శుభహాన్, వసీం, మహమ్మద్, బాలాజీతో పాటు పలువురు యువత పాల్గొన్నారు.

## మున్సిపల్ మోడల్ ప్రైమరి పాఠశాలలో అటెండెన్స్ చదువులో అత్యధికంగా వచ్చిన వాళ్లకి బెస్ట్ విద్యార్థి స్కూల్ బ్యాచ్ ఎస్ నౌజియా



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

మున్సిపల్ మోడల్ ప్రైమరి పాఠశాలలో అటెండెన్స్ చదువులో అత్యధికంగా వచ్చిన వాళ్లకి బెస్ట్ విద్యార్థి స్కూల్ బ్యాచ్ ఎస్ నౌజియా తెలిపారు .శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్ నౌజియా మాట్లాడుతూ ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థుల అటెండెన్స్ లో ను మరియు చదువులోనూ అత్యధికంగా వస్తారో వారికీ బెస్ట్ విద్యార్థికి ప్రతినెల స్కూల్ బ్యాడ్జి ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు కావున ప్రతి ఒక్క తల్లి తండ్రి ప్రతిరోజు స్కూల్ కి పిల్లల్ని పంపించవలసినదిగా కోరారు.

## సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి-మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

నాయుడుపేట పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలన్నా,అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగించాలన్నా పౌరులు సకాలంలో చెల్లించే పన్నులే కీలకమని తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ స్పష్టం చేశారు.వ్యాపారులు,భవన యజమానులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పన్ను బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించి పట్టణాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు.ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించారు. నాయుడుపేట పట్టణంలోని పలు ఇళ్లు,మున్సిపల్ దుకాణాలను సందర్శించి యజమానులతో స్వయంగా మాట్లాడారు.పురపాలక సంఘానికి చెందాల్సిన మున్సిపల్ షాప్ రూమ్ అద్దెలు, ప్రాపర్టీ ట్యాక్స్ (గృహ పన్నులు), కుళాయి పన్నులకు సంబంధించి దీర్ఘకాలికంగా పేరుకుపోయిన బకాయిలను తక్షణమే రాబట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఉరుకుందమ్మ మాట్లాడుతూ పన్నులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు కలుగుతున్న ఆటంకాలను ప్రజలకు వివరించారు. పట్టణంలో అంతర్గత రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ (డ్రైనేజీ), తాగునీటి సరఫరా మరియు పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలంటే మున్సిపల్ ఆదాయం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. పౌరులందరూ ప్రభుత్వ నిబంధనలకు సహకరించి, పన్నులు సకాలంలో చెల్లించడం ద్వారా ఆదర్శవంతమైన నాయుడుపేట పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక పర్యటనలో మేనేజర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది,స్వర్ణ వార్డు అడ్మిన్ సెక్రటరీలు,శ్యాం కుమార్ విష్ణు,దయశేఖర్ మరియు బిల్ కలెక్టర్లు రమేష్,అంథోని మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ఉత్సవంలో సేవా సంకల్ప్ అభియాన్ అవగాహన

### పోషణ, తల్లీ--శిశు ఆరోగ్యంపై లబ్ధిదారులకు సూచనలు

ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట

పోషణ్ మాహ్ కార్యక్రమాల్లో భాగంగా నాయుడుపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు, మున్సిపాలిటీ పరిధిలోని ఆరు అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ ఉత్సవం--సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఎల్.ఏ. సాగరం హెచ్‌డబ్ల్యూ అంగన్వాడీ కేంద్రంతో పాటు తుమ్మూరు ఇందిరా కాలనీ, ఎన్ఎస్ఆర్ కాలనీ తదితర కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మహిళలు, పిల్లలు, కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల సేవలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పోషకాహారం, తల్లీ--శిశు ఆరోగ్యం, పిల్లల ఎదుగుదల పర్యవేక్షణ, పోషకాహార లోపం నివారణపై అవగాహన కల్పించారు. ప్రీ--స్కూల్ విద్య ప్రాధాన్యతను వివరించి, పిల్లల ప్రాథమిక అభ్యాసంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి తల్లిదండ్రులు, స్థానిక సమాజం సహకరించాలని నిర్వాహకులు సూచించారు. కేంద్రాల్లో నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సహాయకులను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి, సీడీపీఓ కె. ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ మానెమ్మ పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సహాయకులు, లబ్ధిదారులు పాల్గొన్న కార్యక్రమంలో పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అధికారులు తెలిపారు.




## చదలవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాయుడుపేటలో ఉచిత దంత వైద్య శిబిరం

### అక్టోబర్ 10న సి.ఎస్.తేజ థియేటర్ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య శిబిరం

### కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్, సీయూఎస్‌కేటీ ప్యానల్ సంయుక్త నిర్వహణలో దంత వైద్య శిబిరం



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట

నాయుడుపేట పట్టణం, పరిసర గ్రామాల ప్రజల దంత ఆరోగ్య పరిరక్షణ కోసం చదలవాడ చారిటబుల్ ట్రస్ట్, తిరుపతి కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్, సీయూఎస్‌కేటీ ప్యానల్ సంయుక్తంగా ఉచిత వైద్య కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. అక్టోబరు 5 నుంచి 9 వరకు పట్టణంలోని వార్డులు, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి దంత, నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. దంత క్షయం, చిగుళ్ల సమస్యలు, నోటి పూతలు, నోటి క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలపై ప్రజలకు వైద్య బృందాలు సూచనలు అందిస్తున్నాయి. ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అక్టోబరు 10న నిర్వహించే ప్రధాన శిబిరానికి రావాలని సూచిస్తున్నారు. అక్టోబరు 10న నాయుడుపేటలోని సి.ఎస్.తేజ థియేటర్ ప్రాంగణంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత దంత వైద్య శిబిరం జరుగుతుంది. శిబిరంలో దంతాలకు పట్టిన గారను తొలగించడం, పళ్లలోని రంధ్రాలను పూడ్చడం వంటి సేవలు అందిస్తారు. పళ్లు లేని నిరుపేదలకు ఉచితంగా కట్టుడు పళ్లు అమర్చనున్నారు. కదిలిన, పాడైన పళ్లను నొప్పి లేకుండా తొలగించే చికిత్స కూడా అందుబాటులో ఉంటుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ప్రతినిధి వినోద్, వైద్య బృందం కోరారు. నాయుడుపేట పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

మంగళవారం 06 అక్టోబరు 2026

# నాడు వైసీపీ నిర్లక్ష్యం - నేడు ప్రజల అభివృద్ధే కూటమి లక్ష్యం

## అలంకరాయిపేటలో రూ.4.52 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు-ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ





ప్రజా భూమి శింగనమల

శింగనమల మండలం మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు సొంత గ్రామమైన అలంకరాయిపేట గ్రామంలో ప్రజల చిరకాల అవసరాలను తీర్చేలా కూటమి ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం భూమిపూజ, ప్రారంభోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 3. 50 కోట్లతో కూతలేరు కాజ్‌వే బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ,నిర్వహించారుఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అలంకరాయి పేట తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

అలాగే రూ. 82 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరిచే దిశగా ఈ పనులు చేపట్టారు. అదేవిధంగా ఎంపీ ల్యాడ్స్ నిధులతో రూ. 10 లక్షల వ్యయంతో రెండు బస్ షెల్టర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో ఒక బస్ షెల్టర్ హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆధ్వర్యంలో, మరో బస్ షెల్టర్ అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంజూరయ్యాయి. అలాగే రూ. 10 లక్షలతో రెండు వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఇందులో ఒకటి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆధ్వర్యంలో, మరొకటి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మంజూరయ్యాయి. ఈ విధంగా అలంకరాయిపేట గ్రామంలో దాదాపు రూ. 4. 52 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు భూమిపూజ, ప్రారంభోత్సవాలు నిర్వహించడం జరిగింది. మరోవైపు చీఫ్ విప్ కాల్వ శ్రీనివాసులు చేతుల మీదుగా దాదాపు రూ. 40 లక్షలతో అలంకరాయిపేట ఎంపీపీ పాఠశాలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అలంకరాయిపేటతో పాటు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని నాయకులు పేర్కొన్నారు. నాడు వైసీపీ నిర్లక్ష్యం చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం ప్రజల అభివృద్ధినే లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, ఎంపీపీ పార్థసారథి మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, ఎమ్మెల్సీ రామాదేవి, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి , కళ్యాణదుర్గం ఎమ్మెల్యే శ్రీ అలిమినేని సురేంద్రబాబు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం , ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి , ఏ.డీ.సీ.సీ. బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, లైబ్రరీ చైర్మన్ వడ్డే వెంకట్, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆల నరసానాయుడు , జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, ఆరు మండలాల కన్వీనర్లు, ఆరు మండలాల సింగిల్ విండో అధ్యక్షులు, కూటమి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్ల మంజూరు హర్షణీయం

### - మంజూరై మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్ల మాటేమిటి?

### - ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె

పేదలకు కొత్తగా 3 లక్షల ఇళ్లను మంజూరు చేయడం హర్షణీయమని, అయితే గతంలో మంజూరై వివిధ దశల్లో మధ్యలోనే నిలిచిపోయిన లక్షలాది పేదల ఇళ్ల పరిస్థితి ఏమిటని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీసీసీ మీడియా చైర్మన్ డా. ఎన్. తులసి రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కడప జిల్లా పులివెందుల మెగా ఇళ్ల కాలనీలో ఆరేళ్ల క్రితం 6,950 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు కేవలం 15 ఇళ్లలో మాత్రమే లబ్ధిదారులు నివాసం ఉంటున్నారని తెలిపారు. పులివెందులలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉందని, సుమారు నాలుగు లక్షల పేదల ఇళ్ల నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న ఆర్థిక సహాయం సరిపోవడం లేదన్నారు. కొత్త ఇళ్ల నిర్మాణాలతో పాటు అసంపూర్తిగా నిలిచిపోయిన ఇళ్లను కూడా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని, ఆయా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని తులసి రెడ్డి కోరారు.

## మంగమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి

శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తి మండలం, ఉరందూర్ హరిజన వాడకు చెందిన డి మంగమ్మ ఆకస్మిక మృతి చెందారు. కావున నేడు వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు తన ప్రదార సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో దిలీప్ సాయి నవీన్ పవన్ సురేంద్ర యాదవ్ రంగయ్య చెంచు కృష్ణ దాసు వినోద్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## చేమూరు చెరువులను కాపాడండి



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

పెద్దల చొరబాటుతో నానాటికీ తరిగిపోతున్న చేమూరు చెరువులను కాపాడాలంటూ తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద గ్రామస్తులు సోమవారం నిరసన తెలియజేశారు. వారికి మద్దతు తెలిపిన సిఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ చింతల చెరువు, రాయల చెరువు, ఎద్దల చెరువులు 500 ఆయకట్టుకు ఆయువుపట్టులా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే చేమూరు, చియ్యవరంకు చెందిన కొందరు అగ్రకులాల వారు చెరువు భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారని గుర్తు చేశారు. ఎద్దల చెరువును ఏకంగా పూడ్చి వేసినట్లు వాపోయారు. మిగిలిన రెండు చెరువులు సగానికి పైగా ఆక్రమణకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపైన గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఉమ్మడి సర్వే చేసినట్లు గుర్తు చేశారు. అయితే సర్వే సజావుగా సాగనీయకుండా అగ్రకులాల వారు అడ్డుకుంటున్నారనీ, రెవెన్యూ అధికారులు తలొగ్గుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేసి చెరువులను కాపాడాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, పెంచలయ్య, సీతారామయ్య, శంకరయ్య, జనార్ధన్, వెంకటయ్య, చిన్న పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## యర్రగుడిపల్లి యూజీడీ సమస్యకు చెక్.. భాకరాపురం రోడ్డుకు మోక్షం

### మనోహర్ రెడ్డి చొరవతో సమస్యలకు పరిష్కారం



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుడిపల్లిలో గత 8 నెలలుగా ప్రజలను వేధిస్తున్న యూజీడీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ సమస్యకు చెక్ పెట్టారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు తన సొంత నిధులతో ప్రత్యేక మోటారు ను సమకూర్చి, యూజీడీలో నిలిచిపో యిన మురుగునీటిని బయటకు పంపింగ్ చేయించారు. ఆయన స్వయంగా పనులను పర్యవేక్షిం చారు.శాశ్వత పరిష్కారం కోసం తదుపరి చర్యలు కూడా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.అలాగే భాకరాపురంలో పెండింగ్ లో ఉన్న రోడ్డు పనులను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, సీనియర్ వైసీపీ నాయకులు కోడి రమణ, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి, నాయకులు భాస్కర్, కృష్ణమూర్తి, సుమిత్రన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీకార్ల్ - ఏపీయూఎన్ఏ మధ్య ఒప్పందం

### పశుసంపద అభివృద్ధికి చేయి కలపనున్న రెండు సంస్థలు



ప్రజాభూమి, గుంటూరు

పశుసంపద అభివృద్ధి, పరిశోధన, సాంకేతిక సహకారం, యువత-మహిళా సాధికారత లక్ష్యంగా ఏపీకార్ల్, ఏపీయూఎన్ఏ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గుంటూరులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఏపీకార్ల్ సీఈఓ డా. వై. సింహాచలం, ఏపీయూఎన్ఏ ప్రతినిధి ఎల్. జయరాములు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఏపీకార్ల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. వి. శివ ప్రసాద్ పాల్గొన్నారు.ఒంగోలు జాతి ఆవులపై అత్యాధునిక పరిశోధనలకు, ఆఫ్రికా, రష్యా వంటి దేశాలతో భవిష్యత్ పరిశోధనలకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని ఏపీయూఎన్ఏ ప్రతినిధి జయరాములు తెలిపారు.

## వాకాడు మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### సీసీ రోడ్లకు శంకుస్థాపన.. పంచాయతీ, అంగన్వాడీ భవనాల ప్రారంభం





ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండల పరిధిలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు.నెల్లిపూడి, గూండ్లు గిరిజన కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా,తూపిలి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్వాడీ భవనాలను ప్రారంభించారు.నెల్లిపూడి, గూండ్లు గిరిజన కాలనీలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాలను వాకాడు సొసైటీ చైర్మన్ ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు.గ్రామాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో ప్రజలకు రాకపోకలకు మరింత సౌకర్యం కలుగుతుందని తెలిపారు.తూపిలి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సొసైటీ చైర్మన్ ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్ ఇరువురి చేతుల మీదుగా ప్రారంభించారు. అలాగే నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంజుల చేతుల మీదుగా ప్రారంభించారు.గ్రామంలో ప్రజలకు, చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ అభివృద్ధి కార్యక్రమాలన్నింటికీ టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. తూపిలి పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాన్ని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ద్వారకానాథ్ రెడ్డి స్వీయ పర్యవేక్షణలో చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మంజుల, తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయి ప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈఈ కిరణ్, వాకాడు సొసైటీ చైర్మన్ ఉచ్చూరు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, టీడీపీ నాయకులు పోలయ్య, మస్తాన్, మామిడి గోవిందయ్య, శ్రీనివాస్ రెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, టిడిపి మహిళ నాయకురాలు చిరంజీవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలే వైకాపాకు కొండంత అండ

### కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేసిన వైఎస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

కార్యకర్తలే వైకాపా పార్టీకి కొండంత అండ అని , కార్యకర్తల సంక్షేమమే వైసీపీ ప్రధాన ధ్యేయమని పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి అన్నారు.సోమవారం తన నివాసంలో కార్యకర్తలకు గుర్తింపు కార్డులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తల కృషి కీలకమన్నారు.ఐడీ కార్డు పొందిన ప్రతి కార్యకర్తకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. 5 లక్షల ఉచిత ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యకర్తలను ఆదుకునేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపాను భారీ మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

### - తహశీల్దార్ యు మధుసూదన్ రావు



ప్రజా భూమి

ప్రతినిధి,రామచంద్రాపురం

మండలంలో వివిధ సమస్యలపై ప్రజల నుండి పిజిఆర్ఎస్ కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని తహశీల్దార్ యు మధుసూదన్ రావు అన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, స్వర్ణ గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఫిర్యాదులను క్షేత్రస్థాయి, రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. మండలంలో నిర్వహించే రి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. రీ సర్వేలో స్వర్ణ గ్రామ సర్వేయర్లకు రైతుల నుండి ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. రిసర్వేలు తప్పులు తడకలు లేకుండా రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలన్నారు. ఈ సర్వేతోనే గ్రామాలలో భూ సమస్యలకు చెక్ పెట్టి, భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. మ్యుటేషన్, కులము, ఆదాయము, నివాస ధ్రువ పత్రాల దరఖాస్తుల మంజూరు పై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, కబ్జాలపై ప్రత్యేక నిఘా పెట్టి ప్రభుత్వ భూములపరిరక్షణకు వీఆర్వో కృషి చేయాలన్నారు. మండలంలో వీఆర్వోలేని రెవెన్యూ గ్రామాలకుఇన్చార్జిలుగా నియమించిన విఆర్వోలుతప్పకుండా విధులు నిర్వహించాలని లేకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అన్వర్ భాష, వీఆర్వోలు జి రాజశేఖర్, శ్రీను, మల్లికార్జున్ రెడ్డి, ఝాన్సీ, నరసింహులు, ప్రదీప్ నాయుడు, వెంకటరమణ, స్వర్ణ గ్రామ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చదలవాడ సుచరితకు ప్రెస్ క్లబ్ సభ్యుల సన్మానం

### మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కారం



ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట

నాయుడుపేట ప్రెస్ క్లబ్ సభ్యులు సోమవారం ఉదయం చదలవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చదలవాడ సుచరితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రెస్ క్లబ్ సభ్యులు ఆమెను ఆత్మీయంగా పలకరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు

## బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములు చేసింది తెదేపానే -ఎమ్మెల్యేలు

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

బీసీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసింది తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వమేనని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్ మోహన్, కె.మురళీమోహన్ లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని, ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అయితే బీసీలకు రాజ్యాధికారం దక్కకూడదనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. సోమవారం సాయంత్రం చిత్తూరు ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్ లో కూటమి పార్టీల నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైకాపా పార్టీ పైకి బీసీలపై కపట ప్రేమను చూపిస్తూ.. లోపల బీసీలకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి రాజ్యాంగ పదవులను ఇచ్చింద తెదెపా, కూటమి ప్రభుత్వమేనన్నారు.ఎవరు ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు సృష్టించినా బీసీలకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని.. ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. న్యాయపరంగా ఉన్న ప్రతి అవకాశాన్ని ఉపయోగించి బీసీలకు న్యాయం జరిగేలా చూస్తామని , వైసీపీ హయాంలో 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టివేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లకుండా బీసీలకు చారిత్రాత్మక ద్రోహం చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న మా సంకల్పం మారదని, బీసీలకు న్యాయం జరిగే వరకు కృషి చేస్తామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతుందనే కుట్రతో గొడ్డలి పార్టీ నేతలు న్యాయస్థానంలో పిటిషన్లు వేసి బీసీలకు తీరని ద్రోహం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం ఇవ్వకపోవడం వల్ల 16,800 మంది పదవులు కోల్పోయారని, ఇప్పుడు కూడా పదవులు రాకూడదన్న కుట్రతో కోర్టుకు వెళ్లి నిస్సిగ్గుగా అడ్డుకున్నారన్నారు.

## వృద్ధుల ముఖాల్లో చిరునవ్వే నిజమైన ఆనందం: బొజ్జల బృందమ్మ

### అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శివనాథపురం వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం



ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు

వయసు పైబడిన వృద్ధులను ఆదరించడం, వారికి ప్రేమాను రాగాలను పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బొజ్జల బృందమ్మ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తొట్టంబేడు మండలం శివనాథపురం గ్రామంలోని అమ్మ అనాథ మహిళా వృద్ధాశ్రమంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొజ్జల బృందమ్మ వృద్ధుల సంక్షేమం, వారి ప్రాధాన్యతపై ఆకట్టుకునేలా ప్రసంగించారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు అమ్మలాంటి నీడను అందిస్తూ, ఆప్యాయతతో ఆదరిస్తున్న ఆశ్రమ నిర్వాహకుల సేవలను ఆమె అభినందించారు. పెద్దల అనుభవాలు సమాజానికి ఎంతో విలువైన మార్గదర్శకాలని ఆమె పేర్కొన్నారు. వృద్ధులను గౌరవించడం, వారి అవసరాలను గుర్తించి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. వృద్ధుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడమే నిజమైన ఆనందమని అన్నారు. అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వృద్ధులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులు బొజ్జల బృందమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
పోలవరం
మంగళవారం, అక్టోబర్ 06, 2026


# చింతూరు ఐటీడీఏ పరిధిలో ఫస్ట్ క్లాస్ కోర్టు ఏర్పాటు చేయాలి



## అఖిలపక్షాల ఏకగ్రీవ తీర్మానం

ప్రజాభూమి ప్రతినిధి కూనవరం

మండల కేంద్రంలో అఖిలపక్షాల ఆధ్వర్యంలో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. పోడియం అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో చింతూరును కేంద్రంగా చేసుకుని ఫస్ట్ క్లాస్ కోర్టు, అడిషనల్ కోర్టు, మొబైల్ కోర్టు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు, న్యాయవాదులు, పాత్రికేయులు ఏకగ్రీవంగా తీర్మానించారు.చింతూరు ఐటీడీఏ పరిధిలోని నాలుగు మండలాల్లో వివిధ ప్రభుత్వ కార్యాల యాలు ఉన్నప్పటికీ, కోర్టు సౌకర్యం అందు బాటులో లేకపోవడంతో ప్రజలు న్యాయపరమైన అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని సమావేశంలో పేర్కొన్నారు. దీంతో ప్రజలకు సమయం, ఆర్థిక భారం పెరగడంతో పాటు ముఖ్యంగా గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని చింతూరు కేంద్రంగా ఫస్ట్ క్లాస్ కోర్టుతో పాటు అవసరమైన మేరకు అడిషనల్ కోర్టు, మొబైల్ కోర్టు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేసి, చింతూరు ఐటీడీఏ పరిధిలో కోర్టుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో యడవల్లి భాస్కర్ రావు, సున్నం వెంకటరమణ, నోముల రామారావు, దాసరి నరేంద్ర, ఆలూరి కోటయ్య, కుంజా అనిల్, మచ్చ వినయ్ ప్రసాద్,పదముత్యం ప్రతాప్, జుత్తుక సూర్యచందరరావు,మోసం సంజీవరావు, సోడే ముత్తయ్య, శ్రీమంతుల సతీష్, శ్రీమంతుల వెంకటరమణ, కరక రాజ్ కుమార్,కరక పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రామవరంపాడులో అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమం



ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం. ఐసిడిఎస్ కూనవరం ప్రాజెక్ట్ సీడీపీఓ వి మల్లిక ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవ్ కార్యక్రమంలు జరుగుతున్న నేపధ్యంలో ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కుందులూరు సెక్టార్ రామవరంపాడు అంగన్వాడీ కేంద్రంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ ఏ నయోమిరాణి మాట్లాడుతూ ఈ మాసం లో ఐసిడిఎస్ అందించే సేవలు గురించి వివిధ కార్యక్రమాల ద్వారా రక రకాల ఆక్టివిటీస్ ద్వారా గ్రామాలలో తల్లులుకు, గ్రామస్తులకు అవగాహన కల్పించామన తెలిపారు.

స్కూల్ హెచ్ఎం సోడే రమేష్ అంగన్వాడీల ద్వారా అందించే విలువైన పోషకారం తీసుకొని తల్లులు, పిల్లలు ఆరోగ్యం గా ఉండాలి అని తల్లులు కు సూచనలు ఇచ్చారు. గ్రామపెద్ద కుంజా చిన్న ముత్తయ్య 1980 సంవత్సరం నుండి జొన్నలు పండించి, జొన్నలు తింటున్నాను. నాకు 75 సంవత్సరాలు వయస్సు అయినా నేను ఆరోగ్యంగా వున్నాను, కావున తల్లులు చిరు ధన్యాలు తిని ఆరోగ్యంగా ఉండి ఆరోగ్యవంతమైన బిడ్డలను ఈ సమాజానికి ఇవ్వాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో యూత్ కమిటీ మెంబెర్ కుంజా నాగేశ్వరావు, తల్లులు గ్రామస్తులు, కిశోరి బాలికలు కుందులూరు సెక్టార్ అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాలువ ఒడ్డున మృతదేహం..

## హత్యగా తేల్చిన పోలీసులు!

❖ ఆస్తి వ్యవహారంలో విభేదాలే కారణమా?..
❖ మద్యం పేరుతో పిలిచి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి ముగ్గురు అరెస్టు..
❖ రంపచోడవరం డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు

రాజవొమ్మంగి ప్రజాభూమి

గ్రామ శివారులోని కాలువ ఒడ్డున మృతదేహం.. ఎవరిది, అక్కడికి ఎలా వచ్చింది అన్నదానిపై మొదలైన ఆరా చివరకు హత్యకేసును బయటపెట్టింది. రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 32 ఏళ్ల కోరుప్రోలు వీరబాబు హత్యకు గురైనట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పూడ్చిపెట్టిన ప్రాంతాన్ని గుర్తించి వెలికితీయడంతో ఘటన వెనుక ఉన్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.వీరబాబు కొంతకాలంగా అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం ఏఎల్పురంలో తన మేనమామ చిటికెల రాంబాబు వద్ద ఉంటూ ఆయన పాన్షాపులో పనిచేస్తున్నాడు.

రాంబాబుకు పిల్లలు లేకపోవడంతో ఆయన ఆస్తికి సం బం ధించిన వ్యవహారం కుటుంబంలో విభేదాలకు దారితీసినట్లు దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వీరబాబుకు, వట్టిగెడ్డకు చెందిన పల్లి శ్రీనివాసరావుకు మధ్య వివాదాలు ఉన్నట్లు తేలింది.సెప్టెంబర్ 28, 29 తేదీల మధ్య రాత్రి వీరబాబు వట్టిగెడ్డకు వచ్చిన సమయంలో పరిచయస్తులతో కలిసి మద్యం సేవించేందుకు వెళ్లాడు. అక్కడే అతడిపై దాడి జరిగినట్లు దర్యాప్తులో బయటపడింది. కత్తులతో పొడిచి, కర్రతో కొట్టడంతో వీరబాబు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.అంతటితో ఘటన ఆగలేదు. మృతదేహాన్ని అక్కడే వదిలిపెట్టకుండా తాడుతో సమీపంలోని కాలువ ఒడ్డుకు తరలించారు. అక్కడ గొయ్యి తీసి పూడ్చిపెట్టారు. దీంతో వీరబాబు కనిపించకుండా పోయిన విషయం కొంతకాలం బయటకు రాకుండా చేయాలని ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు.వీరబాబు ఆచూకీ లేకపోవడంతో ఆందోళనకు గురైన మేనమామ చిటికెల రాంబాబు రాజవొమ్మంగి పోలీసు లను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ప్రారంభిం చారు. అనుమానాలు ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించి చివరకు కాలువ ఒడ్డున పూడ్చిన మృతదేహా న్ని గుర్తించారు. తహసీల్దార్ సమక్షంలో వెలికితీసి పంచనామా నిర్వహించారు.

దర్యాప్తులో లభించిన ఆధారాలను పరిశీలిస్తూ ముందుకు సాగారు.కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పోలవరం జిల్లా ఎస్పీ మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. రంపచోడవరం డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగింది. నిందితుల కదలికలపై సమాచారం సేకరించిన పోలీసులు వట్టిగెడ్డకు చెందిన పల్లి శ్రీనివాసరావు, పల్లి శ్రీరామమూర్తి, గొల్లి అప్పలనాయుడులను అక్టోబర్ 4న సాయంత్రం బోయపాటి జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.అరెస్టు చేసిన ముగ్గురినీ సోమవారం అడ్డతీగల జేఎఫ్సీఎం కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించారు. రాజవొమ్మంగి పోలీస్స్టేషన్లో క్రైమ్ నంబర్ 58/2026గా కేసు నమోదైంది. బీఎన్ఎస్ 103(1), 238, 3(5) సెక్షన్ల కింద దర్యాప్తు కొనసాగుతోంది.నిందితులుగా పల్లి శ్రీనివాసరావు (38), పల్లి శ్రీరామమూర్తి (40), గొల్లి అప్పలనాయుడు (34) ఉన్నారు. మృతుడు కోరుప్రోలు వీరబాబు వయసు 32 సంవత్సరాలు.





# అడ్డతీగలలో పలుచోట్ల వర్షం

## పంటలకు ఊరట.. ఆనందం వ్యక్తం చేసిన రైతులు

ప్రజాభూమి ప్రతినిధి అడ్డతీగల

మండలంలో సోమవారం సాయంత్రం పలుచోట్ల వర్షం కురిసింది. ఆలస్యంగా వర్షాలు కురుస్తుండటంతో ఏజెన్సీ ప్రాంత రైతుల్లో కొంత ఆశలు చిగురించాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది వరి సాగుకు పలువురు రైతులు దూరమయ్యారు.

కొందరు రైతులు పత్తి, వంకాయ, మినుములు తదితర ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తున్నారు.తాజాగా కురిసిన వర్షంతో ఆయా పంటలకు కొంతమేర ప్రయోజనం కలుగుతుందని రైతులు తెలిపారు. ముఖ్యంగా వర్షాధార పంటలకు ఈ వాన ఊరటనిస్తుందని, పంటల ఎదుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆలస్యమైనా వర్షాలు కురవడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# కృపా భారతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విస్తరిస్తున్న ప్రజాసేవలు



❖ వి ఆర్ పురం,చింతూరు కూనవరం మండలాల్లో 300 వందల రేడియోలు పంపిణీ ❖ గత వరంలో 150 వాటర్ ఫిల్టర్స్ పాస్టర్స్ కు ఉచిత పంపిణీ ❖ పేద పిల్లలు 40 మందికి ప్రతి రోజు ఉచిత ట్యూషన్,ఉచిత భోజనం ❖ కృపా భారతి చారిటబుల్ ట్రస్టు పేదల పట్ల చేస్తున్న సహాయక చర్యలు

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం. పోలవరంజిల్లా వి ఆర్ పురం మండలంలోనీ కృపా భారతి చారిటబుల్ ట్రస్టు సంస్థ పేద ప్రజల మధ్య ఎన్నో సహాయక కార్యాలు చేస్తూ సమాజంలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించింది. గత కొంత కాలంగా పేద ఆనాద పిల్లల పట్ల ఎంతో శ్రద్ధ చూపుచు ఉచిత ట్యూషన్ తో పాటు ప్రతి రోజు భోజనం పెట్టి పిల్లలకి మంచి చేస్తున్నారు. విద్యార్థులకు పుస్తకాలు పెన్నాలు, నోట్ బుక్స్, పెడ్స్, పెన్సిల్స్ చాక్ మరలు సహాయం చేస్తు న్నారు. అక్కడితో ఆగలేదు వాతావరణ ప్రభావం వలన ఏజెన్సీ లో కలుషిత నీళ్లు త్రాగ టం వలన డెంగు మలేరియా టైఫాడ్ వంట్టి జ్వరాలు వస్తున్నాయని చింతూరు డివిజన్ లో ఉన్న పాస్టర్స్ 150 మందికి వాటర్ ఫిల్టర్స్ ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే కూనవరం చింతూరు వి ఆర్ పురం, ఏటపాక మండలాల్లో ఉన్న దేవునీ సంఘులలో 300 మందికి అడియో రేడియో బైబిల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. ఇవి చదువు లేని వారికి చదువు కున్న వారికి బాగా ఉపయోగా పెడతాయి పొలాలలో మరియు, వంట చేసుకుంటూ ఇతర పనులు చేసుకుంటూ వినటానికి ఎంతో వీలుగా ఉంటుంది. బైబిల్ పట్టుకుని చూస్తూ ఒకే చోట ఉండి చదివేదాని కంటే ఇది చాలా బాగుంది అంటూ సంఘ విశ్వ సులు సంతోషించారు. కృపా భారతి చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ రెవరెండ్ కె కృపారావు మాట్లా డుతూ మా ట్రస్ట్ కి ఇప్పటివరకు విదేశ స్వదేశం సంస్థల నుండి ఎలాంటి ఫండింగ్ లేదు. ఎవరైనా సేవ సహకారాలు చెయ్యాలి అనుకుంటు న్నారా మమ్ములను సంప్రదించండి పేద విద్యార్థులకు, పేద ప్రజలకు మేము చేసేది చాలా తక్కువ అని బావిస్తున్నాము. మన ప్రాంతమే కాదు ఏజెన్సీలో అన్ని చోట్లా పేదవారు ఉన్నారు సరైన వసతులు లేక, సరైన వస్త్రాలు లేనివారు, సరైన జీవన విధానం లేక ఇబ్బందులు పడే పేద ప్రజలు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారికి నా వంతు సహాయక చర్యలు చేపట్టాలని సేవ దృక్పథంతో ఉన్నానని ఆయన తెలిపారు. కృపా భారతి చారిటబుల్ ట్రస్టు సంస్థ ద్వారా లబ్ది పొందుకున్న ప్రజలు, పాస్టర్స్, విశ్వాసులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.







# తండ్రి పేరు ఆ బాలల భవిష్యత్తుకు ఆటంకం కాకూడదు




❖ బెంగుళూరులో జరిగే సమావేశానికి ఉండవల్లి గాంధీబాబు ❖ బాలల హక్కులకు విఘాతంలా మారిన తండ్రి గుర్తింపు సమస్య ❖ జాతీయ స్థాయిలో చర్చించాల్సిన సమయం వచ్చింది

ప్రజాభూమి, ప్రతినిధి, వి.ఆర్.పురం.

తండ్రి పేరుతో గుర్తింపు పత్రాలు కొందరు చిన్నారులకు అవసరం లేదన్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ సభ్యులు ఉండవల్లి గాంధీబాబు, ఇదే అంశంపై ఈ నెల 7న బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి సమావేశానికి హాజరుకానున్నానని వెల్లడించారు. కర్ణాటక న్యాయ సేవల ప్రాధికార సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తనకు ఆహ్వానం అందిందన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇది జాతీయ స్థాయిలో కొందరు చిన్నారులు ఎదర్కొంటున్న సమస్య అని వివరించారు. దేశ వ్యాప్తంగా కొందరు చిన్నారులకు జనన ధృవీకరణ పత్రం, గుర్తింపు, పేరు, విద్య వంటి విషయాల్లో తండ్రి పేరు పెద్ద ఆటంకంగా మారిందన్నారు. తండ్రి పేరు ఏంటన్న ప్రశ్నకు కొంతమంది చిన్నారుల్లో సమాధానం దొరకని ప్రశ్నగా మారడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. వేశ్య వృత్తిలో ఉన్న మహిళలు, పెళ్లికి ముందే గర్భం దాల్చిన యువతులు, కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో సదరు తల్లులు తండ్రి పేరు చెప్పడానికి ఉన్న అభ్యంతరాలు సామాజంలో సర్వసాధారణంగా మారాయన్నారు. ఇటువంటి బాలలు తమ భవిష్యత్తుకు అవసరమైన తొలి అడుగు వేసే సమయంలోనే "నీ తండ్రి ఎవరు" అన్న ప్రశ్న దగ్గర ఆగిపోతున్న పరిస్థితులు ఉండటం విచారకరమన్నారు. ఇటువంటి చిన్నారులకు స్కూల్ రికార్డులు, దరఖాస్తులు, గుర్తింపు పత్రాలు, ప్రభుత్వ పథకాలు వంటి అంశాలతో పాటు, చట్టం అడిగిన చోట కూడా తండ్రి పేరు ఉండాలా అన్న ప్రశ్న అనేక మంది చిన్నారుల జీవితాలను చీకటిలోకి నెట్టి వేయడం ఆవేదన కలిగించే అంశం అని అభిప్రాయపడ్డారు.

సదరు చిన్నారుల పుట్టుక విషయంలో తల్లిదండ్రుల పరిస్థితి కారణంగా వారు భవిష్యత్తును నష్టపోకూడదని బాలల హక్కులు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. తండ్రి పేరు లేదన్న కారణంగా ఏ చిన్నారికి తాను పొందాల్సిన హక్కులు కొల్పోవడం సరికాదని మన రాజ్యాంగం స్పష్టం చేస్తుందన్నారు. ఇదే అంశాన్ని దేశ అత్యన్నత న్యాయం స్థానం అనేక సందర్భాల్లో తీర్పుల ద్వారా తేటతెల్లం చేసిందన్నారు. మన దేశం విద్యా హక్కు చట్టం ద్వారా ప్రతీ చిన్నారి విద్యనభ్యసించాల్సిన అవశ్యకత ఉందన్నారు. దీనికి తండ్రి గుర్తింపు అవసరం లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతీ వ్యవస్థపైన ఉందని స్పష్టం చేసారు. తండ్రి పేరు తప్పరి సరీ చేయడం వల్ల సదరు చిన్నారులు సామాజంలో తీవ్రమైన వివక్షను ఎదుర్కొంటారని తెలిపారు. దేశంలో అనేక మంది చిన్నారులు ఇటువంటి సమస్యను ఎదుర్కొంటున్న నేపథ్యంలో దీనికి శాస్వత పరిష్కారం చూపించాల్సిన తక్షణ అవసరం ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాలో గిరిజన యువతులను మోసం చేసిన ఘటనలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారం నిమిత్తం గిరిజన ప్రాంతాలకు వచ్చే కొందరు వ్యక్తులు గిరిజన యువతులను పెళ్లి చేసుకుని కొంత కాలం తరువాత ముఖం చాటేసిన అనేక ఘటనలు ఉన్నాయన్నారు. సుమారు 270 మంది యువతులు గర్భం దాల్చారని, వారి పిల్లలు సామాజంలో పడుతున్న అవస్థలు చూసి తాను నిర్వహిస్తోన్న అగ్రికల్చర్ అండ్ సోషల్ డెవల్మెంట్ ఎన్జీఓ ద్వారా వారికి చట్ట బద్ధంగా భరోసా కల్పించడం జరిగిందన్నారు. ఇటువంటి ఘటనలపై తనకు అవగాహన ఉండటంతోనే తనను బెంగుళూరు ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ నెల 7 న బెంగుళూరు లో జరిగే సమావేశంలో తన దగ్గర ఉన్న సమాచారాన్ని అన్ని రాష్ట్రాల ప్రతినిధుల దృష్టికి తీసుకువెళతానని స్పష్టం చేసారు. రాజ్యాంగం లో బాలల హక్కులు, సుప్రీం కోర్టు తీర్పు తదితర అంశాలను సమావేశంలో వివరించనున్నట్టు తెలిపారు. తండ్రి గుర్తింపు వల్ల అనేక మంది చిన్నారులు భవిష్యత్తు ప్రశ్నార్థకం కాకూడదని, బాలల హక్కులపై అవగాహన ఉన్న తాను పూర్తిగా ఇటువంటి దురాచారాన్ని రూపు మాపేందుకు కృషి చేస్తానని ఉండవల్లి గాంధీబాబు వెల్లడించారు.

# విద్యుత్ చోరీ జరుగుతున్న పట్టీ పట్టనట్టు ఉంటున్నఅధికారులు

## టు ఫేస్ విద్యుత్తును త్రీఫేస్ గా మారుస్తున్న చోద్యం చూస్తున్న అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి కూనవరం మండలంలోని విద్యుత్తు అధికారుల అత్యుత్సాహం రోజురోజుకు సామాన్యుల పాలిట భారంగా మారుతుంది 2 పేస్ కరెంటును కెపాసిటర్లు వాడి 3ఫేస్ కరెంటుగా మార్చి ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం కలుగుతుంటే ఆ వైపు కూడా కన్నెత్తి చూడని అధికారులు సామాన్యుల కరెంటు బిల్లు కట్టడం ఆలస్యమైతే మాత్రం వెంటనే వచ్చి విద్యుత్ కనెక్షన్లు నిర్ధాక్షణంగా కట్ చేస్తున్నారు అదేమని ప్రశ్నిస్తే కరెంట్ బిల్లు కట్టకపోతే ఇలాగే కట్ చేస్తామని దురుసు సమాధానం చెప్పడంతో సామాన్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు బిల్లులు బకాయిలు ఉన్న బడా బాబులకు మాత్రం ఈ సూత్రం వర్తించేలా లేదు అమాయక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కరెంటు అధికారులకు సిబ్బందిపై చర్యలు తీసుకునేలా జిల్లా కలెక్టర్ ని ఫిర్యాదు చేస్తామని ఎమ్మార్పీఎస్ నాయకుడు మారపాక శీను సోషల్ మీడియా గా తెలియజేశారు.

# 17 నెలల పెండింగ్ జీతాలు విడుదల

ప్రజాభూమి,ప్రతినిధి,అడ్డతీగల

లాగరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 17 నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న ఫార్మసిస్ట్ దీపికకు పెండింగ్ జీతాలు విడుదల కావడం హర్షణీయమని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ పోలవరం జిల్లా అధ్యక్షురాలు పి. సత్యవతి తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పలుమార్లు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, రంపచోడవరం డీఎంహెచ్ఓ, కాకినాడ డీఎంహెచ్ఓ, అల్లూరి సీతారామరాజు జిల్లా డీఎంహెచ్ఓల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. సంఘం ప్రతినిధుల కృషితో పాటు రాష్ట్ర నాయకత్వం జోక్యంతో సంబంధిత అధికారులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో దీపికకు ఐడీతో కూడిన జీతభత్యాలు చెల్లించడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు అన్యాయం జరిగినప్పుడు సంఘం తరపున పోరాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఇంకా పెండింగ్లో ఉన్న మరో ఫార్మసిస్ట్కు పూర్తి జీతభత్యాలు చెల్లించడంతో పాటు ఐడీ, పోస్టు ఉన్న మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేయాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్కు వినతిపత్రం సమర్పించినట్లు పి. సత్యవతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. యోహాన్, కార్యదర్శి బి. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిప్రెన్యూర్‌షిప్, ఆధునిక సాంకేతికతపై ప్రత్యేక దృష్టి



❖ జిల్లా సామర్థ్యాలకు అనుగుణంగా ఆర్థిక వృద్ధికి అడుగులు.. ❖ అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో కీలకపాత్ర పోషించనున్న ఎన్‌టీఆర్ జిల్లా ❖ అన్ని శాఖల్లో సామర్థ్యాల సద్వినియోగం అత్యంత కీలకం ❖ ప్రణాళిక రూపకల్పన సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో అమరావతి ఎకనమిక్ రీజియన్ (ఏఈఆర్) కీలకపాత్ర పోషించనుందని.. పారిశ్రామిక రూపురేఖలు పూర్తిగా మార ను న్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నా రు. అమరావతి ఎకనమిక్ రీజియన్‌లో ఎన్‌టీ ఆర్ జిల్లా చురుకైన పాత్ర పోషించగలదని ఆకాం క్షించారు. నవ్య రాజధాని అమరావతిని ప్రపంచ స్థా యి నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, దాని చు ట్టూ ఉన్న జిల్లాలను అనుసంధానిస్తూ అమరా వతి ఎకనామిక్ రీజియన్ పేరుతో భారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి రాష్ట్ర ప్రభు త్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో భాగంగా మేధోమ థన చర్చలు, వర్క్‌షాప్‌లు జరుగు తున్నాయి. ఇందులో భాగంగా సోమ వారం జిల్లా కలెక్టరే ట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో ఏఈఆర్ ప్రణాళికపై జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఇందు లో ఎల్ఈఏ అసోసియేట్స్ (ఏఈఆర్‌పీ) బృంద సభ్యులతో పాటు ప్రణాళిక, పరిశ్రమలు, ఏపీఐఐసీ, వ్యవసాయం, అనుబంధ రంగాలు తదితర శాఖల అధికారులు హాజరుకాగా ఎన్‌టీఆర్, కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాల తో కూడిన అమరావతి ఎకనమిక్ రీజియన్ ప్రణాళిక రూపకల్పనలో భాగంగా ఎన్‌టీఆర్ జిల్లాలో సుస్థిర ఆర్థిక వృద్ధికి ఉన్న కీలక అవకాశాలపై చర్చించారు. హైటెక్ వ్యవసాయంతో పాటు క్వాం టం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికత అనుబంధ వృద్ధికీ అవకాశముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. జిల్లాలో సేవా రంగం ఆర్థిక రంగంలో కీలకపాత్ర పోషిస్తోందని.. తొలి సవరించిన అంచ నాల ప్రకారం వర్తమాన ధరల వద్ద 2024-25 జీవీఏలో వ్యవసాయ రంగం వాటా 12 శాతం, పారిశ్రామికరంగం వాటా 21 శాతం కాగా సేవా రంగం వాటా 67 శాతంగా ఉందన్నారు. జిల్లా లో నేచురల్ ఫార్మింగ్‌తో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ అభివృద్ధికీ పుష్కల అవకాశాలున్నాయన్నారు. ఇప్పటికే జిల్లాలో 40 వేల మందికి పైగా ప్రకృతి సేద్యాన్ని అనుసరిస్తున్నట్లు వివరించారు. ఏడు నియోజ కవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చురుగ్గా అడుగులు పడుతున్నా యన్నా రు. ఇన్వెస్టర్స్ డెస్క్, ల్యాండ్ బ్యాంకు చొరవతో పెద్దఎత్తున పెట్టుబడులను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐటీ, ఐటీఈఎస్ భవిష్యత్తు పరిశ్రమల అవసరాలకు అనుగు ణంగా యువతలో నైపు ణ్యాల వృద్ధికి మరింత చొరవ చూపాల్సిన అవసరముందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న పరిశ్రమలు, ప్రతిపాదిత ప్రాజెక్టులు, జిల్లా దార్శ నిక ప్రణాళిక, సామాజిక ఆర్థిక నివేదిక, విపత్తు నిర్వహణ ప్రణాళికపైనా చర్చించారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, ప్రైవేటు రంగ భాగస్వామ్యం, స్థానిక వనరుల సమర్థ వినియోగం ద్వారా సుస్థిరమైన, సమగ్ర ఆర్థిక వృద్ధికి బాటలు వేయవచ్చని తద్వారా ఏఈఆర్‌లో కీలక ప్రాంతంగా జిల్లాను నిలబెట్టవచ్చని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఖరీఫ్ ధాన్యం సేకరణకు పటిష్ట ప్రణాళిక

**రైతులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**బ్యాంకు గ్యారంటీలు, గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలు సిద్ధం చేసుకోవాలి : జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్**

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి :
కృష్ణా జిల్లాలో ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ ప్రక్రియను పటిష్ట ప్రణాళికతో చేపట్టి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా బ్యాంకు మేనేజర్లు, రైస్ మిల్లర్లతో జాయింట్ కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు సమర్పించాల్సిన ఎలక్ట్రానిక్ బ్యాంకు గ్యారంటీలు (ఈ-బీజీలు), వాటి సమర్పణలో ఎదురవుతున్న సమస్యలు, బ్యాంకు గ్యారంటీల మంజూరుకు అవసరమైన పత్రాలు, బ్యాంకు ఛార్జీలపై చర్చించారు.ఈ-బీజీల మంజూరులో సమస్యల పరిష్కారంపైచాలిగ్రామీణ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రైస్ మిల్లులు ఉన్నందున, మిల్లర్లకు చెందిన వ్యవసాయ భూములను బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా భద్రతగా పరిగణించి బ్యాంకు గ్యారం టీలు మంజూరు చేసే అవకాశాలను పరిశీలించాలని మిల్లర్లు కోరారు. ఈ-బీజీలకు అన్ని బ్యాంకులు ఒకే విధమైన సేవాఛార్జీలు విధించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీందర్ తెలిపారు.కో-ఆపరేటివ్ బ్యాంకుల్లో ఈ-బీజీ సదుపాయంకృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంకు పరిధిలో ప్రస్తుతం ఎలక్ట్రానిక్ బ్యాంకు గ్యారంటీ సదుపాయం అందుబాటులో లేదని సమావేశంలో అధికారులు తెలిపారు. ధాన్యం సేకరణలో ఈ-బీజీలు కీలకమైనందున, కో-ఆపరేటివ్ బ్యాంకు సాఫ్ట్‌వేర్‌లో ఈ సదుపాయాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.గోనె సంచులు, హమాలీలు సిద్ధంగా ఉంచాలిధాన్యం సేకరణ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో రైస్ మిల్లర్లు తమకు అవసరమైన ఈ-బీజీలను ఎలాంటి జాప్యం లేకుండా సమర్పించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ధాన్యం సేకరణ సమయంలో గోనె సంచుల కొరత లేకుండా ముందుగానే సమకూర్చుకోవాలని, ప్రతి రైస్ మిల్లు వద్ద అవసరమైన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వాహనాల నిరీక్షణకు చెక్రెట్టు ధాన్యాన్ని తీసుకొచ్చే వాహనాలు రైస్ మిల్లుల వద్ద ఎక్కువసేపు వేచి ఉండకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. వాహనాల రద్దీ, నిరీక్షణ సమయాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు.రైస్ మిల్లర్లు, ఇతర వాహన యజమానుల వద్ద అందుబాటులో ఉన్న వాహనాలను ధాన్యం సేకరణకు అనుసంధానం చేసి, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రారంభమయ్యే నాటికి అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.రైతులకు సకాలంలో సేవలు అందించాలిఖరీఫ్ 2026-27 సీజన్‌లో ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం, పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ శాఖ, బ్యాంకులు, రైస్ మిల్లర్లు, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యాన్ని సకాలంలో సేకరించేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.ధాన్యం సేకరణలో జాప్యం, వాహనాల నిరీక్షణ, గోనె సంచులు, హమాలీల కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు."రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించడం, వారికి సకాలంలో సేవ లు అందించడం జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యం. ఈ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి" అని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి టి. శివరామ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జి. వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీందర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, కృష్ణా జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు పిన్నమనేని వీరయ్య, సంఘం ప్రతినిధులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు ఆయిల్ కార్డుల పంపిణీ

మచిలీపట్నం, ప్రజాభూమి ప్రతినిధి:
మచిలీపట్నం మండలం పెద్దకానూరు గ్రామంలో బోటు యజమానులకు సోమవారం ఆయిల్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 50 మంది బోటు



యజమానులకు ఆయిల్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్యకారులకు ఒక్క లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. మోటరైజ్డ్ బోట్లకు నెలకు 300 లీటర్ల వరకు డీజిల్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల భృతిని అందిస్తున్నట్లు తెలిపారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ బండి వీరస్వామి, పీత రాము, బొమ్మిడి పెద్ద ఏడుకొండలు, బోటు యజమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జడ్డంగి శివారులో పశువుల అక్రమ తరలింపు

## 9 పశువులు స్వాధీనం.. ఇద్దరు అదుపులో

రాజవొమ్మంగి ,ప్రజా భూమి
జడ్డంగి గ్రామ శివారులో సోమవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు గుర్తించి అడ్డుకున్నారు. మహీంద్రా బొలెరో మ్యాక్స్ వాహనం నంబర్ ఏపీ 39 డబ్ల్యూఎక్స్ 3599లో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న 6 గేదెలు, 3 దున్నపోతులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వాహనంలో ఉన్న నూజివీడుకు చెందిన ఎపుచర్ల




నవీన్ కుమార్ (27), పులి అభిషేక్ (26)లను అదుపులోకి తీసుకున్నారు. పశువుల రవాణాకు సంబంధించిన చెల్లుబాటు అయ్యే పత్రాలతో పాటు వెటర్నరీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను వారు చూపించలేకపోయినట్లు పోలీసులు తెలిపారు. పశువులను తగినంత స్థలం లేకుండా ఇబ్బందికర పరిస్థితుల్లో తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.స్వాధీనం చేసుకున్న 9 పశువులను అడ్డతీగల మండలం పులిగోగులపాడు గ్రామంలోని గోశాలకు తరలించి భద్రపరిచారు. నిబంధనలకు విరుద్ధంగా పశువుల రవాణాకు పాల్పడితే, పశువులపై క్రూరత్వానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జడ్డంగి పోలీసులు హెచ్చరించారు.




# దేశాయిపేట టిడ్కో కాలనీలో ఉచిత వైద్య శిబిరం

మచిలీపట్నం, ప్రజాభూమి, ప్రతినిధి :
దేశాయిపేట టిడ్కో కాలనీలోని గోసంఘం ప్రాంగణంలో దావతే ఇస్లామీ ఇండియా ఆధ్వర్యంలోని గరీబ్ నవాజ్ రిలీఫ్ ఫౌండేషన్ (జీఎన్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్యారవీ షరీఫ్ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.శిబిరంలో 90 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా బీపీ, షుగర్‌తో పాటు రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గౌసే ఆజం రజియల్లాహు అన్హు వారి చిరస్మరణ సభ నిర్వహించారు.ఉచిత వైద్య శిబిరానికి అనుమతి, సహకారం అందించిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్ర మంలో పాల్గొన్న ముస్లిం మత గురువులు, ఇనుగుదురుపేట ఎస్ఐ సర్వర్ బేగ్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా తల్లిదండ్రులు, ప్రజలు అవగాహన కల్పించాలని సూచించారు.

# అవనిగడ్డ నియోజకవర్గంలో వైసీపీకి బిగ్ షాక్.. టీడీపీలోకి 40 కుటుంబాలు



❖ చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామానగరం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీకి గుడ్‌బై.. టీడీపీలో చేరిక ❖ స్థానిక ఎన్నికల వేళ టీడీపీ వైపు భారీగా చేరికలు..అవనిగడ్డ టీడీపీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న రామానగరం వైసీపీ నేతలు

ప్రజాభూమి ప్రతినిధి అవనిగడ్డ
అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లి మండలం లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామనగరం గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ విక్కుర్తి శ్రీనివాసరావు సమక్షంలో వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా విక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచి ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల సేవలను అభినందించారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి వేగం పుంజుకుందని విక్కుర్తి అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలను తీసుకురావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగవంతం కావడంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశ ఏర్పడుతోందని పేర్కొన్నారు.రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, సాగునీటి వనరులు, విద్య, వైద్యం వంటి రంగాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు.టీడీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు రామనగరంలో 40 కుటుంబాల చేరిక నిదర్శనమని విక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 ప్రాంతాల్లో సేవా సేతు అభియాన్ క్యాంపులు

**- పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ**
**- పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచన**

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:



పీఎం సూర్య ఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "సేవా సేతు అభి యాన్" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 4 సబ్ డివిజన్ల పరిధిలోని 15 ప్రాంతాల్లో సేవా సేతు అభియాన్ క్యాం పులు జరగనున్నాయి. ఈ సందర్భంగా సేవా సేతు అభియాన్ పోస్టర్‌ను కలెక్టర్ జి.లక్ష్మీశ సోమ వారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విద్యుత్ శాఖ అధి కారులతో కలిసి కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. అక్టోబర్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించే క్యాంపుల ద్వారా పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా గృహ వినియోగదారులు విద్యుత్ బిల్లులను తగ్గించుకోవడంతో పాటు స్వచ్ఛమైన, పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహించవచ్చని కలెక్టర్ అన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హత కలిగిన గృహ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30,000, 2 కిలోవాట్లకు రూ.60,000, 3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. ప్రత్యేక క్యాంపుల్లో ప్రజలకు పథకం అర్హతలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ ప్రక్రియ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు, నెట్ మీటరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, బ్యాంకర్లు, సోలార్ విక్రేతలు, విద్యుత్ శాఖ అధికారులు వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయనున్నారని.. అర్హత ఉన్న ప్రతి గృహ వినియోగదారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పథకానికి సంబంధించిన మరింత సమాచారం కోసం ఏపీసీపీడీసీఎల్ 1912 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ యు.హనుమయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, విశ్వేశ్వరప్రసాద్, రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో ప్రతిభ.. అవార్డుల్లో ప్రతిష్ఠ!

**- ఎన్‌టీఆర్ జిల్లాకు 69 జిల్లాస్థాయి పురస్కారాలు - ఘనంగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం - విజేతలకు 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వీఎంసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం అభినందనలు**



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:
విజయవాడలోని తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సోమవారం జిల్లా అధికార యం త్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. స్వచ్ఛ మునిసిపాలిటీలు, స్వచ్ఛ గ్రామపంచాయతీలు, స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్స్, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ అంగన్వాడీలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛ వసతిగృహాలు తదితర కేటగిరీల్లో మొత్తం 69 అవార్డులు లభించాయి. వీటిని 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వీఎంసీ ధ్యానచంద్ర విజేతలకు అందజేసి అభినందనలు తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలుచేస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన స్వచ్ఛ సైనికులను ప్రశంసించారు. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయంగా జిల్లా కలెక్టరేట్ అవార్డు సాధించగా కలెక్టర్ లక్ష్మీశ అవార్డును స్వీకరించారు. అదేవిధంగా స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయంగా వీఎంసీ ప్రధాన కార్యాలయం కూడా అవార్డును సొంతం చేసుకుంది. స్వచ్ఛ మునిసిపాలిటీగా తిరువూరు మునిసిపాలిటీ అవార్డును కైవసం చేసుకుంది. గంగ్రాయి, మైలవరం, గూడవల్లి, జూపూడి గ్రామపంచాయతీలు స్వచ్ఛ గ్రామపంచాయతీల కేటగిరీలో పురస్కారాలు పొందాయి. వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ స్టార్టప్స్ కేటగిరీలో సిసిర ఎలిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అవార్డును సొంతం చేసుకుంది.కార్యక్రమం సందర్భంగా 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల్లో స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యత ఉందని, గ్రామ స్వరాజ్యంతో పాటు దేశవ్యాప్తంగా పరిశుభ్రతను పాటించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ అంటే కేవలం ఓడీఎఫ్ సాధించడం మాత్రమే కాదని, పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యం, భద్రతకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర అంటే కేవలం పరిసరాల పరిశుభ్రత మాత్రమే కాదని.. పర్యావరణ పరిరక్షణ, నదులు, జల వనరులు, భూగర్భ జలాల సంరక్షణ, కాలుష్య నియంత్రణ కూడా అందులో భాగమేనని స్పష్టం చేశారు. పరిశుభ్రత లోపిస్తే అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రధాని వికసిత్ భారత్, ముఖ్యమంత్రి స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించాలంటే కేవలం జీడీపీ, ఆర్థిక గణాంకాలపై దృష్టిపెట్టడం మాత్రమే కాకుండా పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్యం, సహజ వనరుల సంరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**అక్టోబరు 8న రంపచోడవరం మండలంలో పర్యటన.. కాకవాడలో సభ, రాకోటలో రచ్చబండ**



రంపచోడవరం, ప్రజాభూమి
రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అక్టోబరు 8న పోలవరం జిల్లా రంపచోడవరం మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా ఎస్పీ కె. చక్రవర్తి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, రంపచోడవరం సబ్ కలెక్టర్ డొంక పృథ్వీ రాజ్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.కాకవాడలో ఉప ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా హెలిప్యాడ్, బహిరంగ సభ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లు, ప్రజలు వాహనాల రాకపోకలు, పార్కింగ్, ప్రవేశ నిష్క్రమణ మార్గాలను అధికారులు పరిశీలించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య, అగ్నిమాపక సదుపాయాలను కూడా ముందుగానే సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు.రాకోటలో నిర్వహించనున్న రచ్చబండ కార్యక్రమంలో గ్రామస్థులు తమ సమస్యలను నేరుగా తెలియజేసే అవకాశం ఉండడంతో సంబంధిత శాఖల అధికారులు శాఖల వారీగా సమస్యలను నమోదు చేసి, పరిష్కరించగల అంశాలపై తక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఉప ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ కె. చక్రవర్తి పోలీసు అధికారులకు సూచించారు.పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అక్టోబరు 7వ తేదీలోగా పూర్తి చేసి తుది స్థాయి తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటన విజయవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

మంగళవారం 6 అక్టోబరు 2026

# జగ్గిరెడ్డి నిద్రలోనూ నా పేరే తలుస్తున్నారు - ఎమ్మెల్యే బండారు

- నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మరు.. వైసీపీ నేతలకు ఎమ్మెల్యే సత్యానందరావు స్ట్రాంగ్ కౌంటర్.
- అసంపూర్తి భవనాలకు గత ప్రభుత్వ హయాంలోనే హడావుడిగా ప్రారంభోత్సవాలు.
- ఇందుపల్లి రోడ్డుపై వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి.



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

జిల్లా వైసీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి తన పేరును ప్రస్తావించకుండా ఉండలేకపోతున్నా రని, చివరకు నిద్రలో కూడా తన పేరే తలు స్తున్నట్లుగా ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బం డారు సత్యానందరావు ఘాటుగా విమర్శించా రు. నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. ఆత్రేయపురంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిర్మించి ప్రారంభించిన హెల్త్ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే సత్యానందరావు పరిశీలించారు. తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ పనులు పూర్తికాకముందే భవనాన్ని ప్రారంభించడం గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రస్తుతం భవనం ఫ్లోరింగ్ బీటలు వారిపోయి వినియోగానికి అనువుగా లేకుండా పోయిందని తెలిపారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాల విషయంలో ఇలాంటి నిర్లక్ష్యానికి బాధ్యత ఎవరిదో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందుపల్లి రోడ్డుపై వాస్తవాలు తెలుసుకోవాలి.అమలాపురం రూరల్ పరిధిలోని ఇందుపల్లి రోడ్డు నిర్మాణంపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే తిప్పికొట్టారు. బురద నేల, సాయిల్ కండిషన్ కారణంగా రహదారిలో కొంత మేర దిగబడిందని, విషయం గుర్తించిన వెంటనే కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించామని తెలిపారు. తన గోడౌన్ ఉన్న రోడ్డే అయినప్పటికీ గత 14 ఏళ్లుగా ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారి నిర్మాణం కోసం కృషి చేస్తున్నానని సత్యానందరావు చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక ఎమ్మెల్యేలతో మాట్లాడి రూ.1.20 కోట్లతో మొదటి విడత రోడ్డు పనులు చేపట్టామని తెలిపారు. ఇంకా రెండో విడత పనులు కూడా చేపట్టాల్సి ఉందన్నారు.

**మైక్ దొరికిందని ఇష్టానుసారంగా మాట్లాడొద్దు**

మైక్ దొరికిందని ఇష్టానుసారంగా మాట్లాడితే రాజకీయంగా ఉనికి కోల్పోయే పరిస్థితి వస్తుందని జగ్గిరెడ్డిని ఉద్దేశించి ఎమ్మెల్యే సత్యానందరావు వ్యాఖ్యానించారు. "కోతికి కొబ్బరికాయ దొరికితే ఏం చేయాలో తెలియక నెత్తిన బాదుకున్నట్లుగా జగ్గిరెడ్డి తీరు ఉంది" అంటూ ఘాటుగా విమర్శించారు. ఇందుపల్లి వెళ్లి స్థానిక ప్రజలను అడిగితే రహదారి నిర్మాణంపై వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని అన్నారు. ఆరోపణలు చేసే ముందు క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకుని, ఆలోచించి మాట్లాడాలని వైసీపీ నేతలకు ఎమ్మెల్యే సత్యానందరావు హితవు పలికారు.

## ఉపాధ్యాయ వృత్తి సమాజానికి దిక్సూచి

### ఉత్తమ ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ ఘన సన్మానం



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లపూడి ఏపీటీఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం పైడిమెట్ట మండల పరిషత్ బేసిక్ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా, నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.డి. రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న తాళ్లపూడి ఏపీటీఎఫ్ యూనిట్‌ను అభినందించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే అరుదైన అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన వారంతా ధన్యులని పేర్కొన్నారు.ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు సమాజానికి, దేశానికి మార్గదర్శకులని అన్నారు. అవార్డులు పొందిన ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో విద్యార్థులను తీర్చిదిద్ది, భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కొయ్య ప్రసాదరావు, కస్సే భరత్ రాజు, గొంతి సతీష్, జె.డి. సునీతతో పాటు నియోజకవర్గ ఉత్తమ ఉపాధ్యాయులు రాజారత్నం, మూర్తి, రేవతి, కొలచన ప్రసాద్, పద్మశ్రీమణి తదితరులను ఏపీటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శోభన్ బాబు, యూనిట్ సభ్యులు విజయకుమార్ రాజు, జి. కృష్ణ, వసంత ప్రసాద్, చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్ పనులకు వేగంగా అంచనాలు సిద్ధం చేయాలి



**ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి మండలంలో జలజీవన్ మిషన్ కింద మంజూరైన 20 పనులకు త్వరితగతిన అంచనాలు సిద్ధం చేసి అందించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ చిట్టిబాబు సూచించారు. సోమవారం ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఉప ఎంపీడీవో దుర్గారావు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు, పంపు నిర్వాహకులు పాల్గొన్నారు. మంజూరైన పనులను ఆలస్యం లేకుండా చేపట్టేందుకు అవసరమైన అంచనాలను త్వరగా సిద్ధం చేసి సంబంధిత అధికారులకు అందించాలని సమావేశంలో సూచించారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యా రోహిణి, విద్యార్థులు.



**ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం**

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు విద్యా రోహిణి హై స్కూల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ తెలిపారు. స్థానిక విద్యా రోహిణి హైస్కూల్లో సోమవారం విలేకరులతో రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల నాలుగవ తేదీన ఏలూరు సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక జరిగినట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో బాలికల జట్టుకు విద్యా రోహిణి హై స్కూల్ విద్యార్థినులు 1. పిల్లి నాగవందన 2. రావూరి శరణ్య3. చుక్క రుక్మిణి4. పులపాకుల గాయత్రి5. జాస్తి మోక్షశ్రీ 6. మెంటి వినీల శ్రీ భవాని ఎంపికైనట్లు వివరించారు. ఈ ఎంపికైన విద్యార్థులు ఏలూరు జిల్లా టీం తరపున త్వరలో నూజివీడులో జరిగేరాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారుని తెలిపారు. కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రెడ్డి, హ్యాండ్ బాల్ రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలకు అయితపూడి హైస్కూల్ విద్యార్థులు నాలుగు ఎంపిక

పలువురు ప్రముఖులు అభినందనలు.




**ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు**

రగ్బీ, హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కాజులూరు మండలం అయితపూడి హైస్కూలుకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు.డి.ఎస్.ఏ గ్రౌండ్స్ కాకినాడలో సెప్టెంబర్ 30,అక్టోబర్ 1,3 తేదీలలో జరిగిన అండర్ 14 మరియు అండర్ 17 రాష్ట్ర స్థాయి రగ్బీ, హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు అయితపూడి హైస్కూల్ కు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.దీంతో తమ హైస్కూలుకు చెందిన నలుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి తెలిపారు.అండర్ 17 విభాగంలో కాకినాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటిలకు ఆర్..దుర్గాప్రసాద్, ఎం.మహాలక్ష్మి , అండర్ 14 విభాగంలో ఎన్టీఆర్ జిల్లా, అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న పోటీలకు ఎం.నిశివర్ధన్ రగ్బీ మరియు హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

ఈసంద ర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైస్కూల్ హెచ్.ఎమ్ పద్మావతి, ఉపాధ్యాయులు, ఎస్.ఎం.సిచైర్మన్, సభ్యులు, అయితపూడి హైస్కూల్ మౌలికవసతుల అభి వృద్ధి , క్రీడల అభివృద్ధికి సహకరిస్తున్న విద్యా దాతలు, గ్రామపెద్దలు తల్లితండ్రులు పాల్గొని అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న పీడీ జగదీష్ ని,రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఈసందర్భంగా అభినందించారు.

## ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం

- విద్య, వైద్యం, అత్యవసర సహాయానికి ప్రాధాన్యం
- రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. రవికుమార్



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘాన్ని మరింత పటిష్టం చేసి, జర్నలిస్టులు, వారి కుటుంబాల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. రవికుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కన్వీనర్లు, సంఘం ప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులను రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. రవికుమార్ సన్మానించారు.సమావేశంలో జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారి కుటుంబాల సంక్షేమంపైనా దృష్టి సారించాలని నిర్ణయించారు. ఆర్యవైశ్య జర్నలిస్టుల పిల్లల విద్యకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా విద్యానిధి కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు.అలాగే ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు ఆర్థిక సహాయం అందించడం, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా నిలవడం, కుటుంబ సంక్షేమానికి అవసరమైన సహాయ కార్యక్రమాలను చేపట్టడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా సంఘాన్ని మరింత బలోపేతం చేసి, రాష్ట్రవ్యాప్తంగా సభ్యులకు అందుబాటులో ఉండేలా కార్యాచరణ రూపొందిస్తామని రవికుమార్ పేర్కొన్నారు.

## రావులపాడులో ఘనంగా అంగన్వాడీ పోషణ ఉత్సవం

### తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీలు కీలకం.



**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట**

రావులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ ఉత్సవం వారోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ సూపర్‌వైజర్ చంద్రకళ హాజరై చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం ప్రాధాన్యతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌చార్జ్ పెచెట్టి చిన్నారావు మాట్లాడుతూ దేశ ప్రజల ఆరోగ్యానికి అంగన్వాడీ కేంద్రాలు పునాదిగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న వివిధ సదుపాయాలను తల్లులు, పిల్లలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు చిన్నారులు, గర్భిణులు, బాలింతల పట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పిల్లలకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విరమాత, చైర్మన్ కె. ప్రసాద్, పార్టీ అధ్యక్షుడు వి. శ్రీను, ఎన్. శ్రీను, వి. నాగార్జున, బి. రాము, టి. శ్రీనివాస్, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

### పిజిఆర్ఎస్ నందు 328 అర్జీలు

**జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్**




**ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు పారదర్శకమైన,జవాబు దారీతనంతో కూడిన సేవలు అందించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్.హరేశీధిర ప్రసాద్ స్పష్టం చేశారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహించారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ ...ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడు వు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతా యుతంగావ్యవహరించాలన్నారు.ప్రతి అర్జీని నమోదు చేసి, దాని పరిష్కార పురోగ తిని నిరంతరం పర్యవేక్షిం చాలని తెలిపారు. అర్జీల పరిష్కారంలో జాప్యం జరిగితే అందుకు సంబం ధించిన కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని,అర్జీ దారులకు నిర్ణీత సమయం లోగా సమాచారం అందించాలని ఆదేశించారు. డివిజన్,మండల కార్యాలయాలు,మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఎలక్ట్రీషియన్లకు అండగా యూనియన్

### -తాళ్లపూడి మండల నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**



మండలంలోని ఎలక్ట్రికల్ వృత్తిదారుల సంక్షేమం కోసం గత 15 ఏళ్లుగా కొనసాగుతున్న ఎలక్ట్రీ షియన్ల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ సభ్యులు తెలిపారు. ఎలక్ట్రికల్ వృత్తిని కొనసాగిస్తున్న వారంతా ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఉంటూ, ప్రతి నెలా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యులకు వృత్తిపరంగా ఎదురయ్యే సమ స్యలను చర్చించడంతో పాటు, ఆపదలో ఉన్న సభ్యులకు అండగా నిలుస్తూ యూనియన్ సేవలందిస్తోందన్నారు.నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా వై. రాజు, అధ్యక్షుడిగా బొట్టా భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా గోళ సురేష్, కార్యదర్శిగా ముప్పిడి రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా వేదుల్ల రాజు, కోశాధికారిగా సీలాబోయిన శ్రీను ఎన్నికయ్యారు.కార్యవర్గ సభ్యులు గా గౌరీ నాయుడు, కొడమంచిలి సోమరాజు, నూతంగి ప్రసాద్, ఎస్.ఎస్.వి. ప్రసాద్, నాగేంద్ర పాక తదితరులు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం సభ్యుల సంక్షేమానికి మరింత కృషి చేస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

# నేడు రంభా వెంకటప్పయ్య విగ్రహావిష్కరణ

**ప్రజా భూమి బ్యూరో-ఏలూరు జిల్లా.**



ఏలూరు నగరంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరు సాగించి నాయి బ్రాహ్మణ కులంలో పుట్టిన ఏకైక ధీరుడుగా రంభా వెంకటప్పయ్య తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. గతంలో స్వాతంత్ర సమరయోధుడిగా, ఏలూరు మున్సిపల్ వైస్ చైర్మన్గా, కోఆపక్షన్ సభ్యులుగా ఏలూరు పట్టణంలో ఎనలేని సేవలు అందించారు. గతంలో మహాత్మా గాంధీ పిలుపుమేరకు 1930లో ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొన్న ఖ్యాతిని సంపాదించారు. స్వాతంత్ర పూర్వం144 సెక్షన్ ధిక్కరించినందుకు గాను పోలీసుల లాఠీ లాటి దెబ్బలతో పాటుగా ఒక నెల రోజులు కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1931లో వయోజన విద్య హిందీ ఖద్దర్ వస్త్రధారణలో పాల్గొన్న ఖ్యాతిని పొందారు.రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఏలూరు జూట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సమయంలో జూట్ వర్కర్స్ సమ్మె సందర్భంగా వెంకటప్పయ్య 6 నెలల కఠిన కారాకారుల శిక్ష అనుభవించారు. తర్వాత ఇండియా రక్షణ చట్టం కింద ఒక సంవత్సరం శిక్ష విధించి మళ్లీ జైల్లో ఉంచడం జరిగింది. 1946లో రాయవేలూరు జైలుకు తీసుకువెళ్లారు. 1947 స్వాతంత్ర దినోత్సవ అనంతరం జైలు నుంచి విడుదల చేశారు. 1949లో తెలంగాణ పోరాట సమయంలో తిరిగి రాజమండ్రి, కడలూరు, మద్రాసు జైళ్ళలో రెండు వందల సంవత్సరాల పాటు డి టెన్గా నిర్బంధానికి గురై 19501లో స్వేచ్ఛను పొందారు. 1952 - 64 వరకు ఏలూరు కమ్యూనిస్టు పార్టీ మున్సిపల్ కౌన్సిలర్ గా, వైస్ ఛైర్మన్ గా పనిచేశారు. 1964లో తమ్మిలేరు వరద నిరోధక సంఘానికి కార్యదర్శిగా ఎన్నికయి తమ్మిలేరు కరకట్ట నిర్మాణానికి ఎనలేని కృషి చేసిన ఘనత వెంకటప్పయ్యకే దక్కింది. 1964 లో రెండో పట్టణ వాటర్ ట్యాంక్ నిర్మాణం కొరకు 14 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి సాధించిన పోరాట యోధుడు. 1919లో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రజలకు సరిపోవటం లేదన్న కారణం చేత ప్రజలకు నీటి కొరత తీర్చాలన్న ఉద్దేశంతో నిరాహా దీక్ష చేశారు. 1965లో పాకిస్తాన్ వార్ సందర్భంగా ఏలూరు పట్టణంలో విరాళములు సేకరణలో ప్రముఖంగా పాల్గొన్నారు. నేడు ప్రజలందరూ ఎంతగానో ఉపయోగపడుతున్న పాత బస్టాండు ఆనాడు 1970లో పాత బస్టాండ్ అభివృద్ధికి నిర్మాణానికి తన వంతు పోరాటాన్ని అందించారు. 1978లో పట్టణ అభివృద్ధి మండల ఏర్పాటు చేశారు. 1979లో పాత బస్టాండ్ యధావిధిగా కొనసాగేందుకు 11 రోజులు రంభా వెంకటప్పయ్య ఆమరణ నిరాహార దీక్ష చేశారు. అటువంటి గొప్ప వ్యక్తి ఉద్యమకారుడు, పోరాట యోధుడు యాదృచ్ఛికంగా నాయి బ్రాహ్మణ కులంలో పుట్టి అన్ని కులాల వారికి న్యాయం చేసే వ్యక్తిగా ఏలూరు ప్రజలు నేటికీ కొనియాడతారు. అటువంటి మహా మనిషి విగ్రహం ఏలూరు పాత బస్టాండ్ సమీపంలో పెట్టడానికి తన వంతు సహాయ సహకారాన్ని ఏలూరు ఎమ్మెల్యే అందించారు. నేటి ఉదయం పాత బస్టాండ్ సమీపంలో గూడ్స్ షెడ్ రోడ్ లో విగ్రహ విష్కరణకు ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ యాదవ్. ఎమ్మెల్యే బడేటి చంటి, విశిష్టా అతిథి రెడ్డి అప్పలనాయుడు ,ఆర్టీసీ రివిజినల్ మేనేజర్ సంఘ పెద్దలు పాల్గొంటున్నట్లు కుటుంబ సభ్యులు, విగ్రహ నిర్మాణ కమిటీ వారు తెలిపారు.

## భూర్లంకలో ఘనంగా గంగాలమ్మ జాతర

### -సంప్రదాయబద్ధంగా తెప్పపై అమ్మవారి ఊరేగింపు

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**



తాళ్లపూడి మండలం ప్రక్కిలంక పంచాయతీ పరిధిలోని భూర్లంక వీధిలో గంగాలమ్మ జాతరను గ్రామస్థులు శ్రద్ధాభక్తులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏడాది అక్టోబర్‌లో వడ్డీలు, పల్లీలు వర్గాల ప్రజలు కలసి నిష్ఠతో ఈ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలో భాగంగా గోదావరి నదీ మధ్యలో సహజంగా పెరిగే చొప్పదంటలను వారం, పది రోజుల ముందుగానే సేకరించి ఆరబెట్టి వాటితో ప్రత్యేక తెప్పను తయారు చేశారు. తెప్ప మధ్యలో శివపార్వతుల ప్రతిమలను ఏర్పాటు చేసి, పెళ్లికాని యువతీ యువకులు సంప్రదాయబద్ధంగా ఆ తెప్పను మోస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.తెప్పను మోసే పెళ్లికాని యువతీ యువకులకు త్వరలో వివాహం జరుగుతుందనే నమ్మకం తరతరాలుగా కొనసాగుతోందని గ్రామస్థులు తెలిపారు. ఈ విశ్వాసంతో తెప్పను మోసేందుకు పలువురు యువతీ యువకులు ఆసక్తిగా ముందుకు వస్తారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గ్రామంలో డప్పు వాయిద్యాలు, మేళతాళాల నడుమ నిర్వహించిన ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది.ఈ ఏడాది గంగాలమ్మ జాతరను డేరా పెద నాగేశ్వరరావు, పెంట కాంతారావు, రాంబాబు, డేరా రాంబాబు, పెంట శేఖర్, పెంట త్రిమూర్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

మంగళవారం 6 అక్టోబరు 2026

## ముంపు గ్రామాలలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై 6, 7 తేదీల్లో గ్రామసభలు.

సద్వినియోగం చేసుకోగలరు : తహసిల్దార్.

ప్రజాభూమి ప్రతినిధి-వేలేరుపాడు.



ఈనెల 6 7 తేదీల్లో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికై మండలంలో ని ముంపు గ్రామాలలో జరుగునున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని, తహసిల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. నార్లవరం పంచాయతీ కొత్తూరు సచివాలయం, తిరుమలాపురం పంచాయతీ నందు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూ శేఖరణ) , యూనిట్ 2,ఏలూరు వారు పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపు నకు గురి అగుచున్న భూములకు సంబంధించి,భూసేకరణ చేసిన భూముల నిమిత్తం గ్రామ సభ నిర్వహించడం జరిగుతుంది. గ్రామ సభ కు శ్రీమతి టి . మణి దివ్య సీనియర్ అసిస్టెంట్, జి . జ్యోతి జె ఏ, వి . యామిని సి ఓ ఏ . రామారావు జె ఏ ,.హాజరై స్ట్రక్చర్ వాల్యుయేషన్ వివరములు తెలిపి, అర్జీ లు తీసుకొనను న్నారు.సదరు అందు బాటులో లేని మిగిలిన పిడిఎఫ్స్ వివరములు స్థానిక వీఆర్వో కి అందజేయవలసినదిగా తెలిపియున్నారు. అదేవిధంగా ది.06-10-2026 న కోయిదా, కట్కూరు, సిద్దారం, ది.07-10-2026 న రుద్రంకోట, రేపాకగొమ్ము గ్రామ పంచాయతీలో జరిగే గ్రామ సభల్లో మీకు పెండింగ్ ఉన్న భూమి తాలూకు డబ్బులు, ఇంటికి రావాల్సిన డబ్బుల అర్జీలు స్వీకరిస్తారు.సదరు అవకాశాన్ని ప్రజలు వినియోగిం చుకోవలసినదిగా కోరడమైనది.

## బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆర్థిక సహకారం



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు బర్రింకలపాడులోని పోలవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజును కలిసి ఆర్థిక సాయం కోరారు.గ్రామస్తుల విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఏర్పాటు కోసం ఆర్థిక సహకారం అందజేశారు. గ్రామస్తుల అభ్యర్థనను సానుకూలంగా పరిగణించి వెంటనే సహాయం అందించిన ఎమ్మెల్యేకు రాచన్నగూడెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## పిడుగుపాటుకు జీలకర్రగూడెంలో రు. 2 లక్షల విలువ చేసే గేదె మృతి

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట



సోమవారం అకాల వర్షంతో పాటు పిడుగుపాటుకు జీలకర్రగూడెంలో పాడి గేదె మృతి చెందింది. బాహుబలేంద్రుని మోహన్‌సింగ్‌కు చెందిన గేదె వద్ద పిడుగు పడడంతో సంఘటన స్థలంలోనే గేదె మృతి చెందింది. తాను గేదెలను మేపుకుంటూ పాడి మీదే జీవిస్తోన్న మోహ న్‌సింగ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గేదె విలువ రు. 2 లక్షలు ఉంటుందని రైతు తెలిపారు. తాజా మాజీ సర్పంచ్ ఘోరింక దాసుతో పాటు టీడీపీ సీనియర్ నాయకులు కంతమనేని అంజిమూర్తి సంఘటన స్థలానికి వెళ్లి రైతు మోహన్‌సింగ్‌కు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. అక్కడ నుంచే వీఆర్వోతో పాటు పశువైద్య శాఖ అధికారికి తెలియజేశారు. పశు వైద్యులు పంచినామానంతరం ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయనున్నట్లు చెప్పారు.

# మాగ్నెట్ ఆక్స్ఫర్డ్ స్కూల్ పైన చర్యలు తీసుకోవాలి

### పీ.డీ.ఎస్.యు డిమాండ్.

ప్రజాభూమి బ్యూరో-ఏలూరు జిల్లా.

మాగ్నెట్ ఆక్స్ఫర్డ్ స్కూల్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీ.డీ.ఎస్.యు ఆధ్వర్యంలో ఏలూరు డివిజన్ డి వై యు ఎన్. రవీంద్ర భారతికి వినతి పత్రం ఇవ్వడం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ ప్రభుత్వాన్నిబంధనల ప్రకారం సెలవు దినములలో క్లాసులు నిర్వహించకూడదు అని ఉన్నప్పటికీ వాటిని ఏమాత్రం కూడా పట్టించుకోకుండా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కైకలూరు పట్టణం లో ఉన్నటువంటి మ్యాగ్నెట్ ఆక్స్ఫర్డ్ స్కూల్ యాజమాన్యం టెన్త్ క్లాస్ విద్యార్థులకు




యదేచ్ఛగా క్లాసులు నిర్వహించడమే కాకుండా వీకెండ్ టెస్ట్ ల పేరుతో పరీక్షలు నిర్వహిస్తుందని ఈ విషయం తెలుసుకొని పాఠశాల ముందు కైకలూరు పీ.డీ.ఎస్.యు కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారని అయితే యాజమాన్యం మాత్రం మాకు స్థానిక మండల విద్యాశాఖ అధికారి అనుమతిచ్చారని చెప్పిన నేపథ్యంలో పి.డి.ఎస్.యు విద్యార్థి సంఘం మండల విద్యాశాఖ అధికారికి ఫోన్ చేయడం జరిగిందని అయితే ఎంఈఓ ఆ యొక్క పాఠశాలలో క్లాసులు జరగకుండా అరిక ట్టడంలో విఫలమయ్యారని నాని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవడంలో స్థానిక ఎంఈఓ- 1 రామారావు విఫలమ య్యారని ఆయన పైన కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నాని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాగ్నెట్ ఆక్స్ఫర్డ్ స్కూల్ పైన విచారణ జరిపి ప్రభుత్వాన్నిబంధనలు ప్రకా రం చర్యలు తీసుకోవాలని నాని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పాఠశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించడం కూడా జరుగుతుందని నాని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు ఎమ్. మహేష్, ఇ. భవాని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్చరీ పోటిల్లో శీల విద్యార్థుల ప్రతిభ.

ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.

ఆర్చరీ పోటీల్లో కాజులూరు మండలం శీల హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరి క్రీడలు ప్రభుత్వ జూనియర్ కళాశాల పిఠాపురం శనివారం జరిగాయి.ఈ ఎంపికలలో శీల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ విశేష ప్రతిభను కనబరిచారు .అండర్ 19 బాలుర విభాగంలో గుంటముక్కల తేజస్ నాగ సాయి దుర్గ ,వీర శ్రీరామ్ ఎంపికైనట్లు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎన్ ఎల్ ఎన్ మూర్తి తెలియజేశారు. దీంతో ఎంపికైన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ టి ఎన్ వి ఆర్ మూర్తి ని ప్రధానోపాధ్యాయులు ఎన్ ఎల్ ఎన్ మూర్తి , ఎస్ యమ్ సి చైర్మన్ , ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు తదితరులు ఈసందర్భంగా అభినందించారు.

# క్వాంటమ్ సాంకేతికతపై తొలి అడుగు ప్లస్ కిస్కిట్ ఫాల్ ఫెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

ఆర్జీయుకేటి నూజివీడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ప్లస్ కిస్కిట్ ఫాల్ ఫెస్ట్ 2026"లో భాగంగా మొదటి రోజు కార్యక్రమాలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పరిశోధన, స్టార్టప్‌లు, పరిశ్రమల అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించారు. కిస్కిట్ ఫాల్ ఫెస్ట్ అనేది క్వాంటమ్ కంప్యూటింగ్‌పై విద్యార్థులు, డెవలపర్లు, పరిశోధకులు కలిసి నేర్చుకునే మరియు ప్రాజెక్టులు, హ్యాకథాన్‌లు, పరిశ్రమ అనుసంధానాల ద్వారా అనుభవం పొందే వేదికగా రూపొందించ బడింది. ఉదయం 10 గంటలకు విద్యార్థులు, పాల్గొనేవారి సమీకరణతో కార్యక్రమాలు ప్రారంభమై, అనంతరం ప్రముఖ అతిథుల సమక్షంలో అధికారిక ప్రారంభోత్సవం జరిగింది. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థనా గీతం, స్వాగత ప్రసంగం, కన్వీనర్ నివేదికతో పాటు "కిస్కిట్ ఫాల్ ఫెస్ట్ - 2026" లక్ష్యాలు, ప్రాధాన్యతలు, కార్యక్రమాల సమగ్ర అవలోకనాన్ని వివరించారు. క్వాంటమ్ అడ్వాంటేజ్ దిశగా అల్గారిథమ్స్‌పై అనుపమా రే కీలక ప్రసంగం:ఈ కార్యక్రమంలో ముఖ్య ఆకర్షణగా డా. అనుపమా రే, (సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, ఐబీఎం ఇండియా) నిలిచారు క్వాంటం మరియు ఏఐ రంగంలో పనిచేస్తున్న సాంకేతిక నిపుణురాలైన అనుపమా రే "అల్గోరిథమ్స్ టువార్డ్స్ క్వాంటం అడ్వాంటేజ్ అండ్ కెరీర్స్ ఇన్ క్వాంటం" (అల్గొరిత్మ్స్ టవర్డ్స్ క్వాంటుం అడ్వాంటేజ్ అండ్ కెరీర్స్ ఇన్ క్వాంటుం ) అనే అంశంపై కీలక ప్రసంగం చేశారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో కేవలం క్వాంటమ్ హార్డ్‌వేర్‌పై అవగాహన కలిగి ఉండటం మాత్రమే కాకుండా, సమర్థవంతమైన అల్గారిథమ్స్ రూపకల్పన, సమస్యలను క్వాంటమ్ దృక్పథంతో ఆలోచించడం, క్లాసికల్-క్వాంటమ్ కంప్యూటింగ్ సమన్వయం భవిష్యత్‌లో కీలకమవుతాయని ఆమె వివరించారు. క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో పరిశోధన, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, క్వాంటమ్ మెషిన్ లెర్నింగ్, అప్లికేషన్స్ వంటి అనేక కెరీర్ అవకాశాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటి నుంచే ప్రాథమిక సూత్రాలతో పాటు కిస్కిట్ వంటి సాధనాలపై ప్రాక్టికల్ పరిజ్ఞానం పెంచుకోవాలని, క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధిలో భారత్ వేగంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఐబిఎం ం1ఏఐ -క్వాంటమ్ కంప్యూటింగ్ సమన్వయంపై డా. శ్రీకాంత్ తుడుము అనంతరం మెంఫిస్, టెన్నెస్సీ, అమెరికాలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ రోబోటిక్స్ (ఇన్స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ రోబోటిక్స్) కు చెందిన ఏఐ డైరెక్టర్ డా. శ్రీకాంత్ తుడుము "ది కన్వర్జెన్స్ ఆఫ్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ క్వాంటం కంప్యూటింగ్" (ది కన్వెర్జెన్స్ ఆఫ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ అండ్ క్వాంటుం కంప్యూటింగ్ ) అంశంపై నిపుణుల ప్రసంగం చేశారు. ఏఐ ఇప్పటికే అనేక రంగాలను మార్చుతున్న తరుణంలో, భవిష్యత్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్‌తో ఏఐ కలయిక మరింత శక్తివంతమైన కంప్యూటింగ్ సామర్థ్యాలకు దారితీస్తుందని ఆయన వివరించారు. క్లాసికల్ కంప్యూటింగ్, ఏఐ క్వాంటమ్ టెక్నాలజీల మధ్య సమన్వయం ద్వారా సంక్లిష్టమైన సమస్యలకు కొత్త పరిష్కార మార్గాలను అభివృద్ధి చేయవచ్చని, విద్యార్థులు రెండు రంగాల్లోనూ ప్రాథమిక పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. భవిష్యత్ కంప్యూటింగ్‌పై డా. వెంకట్ మట్టెలా మార్గనిర్దేశం తదుపరి "సీరిమార్ఫిక్ టెక్నాలజిస్ ప్రైవేట్లిమిటెడ్" (చేరెమార్ఫిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ) వ్యవస్థాప




కుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా. వెంకట్ మట్టెలా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అధునాతన కంప్యూటింగ్ సాంకేతికతలు పరిశ్రమల భవిష్యత్తును ఎలా ప్రభావితం చేయబోతున్నాయో వివరిస్తూ, పరిశోధనతో పాటు ఆవిష్కరణ, పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వాస్తవ సమస్యల పరిష్కారానికి అన్వయించడం అవసరమని సూచించారు. క్వాంటమ్ సాంకేతికతలో పారిశ్రామిక అవకాశాలపై ఎంటర్‌ప్రెన్యూర్ టాక్ అనంతరం సాఫ్ఫైర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (సియా సాఫ్ట్ వేర్ ఇన్నోవాషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ) వ్యవస్థాపకుడు, ఎండీ ఓ సీటీఓ నాగసాయి దుర్గా నాగేశ్ శేషబట్ల వెంకట ఎంటర్‌ప్రెన్యూర్ టాక్‌లో పాల్గొన్నారు. సాంకేతిక ఆలోచనలను ఉత్పత్తులు, సేవలు, స్టార్టప్ అవకాశాలుగా మార్చే విధానం, ఆవిష్కరణలకు పరిశ్రమల అవసరాలను అనుసంధానించడం, యువతలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ దృక్పథం పెంపొందించు కోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, క్వాంటమ్ డెమో, స్టార్టప్ సమ్మిట్ ప్రధాన కార్యక్రమాలతో పాటు ప్రాజెక్ట్ ఎక్స్పో, క్వాంటం డెమో, క్వాంటం స్టార్టప్ సమ్మిట్‌లను సమాంతరంగా నిర్వహిం చారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, క్వాంటమ్ కంప్యూటింగ్ ఆధారిత ఆలోచనలు, సాంకేతిక ప్రదర్శనలు పాల్గొనేవారిని ఆకట్టుకున్నాయి. క్వాంటమ్ రంగంలో పరిశోధనను స్టార్టప్‌లు, పరిశ్రమలతో అనుసంధానించే అవకాశాలపై కూడా చర్చలు జరిగాయి. కిస్కిట్ పై ప్రత్యక్ష ప్రదర్శన సాయంత్రం హ్యాండ్స్ ఆన్ కిస్కిట్ డెమోలో భాగంగా విద్యార్థులకు క్వాంటమ్ సర్క్యూట్ల నిర్మాణం, వాటి అమలు విధానం, కిస్కిట్ ద్వారా ప్రాక్టికల్‌గా ప్రయోగాలు చేసే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. కేవలం సైద్ధాంతిక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, విద్యార్థులు స్వయంగా క్వాంటమ్ సర్క్యూట్లను రూపొందించి వాటి ఫలితాలను అర్థం చేసుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో తొలి రోజు ముగింపురోజంతా సాంకేతిక, శాస్త్రీయ కార్యక్రమాలతో కొనసాగిన అనంతరం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల కళా ప్రతిభను ప్రదర్శించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి.ఫెస్ట్ తొలి రోజు కార్యక్రమాలు విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్‌పై సైద్ధాంతిక అవగాహనతో పాటు పరిశ్రమ, పరిశోధన, స్టార్టప్‌లు మరియు భవిష్యత్ కెరీర్ అవకాశాలపై సమగ్ర దృక్పథాన్ని అందించాయి.ఈ కార్యక్రమాలు ఆర్జీయుకేటి నూజివీడు పర్యవేక్షణలో ఆచార్య ఎం.ఎల్.ఎన్. రావు ఆధ్వర్యంలో, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. అమరేంద్ర కుమార్, వెంకట్ మట్టేలా సీఈఓ సెరేమోఫిక్, ఎల్. సుబ్రహ్మణ్యం, సీవీ శ్రీధర్ డైరెక్టర్ ఏపి స్టేట్ మిషన్, మన్నవ మోహన్ కృష్ణ చైర్మన్ ఆంధ్రప్రదేశ్, అనుపమ రే ఐబిఎం సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్, కార్యక్రమాల కన్వీనర్లు డా. పావని, డా. కేకే సింగ్, సీఏవో డా. బండి ప్రసాద్, ఈఐటీపి డీన్ శ్యామ్, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ డా. చిరంజీవి, ఫైనాన్స్ ఆఫీసర్ డా. శ్రీనాథ్, డీడబ్ల్యూ బాయ్స్ ఓ గాళ్స్ , డా. రాజేష్, డా. దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నరేంద్ర మోడీ జన్మదినోత్సవం

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు నియోజకవరం మన ప్రియతమ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ జన్మదినోత్సవ మరియు 25 సంవత్సరాల సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా సోమవారం నూజివీడు పట్టణం 30వ వార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బిజెపి జాతీయ పార్టీ అధ్యక్షులు ఇచ్చిన పిలుపుమేరకు ఏలూరు జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు శ్రీమతి మానూరు పద్మావతి అధ్యక్షోపన్యాసం లో, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు మరియు పిల్లలకు తీసుకునే పౌష్టికాహారం గురించి పలు జాగ్రత్తలు చెప్పారు. కేంద్రం లోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం , రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ లో, అంగన్వాడిల ద్వారా తల్లులు మరియు పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం ద్వారా ఎంతోమంది పిల్లలు ,లబ్ధి పొందుతున్నారు అని తెలిపారు. మన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ అంగన్వాడి సెంటర్ల పై చూపుతున్న ప్రేమ ఆదరాభిమానాలు గురించి కొనియాడారు ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీ మాగంటి వాసు ఓబీసీ మోర్చా ఏలూరు జిల్లా మీడియా కన్వీనర్ శ్రీ మానూరు తిరుమల ప్రసాద్ నూజివీడు గ్రామీణ మండలం కు చెందిన మహిళా మోర్చా సెక్రెటరీ జూట్రూ నాగవసంత ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్ శ్రీమతి అరుణ అంగన్వాడి సెంటర్లో విద్యను అభ్యసిస్తున్న చిన్న పిల్లలు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొనడం జరిగింది. ఈ



సందర్భంగా నూజివీడు నియోజకవర్గశీ బీజేపీ నేత గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు తమ సందేశంలో గౌరవ మోదీ 25 సంవత్సరాల సుపరిపాలన పై,జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలను అభినందించారు.

## 7న విద్యుత్ నిలుపుదల ప్రాంతాలు ఇవే

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

నరసాపురం 132 కెవి సబ్ స్టేషన్‌లో మరమత్తులు కారణంగా ఈ నెల 7న పాలకొల్లు నియోజకవర్గం లోని పాలకొల్లు, ఎలమంచిలి , పోడూరుమండలాలు, పాలకొల్లు మున్సిపల్ ఏరియాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఎగ్జిక్యూటివ్ఇంజినీర్,ఎలక్ట్రికల్,నరసాపురం డివిజన్ కే . మధు కుమార్ , ఎ డి ఈ రామకృష్ణ, ఏఈ బాబ్జి ఒక ప్రకటన లో తెలిపారు. కావునవిద్యుత్వినియోగ దారులందరూ సహకరించవలసిందిగా వారు ఆ ప్రకటన లో కోరారు.

## యువ క్రాంతి శిక్షణ శిబిరంలో ఏలూరు యువజన కాంగ్రెస్ నేతలు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న మూడు రోజుల 'యువ క్రాంతి బునియాది ట్రైనింగ్ క్యాంపు'లో ఏలూరు జిల్లా, నగర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.ఏలూరు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొల్లి రామ సూరి రెడ్డి,రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సతీష్ రాయల్,ఏలూరు సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బురదగుంట లివిన్ క్రిస్టియన్ శిక్షణ శిబిరానికి హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నూనె పవన్ తేజ నాయుడు ఆధ్వర్యంలో అక్టోబర్ 5,6, 7 తేదీల్లో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహి స్తున్నారు.ఢిల్లీకి చెందిన పలువురు జాతీయ స్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులు హాజరై కార్యకర్తలకు వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, యూత్ కాంగ్రెస్ కార్యకలాపాలు,నాయకత్వ లక్షణాలు,ప్రజా సమస్యలపై పోరాటం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి,ఏపీ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ లెనిన్ ప్రసాద్, కో-ఇన్‌చార్జ్ మమతా నాగిరెడ్డి,నేషనల్ సెక్రటరీ నాగ మధు యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రజా సమస్యలపై మరింత సమర్థవంతంగా పనిచేసేలా ఈ శిక్షణ శిబిరం దోహదపడుతుందని నాయకులు తెలిపారు.

## రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే చింతమనేని ఘన స్వాగతం



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

నియోజకవర్గంలో రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్స్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోమవారం పర్యటించారు.పెదవేగి మండలం దుగ్గిరాల ప్రధాన కూడలి వద్ద దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.అనంతరం కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులను మంత్రికి పేరుపేరునా పరిచయం చేశారు.అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి మంత్రి ఓఎస్డీ వడ్లపట్ల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి,ఇటీవల మృతి చెందిన ఆయన తండ్రి వడ్లపట్ల పెద రామబ్రహ్మం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గారపాటి రామసీత,టీడీపీ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్,అయినాల వెంకటనారాయణ,వడ్లపట్ల నాగేంద్ర ప్రసాద్ తదితరులతో పాటు పలువురు కూటమి నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనకు ఉపాధ్యాయులే కీలకం.

### ఉపాధ్యాయులకు సత్కారం.

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం.

విద్యార్థులను క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర అపారమని, సమ సమాజ స్థాపనలో వీరి పాత్ర కీలకమని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రామచంద్రపురం పట్టణం తోటవారి వీధిలో గల శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌లో సోమవారం వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులందరినీ దుస్సాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని, తమ వద్దకు వచ్చే ప్రతి విద్యార్థినీ క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తూ, సమాజానికి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను గురువులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ జన్మకు సార్థకత చేకూర్చే విజ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులేనన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీస్తూ, వారిని ప్రయోజకులుగా మారుస్తున్న ఉపాధ్యాయ లోకానికి నా హృదయపూర్వక పాదాభివందనాలు అని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.ఆర్ రాజు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల జీవితాల్లో పునాది రాయి వంటిది. విద్యార్థుల భవిష్యత్తును ప్రణాళికాబద్ధంగా దిద్దితీర్చే శిల్పులు మన ఉపాధ్యాయులు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు పడుతున్న శ్రమ అభినందనీయం. ఉపాధ్యాయుల సేవలకు గుర్తింపుగా వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా కమిషనర్ హామీ ఇచ్చారు.

## వెలివెలలో అంగన్వాడి ఉత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం వెలి వెల గ్రామంలో సోమవారం అంగన్వాడి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గర్భవతులకు శ్రీమంతాలు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్కు సాలువాల్తో సత్కారాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు కోటి రాంబాబు, దొమ్మేటి ఏసుబాబు, ఖండిబోయిన నాగేశ్వరరావు, కొప్పినీడి శ్రీనివాస్, అంగన్వాడి వర్కర్స్ పాల్గొన్నారు.

# ఈఎస్ఐలో కార్మికులకు అందని వైద్యం

- డాక్టర్లు, సిబ్బంది నియామకం చేపట్టాలి -మందులు పంపిణీ చేయాలి
- 30 వేల మంది కార్మికుల ఆరోగ్యంతో చెలగాటం తగదు
- యూటీయూసీ, జైభీమ్‌రావు భారత్ పార్టీ, దళిత సమైక్య డిమాండ్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

కార్మికుల నుంచి ప్రతి నెలా కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న ఈఎస్ఐ వ్యవస్థ.. వారికి వైద్య సేవలు అందించడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని యూటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసులు, దళిత సమైక్య నాయకులు ఎస్.నారాయణ, జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఊటుకూరు నాగరాజు విమర్శించారు. హిందూపురం ఆజాద్‌నగర్‌లోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో రెగ్యులర్ డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈఎస్ఐ డిస్పెన్సరీని వారు పర్యవేక్షించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. హిందూపురం కొట్నూరు ఈఎస్ఐ డిస్పెన్సరీ పరిధిలో సుమారు 30 వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు వైద్య సేవలు పొందుతున్నారని నాయకులు తెలిపారు. ఇంత మందికి వైద్యం అందించాల్సిన ఆసుపత్రిలో అవసరమైన స్థాయిలో సిబ్బంది లేకపోవడం దారుణమన్నారు. ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక హెడ్‌నర్సు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఒక ఏఎన్ఎం, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక క్లర్క్,



ఇద్దరు అటెండర్లు, ఒక స్వీపర్, ఒక నైట్ వాచ్‌మన్, ఒక ఎఫ్ఎన్ఓ, ఒక ఎంఎన్ఓ, ఒక ఆయా తదితర సుమారు 18 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుతం ఒక ఏఎన్ఎం, ఒక ల్యాబ్ టెక్నీషియన్ మినహా దాదాపు అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఒక డాక్టర్ అనంతపురం నుంచి డిప్యుటేషన్‌పై, హెడ్‌నర్సు తిరుపతి నుంచి, మరో సిబ్బంది గుంతకల్లు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి వారంలో కొన్ని రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. డిప్యుటేషన్ సిబ్బందితో ఇంత పెద్ద సంఖ్యలో కార్మికులకు వైద్య సేవలు అందించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అత్యవసర పరిస్థితుల్లో కార్మికులు ఎక్కడికి వెళ్లాలో తెలియని దుస్థితి నెలకొందన్నారు. కార్మికులు, యజమానులు కలిసి ప్రతి నెలా సుమారు రూ.1.80 కోట్ల మేర ఈఎస్ఐకి చెల్లిస్తున్నారని నాయకులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు సమకూరుతున్నప్పటికీ కార్మికులకు మాత్రం కనీస స్థాయిలో వైద్య సదుపాయాలు అందకపోవడం దారుణమన్నారు. ఈఎస్ఐ నిధులను కార్మికుల వైద్య అవసరాల కోసం సమర్థవంతంగా వినియోగించాలని కోరారు. ఈఎస్ఐలో మందుల కొరత కూడా తీవ్రంగా ఉందని తెలిపారు. సుమారు 150 రకాల మందులు అందుబాటులో ఉండాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం 40 రకాల మందులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. జనవరిలో మందులు వచ్చినప్పటికీ ప్రస్తుతం కొరత ఏర్పడిందని, మందుల కోసం ఇండెంట్ పంపామని అధికారులు చెబుతున్నారని తెలిపారు. అవసరమైన మందులు ఎప్పుడు వస్తాయో, కార్మికులకు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్లే పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితుల్లో మందుల పంపిణీ కూడా సక్రమంగా ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అద్దె భవనంలో కొనసాగుతున్న ఈఎస్ఐ డిస్పెన్సరీ పరిస్థితి కూడా అధ్వానంగా ఉందన్నారు. వర్షాకాలంలో భవనం మొత్తం నీటిమయంగా మారుతోందని తెలిపారు. కార్మికులకు మెరుగైన వైద్యం అందించాల్సిన ఆసుపత్రి వర్షం వస్తే రోగులకు ఇబ్బందులు కలిగించే పరిస్థితిలో ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. హిందూపురంలో ఈఎస్ఐ సొంత భవనం నిర్మాణం కోసం పదేళ్ల క్రితమే 50 సెంట్ల స్థలాన్ని సర్వే చేసి సిద్ధం చేశారని తెలిపారు. భవన నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే కూడా కృషి చేశారని పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు భవన నిర్మాణం ఎందుకు ప్రారంభం కాలేదో అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని అన్నారు. ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ డాక్టర్లు, నర్సులు, ఫార్మసిస్టులు, ల్యాబ్ సిబ్బంది, ఇతర సిబ్బందిని నియమించి కార్మికులకు నిరంతర వైద్య సేవలు అందించాలని కోరారు. ఈఎస్ఐకి సొంత భవనం నిర్మించి, అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని, కార్మికుల నుంచి వసూలు చేస్తున్న నిధులకు తగిన విధంగా వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.

# గ్రాట్యూటీ చెల్లించి కార్మికుడికి న్యాయం చేయాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

తూమకుంట పారిశ్రామికవాడలోని షాలిమార్ ఇన్సెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అగరబత్తి తయారీ పరిశ్రమలో పనిచేసిన కార్మికుడు సురేష్‌కు చట్టప్రకారం రావాల్సిన గ్రాట్యూటీని వెంటనే చెల్లించి న్యాయం చేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్‌లో డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకులు తెలిపిన వివరాల మేరకు.. సురేష్ సుమారు ఆరేళ్లపాటు సదరు పరిశ్రమలో విధులు నిర్వహించారు. అనివార్య కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేసి ఏడాది కావస్తున్నప్పటికీ, ఇప్పటివరకు చట్టప్రకారం తనకు రావాల్సిన గ్రాట్యుటీని యాజమాన్యం చెల్లించలేదని తెలిపారు. గ్రాట్యూటీ కోసం పలుమార్లు పరిశ్రమ



చుట్టూ తిరిగినా యాజమాన్యం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే యాజమాన్యం గతంలోనూ కొంత మంది కార్మికులకు గ్రాట్యుటీ తదితర ప్రయోజనాలను చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిందని, కార్మిక సంఘాల నాయకులు పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టిన అనంతరం చెల్లింపులు చేసిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. కార్మికులకు చట్టబద్ధంగా అందాల్సిన ప్రయోజనాలను ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శ్రమ దోపిడీకి దారితీస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన యాజమాన్యం వాటిని తుంగలో తొక్కితే కార్మికులకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. అధికారులు ఈ విషయంపై సమగ్రంగా విచారణ జరిపి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవడంతోపాటు సురేష్‌కు రావాల్సిన గ్రాడ్యుటీని వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, కార్మిక నాయకులు రవికుమార్, శివానంద, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తాం: మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

### -శ్రీకాళహస్తిలో వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం- కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీకాళహస్తి మండల విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు (ఐడీ) కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ప్రతి వార్డు మరియు గ్రామంలో ప్రజాదరణ, అంకిత భావం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి, వారి ఘన విజయానికి నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై నిలిచి సమిష్టిగా కృషి చేయాలి అన్నారు.కూటమి ప్రభుత్వ బెదిరింపులకు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదు.పార్టీ శ్రేణులకు నేను ఎల్లవేళలా అండగా ఉంటాను. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తాం.జగనన్న హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ తీసుకెళ్లాలి. వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి బలాన్ని దెబ్బతీయడం ఎవరి తరమూ కాదు.2029 సార్వత్రిక ఎన్నికల్లో వైయస్ జగన్ మోహన్ రెడ్డిని తిరిగి అత్యధిక మెజార్టీతో ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడమే మనందరి ప్రధాన లక్ష్యం. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయంతో అధికారంలోకి రావడం ఖాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల సీనియర్ నాయకులు బర్రి సుదర్శన రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చెలికం నాగరాజు రెడ్డి, రంగినేని చెంచయ్య నాయుడు, యుగంధర్ రెడ్డి కందాటి, సురేంద్ర యాదవ్, గంగిరెడ్డి, భాను మూర్తి యాదవ్, వయ్యాల మనోహర్ రెడ్డి, నలుగురి రవి, ఖూ సుబ్రమణ్యం, మునిరత్నం





రెడ్డి, కృష్ణయ్య, రవీంద్ర రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధుమోహన రెడ్డి, ముని రాజా, గురునాథం రెడ్డి, రామచంద్రయ్య, అంకయ్య, భాను రెడ్డి, ప్రభోస్, మోడీ రాజా, సురేష్, రామచంద్రా రెడ్డి, శివా రెడ్డి, గుణ, శివ, జయకృష్ణ రెడ్డి, ఎల్లయ్య, రాజా రెడ్డి, తిరుపాల్ యాదవ్, మనోహర యాదవ్, దిలీప్ బంగారు, రంగయ్య, పోలి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చుక్కల మహేష్, నాగభూషణం, డి వి రమణ, మద్దిల ప్రకాష్, కోటి రాయల్, కిరణ్ రాయల్, శంకర్ యాదవ్, శివ ఈశ్వరయ్య, వెంకట రెడ్డి, కలివేళయ, ప్రసాద్ యాదవ్, అమర్‌నాథ్ రెడ్డి, పండయ్య యాదవ్, జయకృష్ణ, నక్క పెంచులయ్య, ప్రసాద్, శివ రాయల్, భాను ప్రకాష్ రెడ్డి, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల అభివృద్ధిపై మంత్రి సవిత వ్యాఖ్యలు సిగ్గుచేటు: సర్వోత్తం రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

ప్రొద్దుటూరు సభలో ఇన్‌చార్జ్ మంత్రి సవిత పులివెందుల ప్రాంతాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్ అభివృద్ధి చేయలేదని మాట్లాడటం సిగ్గుచేటని మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కంచర్ల సర్వోత్తం రెడ్డి మండిపడ్డారు.సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో ఏ గ్రామంలో అభివృద్ధి జరిగిందో తాము చూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేవలం పేరు కోసమే జగన్ శిలాఫలకాలు వేశారనడం సిగ్గుచేటన్నారు.పార్నపల్లి డ్యాంలో 10 టీఎంసీల నీళ్ల నిల్వ సామర్థ్యాన్ని పెంచిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డిదేనన్నారు. పులివెందుల నియోజకవర్గంలో జగన్ కట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, మెడికల్ కాలేజీ మీ కళ్లకు కనిపించలేదా అని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ లో 90 శాతం పనులు జగన్ ప్రభుత్వంలోనే పూర్తయ్యాయన్నారు. అధికారంలోకి వచ్చి 28 నెలలు కావస్తున్నా మిగిలిన 10 శాతం పనులు ఇప్పుడు పూర్తి చేసి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధిపై చర్చకు జగన్ అవసరం లేదని, వైకాపా కార్యకర్తగానే తాను సమాధానం చెబుతానని సవాల్ విసిరారు. 28 నెలల్లో రాష్ట్రంలో మీరేం అభివృద్ధి చేశారో చూపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## రేలగుంటకు చెందిన జర్నలిస్టు ఉమేష్ రాసిన కలరా వ్యాధి కథనానికి, స్పందించిన ప్రభుత్వ ఆరోగ్య శాఖ



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో శనివారం, ఆదివారం నిర్వహించిన విలేకరుల శిక్షణా తరగతులలో మొదటి రోజు సురేష్ పిళ్ళై మాట్లాడుతూ విలేకరులు రాసే వార్త ఎంత గొప్పగా ఉంటుందో అని చెప్పడానికి ఉదాహరణ గా రేణిగుంటకు చెందిన జర్నలిస్ట్"ఉమేష్" 1999 లో ఓ వార్తా పత్రికలో "కలరా" గురించి రాసిన వార్త ఎంతోమంది ప్రాణాలను కాపాడిందని చెప్పారు. రాత్రి 11 గంటలకు మనకు ఎందుకులే అనుకోకుండా "కలరా" గురించి ఆర్టికల్ రాయడం వలన పేపర్ ప్రింట్ అయి బయటకు వచ్చిన కొద్ది సమయానికే ఉదయం ఆరు గంటలకే ప్రభుత్వ రంగ సంస్థలు ఆ ప్రాంతమంతా మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ఎంతోమంది ప్రాణాలను కాపాడడంలో తన వంతు పాత్ర పోషించిన జర్నలిస్ట్ "ఉమేష్" ను ఎన్ని సంవత్సరాలు అయినా మర్చిపోలే మని ఈ సభాముఖంగా తెలిపారు.

## ముద్దిరెడ్డిపల్లి నుంచే వైసీపీ విజయభేరి మోగాలి

### -గుడ్డంపల్లి వేణు రెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ముద్దిరెడ్డిపల్లి ప్రాంతం నుంచే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించాలని ఆ పార్టీ నియోజకవర్గ ముఖ్య నేత గుడ్డంపల్లి వేణురెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ముద్దిరెడ్డిపల్లి ప్రాంతానికి చెందిన వైసీపీ శ్రేణులు గుడ్డంపల్లి వేణురెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికలపై పార్టీ శ్రేణులతో ఆయన చర్చించారు. అనంతరం వేణు రెడ్డి మాట్లాడుతూ, త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ముద్దిరెడ్డిపల్లి ప్రాంత పరిధిలోని అన్ని వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీ శ్రేణులు ఐకమత్యంతో పనిచేసి వైసీపీ సత్తాను చాటాలని సూచించారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే వార్డుల వారీగా ప్రజలను కలుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యకర్తలే పార్టీకి బలమని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తే మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ముద్దిరెడ్డిపల్లి ప్రాంతంలో వైసీపీకి ఉన్న బలాన్ని మరింత పెంచుకుని అన్ని వార్డుల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ జెండా రెపరెపలాడేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బీకే నవీన్, అంగడి నారాయణ రెడ్డి, శ్రీనివాసులు, శేఖర్, బాబు, ఉదయ్, మూర్తి, నూతన్ ప్రసాద్, హర్ష, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని 11 కేవీ హిందూపురం ఆర్టీసీ లైన్ కింద విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. ఈ అంతరాయం ఆర్పీజీటీ రోడ్డు, 1వ ఆర్టీసీ కాలనీ, త్యాగరాజు నగర్, శాంతి నగర్, చైతన్య నగర్, గాజుల వీధి, పాంచజన్య స్కూల్ ప్రాంతం, అమర్‌నాథ్ రెడ్డి హాస్పిటల్ ప్రాంతం, సాయి శ్రీనివాస్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత ప్రాంతాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

## భూమి మార్పిడిపై విచారణ చేయాలి

### -రెవెన్యూ అధికారం ఆశ్రయించిన బాధితురాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

భర్త మృతి అనంతరం తమ కుటుంబానికి చెందిన భూమి విషయంలో తనకు తెలియకుండా పట్టా మార్పిడి, మ్యూటేషన్ జరిగినట్లు ఆరోపిస్తూ గంగమ్మ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌ను ఆశ్రయించారు. తన కుటుంబ భూమిపై జరిగిన మార్పులపై సమగ్రంగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరుతూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. గంగమ్మ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తన భర్త ఈ.రంగప్ప పేరుతో హిందూపురం మండలం చలివెందల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 495-2బి, 495-3బిలో భూమి ఉందన్నారు. తన భర్త 2023 డిసెంబర్‌లో మృతి చెందినట్లు తెలిపారు. ఆయన మృతి అనంతరం కుటుంబానికి చెందిన భూమి విషయంలో రెవెన్యూ రికార్డుల్లో మార్పులు చోటుచేసుకున్నట్లు గుర్తించామన్నారు. ముఖ్యంగా ఈ.గవెప్ప పేరుతో భూమికి సంబంధించిన మ్యూటేషన్, పట్టా మార్పిడి జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ ప్రక్రియ తనకు ఎలాంటి సమాచారం లేకుండా జరిగిందని గంగమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్త పేరుతో ఉన్న భూమిపై తన కుటుంబానికి ఉన్న హక్కులను పరిరక్షించాలని కోరారు. తనకు తెలియకుండా జరిగినట్లు చెబుతున్న పట్టా మార్పిడి, మ్యూటేషన్‌కు సంబంధించిన రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని, సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలు సేకరించి సమగ్ర విచారణ చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భూమి రికార్డుల్లో మార్పులు జరిగి ఉంటే వాటిని రద్దు చేసి, హక్కుదారుల హక్కులను పరిరక్షించాలని కోరారు. ఈ మేరకు భూమికి సంబంధించిన పత్రాలను డిప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు అందజేసినట్లు గంగమ్మ తెలిపారు.

## అనాథ వృద్ధులకు అన్నదానం

### - అనాథ వృద్ధుల పట్ల శ్రద్ధ చూపాలి



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పాత గండి రోడ్డులోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం అనాథ వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. శింగారెడ్డి వీరమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు ఓబుల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ధర్మారెడ్డి దంపతులు అన్నదానంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ప్రతి ఏడాది వీరమ్మ వర్ధంతితో పాటు నవంబర్ 14న వారి తండ్రి జ్ఞాపకార్థం కూడా అనాథ వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనాథ వృద్ధులకు సేవ చేయడం సంతృప్తినిస్తోందని, ఆశ్రమ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనాథ వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓబులమ్మ, రెడ్డమ్మ, నాగేశ్వరి, సౌజన్య, మౌక్తికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కసనూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ ప్రారంభం

### ప్రారంభించిన క్లస్టర్ ఇంచార్జ్ భరత్ రెడ్డి



ప్రజాభూమి, పులివెందుల

కసనూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్, మెడికల్ క్యాంప్ ను పులివెందుల నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మారెడ్డి భరత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నంద మూరి తారక రామారావు, బసవతార కం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు భరత్ రెడ్డి తెలిపారు. క్యాన్సర్ ను ముందస్తుగా గుర్తించడం ద్వారా సకాలంలో చికిత్స పొందే అవకాశం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సింహాద్రిపురంలో నేడు, రేపు క్యాంప్ -సింహాద్రిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు, రేపు (అక్టోబర్ 6,7) ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంప్ కొనసాగుతుందని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పవన్ కళ్యాణ్‌కు సుంకర శ్రీనివాస్ ఘన స్వాగతం

### - కడప మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు



ప్రజాభూమి, కడప

ప్రొద్దుటూరులో నిర్వహించిన జల జీవన్ మిషన్--అమరజీవి జలధార ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు హెలిప్యాడ్ వద్ద జనసేన పార్టీ ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటర్, కడప అసెంబ్లీ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్‌కు ఆత్మీయంగా స్వాగతం పలికిన సుంకర శ్రీనివాస్, సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా తాను నిర్వహించిన శ్రీ సుదర్శన ఆయుష్ చక్ర హోమంలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన వారాహి అమ్మవారి శాలువాను సమర్పించారు. హోమ గుండంలోని పవిత్ర భస్మాన్ని కూడా అందజేశారు. రానున్న కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీ తరఫున కడప మేయర్ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని పవన్ కళ్యాణ్‌ను సుంకర శ్రీనివాస్ కోరారు. నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక, అవినీతి రహిత పాలన కోసం పనిచేస్తానని తెలిపారు. జల జీవన్ మిషన్--అమరజీవి జలధార ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సుంకర శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ తిరుగు ప్రయాణం సందర్భంగా హెలిప్యాడ్ వద్ద సుంకర శ్రీనివాస్ వీడ్కోలు పలికారు.